
'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 291

బుధవారం 11-1-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి బిజినెస్
బుధవారం
11-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	632	60,115
నిఫ్టీ ▽	187	17,914

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	10,681	△ 45
డోజోన్స్	33,566	△ 48
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,694	△ 30
డాక్స్	14,775	▽ 18
షాంఘై	3,170	▽ 7
నికాయ్	26,176	△ 202

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	55,974	▽ 285
బంగారం (99.5 స్వచ్ఛత)	55,750	▽ 284
వెండి (కిలో)	67,629	▽ 1,162

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.53	83.20
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	98.56	101.94
€	యూరో	ఎస్‌బీఐ	86.86	89.96
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.47	63.48
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.72	58.13
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.86	62.85
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.81	22.49
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.37	23.17
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.95	12.97

లాట్ మొబైల్స్ మెగా ఆఫర్స్



హైదరాబాద్: నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ పర్వదినాలను పురస్కరించుకుని ప్రముఖ లాట్ మొబైల్స్ మెగా ఆఫర్స్‌ను ప్రకటించింది. సంస్థ డైరెక్టర్ ఎం.అఖిల్, బ్రాండ్ అంబాసిడర్ రష్మిక మందాన ఈ ఆఫర్లను ఆవిష్కరించారు. ప్రతి స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై గిజ్మోర్ బ్లేజ్ ప్రో స్మార్ట్ కాలింగ్ వాచ్, టోరెటో స్మార్ట్ బ్లూమ్–3 స్మార్ట్ వాచ్, స్మార్ట్ బ్లూటూత్ నెక్ బాండ్ లభించనున్నట్లు ఈ సందర్భంగా విడుదలైన ప్రకటనలో అఖిల్ తెలిపారు. 32 అంగుళాల స్మార్ట్ టీవీ ధరపై 40 అంగుళాల టీవీ ఆఫర్ కూడా ఉందని పేర్కొన్నారు. రూ.8999కే స్మార్ట్ టీవీ, రూ16,500కే లాప్ టాప్స్ ఆఫర్ అమల్లో ఉందన్నారు. స్మార్ట్ మొబైల్స్ కొనుగోలుపై రూ.10,000 వరకూ క్యాష్ బ్యాక్, జీరో వడ్డీ, వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు, 70 శాతం వరకూ అష్యూర్డ్ పే బ్యాక్, టీవీ, ఏసీ, రిఫ్రిజిరేటర్‌లకు 6 నెలల ఉచిత సర్వీస్, పలు ఆఫర్లను అందుబాటులో ఉంచినట్లు అఖిల్ వివరించారు.

బీఎండబ్ల్యూ కొత్త కారు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ బీఎండబ్ల్యూ ఇండియా.. కొత్త 3 సిరీస్ గ్రాన్ లిమజిన్ మోడల్‌ను భారత్‌లో ప్రవేశపెట్టింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.57.9 లక్షల నుంచి ప్రారంభం. 2 లీటర్ ఫోర్ సిలిండర్ ఇంజన్‌తో డీజిల్, పెట్రోల్ వేరియంట్లలో లభిస్తుంది. పెట్రోల్ వేరియంట్ గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 6.2 సెకన్లలో, డీజిల్ వేరియంట్ 7.6 సెకన్లలో అందుకుంటుంది. దేశీయంగా ఈ కారును తయారు చేస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-1-2023	
విశాఖ	565-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	556-00
విజయవాడ	556-00
రిటైల్ ధర (డజను)	78.00
10-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	556-00
వరంగల్	558-00
రిటైల్ ధర	6.10

బీవోబీ రుణ రేటు పెంపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) నిధుల సమీకరణ వ్యయ ఆధారిత (ఎంసీఎల్ఆర్) రుణ రేటును 35 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెంచింది. దీనితో ఎంసీఎల్ఆర్‌కు అనుసంధానమైన రుణ రేట్లు మరింత పెరగనున్నాయి. కొత్త రేటు జనవరి 12వ తేదీ నుంచి అమలవుతుంది. బ్యాంక్ తాజా నిర్ణయంతో ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 7.50 శాతం నుంచి 7.85 శాతానికి చేరింది. నెల, మూడు, ఆరు, ఏడాది రేట్లు వరుసగా 8.15 శాతం, 8.25 శాతం, 8.35 శాతం, 8.50 శాతాలకు పెరిగాయి. పలు వాహన, వ్యక్తిగత, గృహ రుణాలకు ఏడాది రుణ రేటు అనుసంధానమై ఉండే సంగతి తెలిసిందే. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లు సోమవారం రుణ రేటను 25 బేసిస్ పాయింట్లు పెంచిన సంగతి తెలిసిందే.

ఐఓబీ డిపాజిట్ల రేట్లు అప్

కాగా, చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న ప్రభుత్వ రంగం ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబీ)రిటైల్ డిపాజిట్ రేటును తక్షణం అమల్లోకి వచ్చే విధంగా 45 బేసిస్ పాయింట్లు పెంచింది. దీని ప్రకారం 444 రోజుల కాలానికి డిపాజిట్లపై 7.75 శాతం రేటు అమలవుతుంది. ఫారిన్ కరెన్సీ డిపాజిట్ రేటును కూడా మంగళవారం నుంచి బ్యాంక్ 1% పెంచింది. దీనితో ఈ రేటు 5 శాతానికి చేరింది.

కార్లయిల్ చేతికి వీఎల్‌సీసీ

మెజారిటీ వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం కార్లయిల్.. సౌందర్యం, చర్మసంరక్షణ కంపెనీ వీఎల్‌సీసీలో మెజారిటీ వాటాను సొంతం చేసుకుంది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. 1989లో వందన, ముకేశ్ లూత్రా ఏర్పాటు చేసిన వీఎల్‌సీసీ స్కిన్‌కేర్, బ్యూటీ, వెల్‌నెస్ విభాగాలలో కార్యకలాపాలు విస్తరించింది. బ్రాండెడ్ స్కిన్ కేర్ ప్రొడక్టులతోపాటు ప్రత్యేకించిన బ్యూటీ, వెల్‌నెస్ సర్వీసులను అందిస్తోంది. కాగా.. సంబంధిత వర్గాల సమాచారం మేరకు డీల్ విలువ 30 కోట్ల డాలర్లు (రూ.2,453 కోట్లు)గా తెలుస్తోంది. భారత్‌పై కార్లయిల్ విశ్వాసానికి తాజా పెట్టుబడులు నిదర్శనమని సంయుక్త ప్రకటనలో కార్లయిల్, వీఎల్‌సీసీ పేర్కొన్నాయి.

మళ్లీ మార్కెట్ల పతనం

- సెన్సెక్స్ 632 పాయింట్లు డౌన్
- ఇంట్రాడేలో 60,000 దిగువకు
- 187 పాయింట్లు పడిన నిఫ్టీ
- 18,000 దిగువన ముగింపు



ముంబై: షార్ట్ కవరింగ్‌తో ముందురోజు ర్యాలీ చేసిన దేశీ స్టాక్ మార్కెట్లు తిరిగి పతన బాట పట్టాయి. సెన్సెక్స్ 632 పాయింట్లు కోల్పోయి 60,115 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 809 పాయింట్లవరకూ జారి 59,938కు చేరింది. ఇక నిఫ్టీ సైతం 187 పాయింట్లు పడిపోయి 17,914 వద్ద స్థిరపడింది. వెరసి సాంకేతికంగా కీలకమైన 18,000 స్థాయిని కోల్పోయింది. బ్యాంకింగ్ కౌంటర్లతోపాటు ఇతర బ్లూచిప్స్‌లో ఊపందుకున్న అమ్మకాలు మార్కెట్లను దెబ్బతీశాయి. అయితే డాలరుతో మారకంలో వరుసగా రెండో రోజు దేశీ కరెన్సీ పుంజుకోవడం గమనార్హం! యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమీ పావెల్ ప్రసంగించనున్న నేపథ్యంలో మార్కెట్లలో తాజా అమ్మకాలు నమోదైనట్లు మెహతా ఈక్విటీస్ రీసెర్చ్ విశ్లేషకులు ప్రశాంత్ తాప్సీ పేర్కొన్నారు. గత వారం చివర్లో వరుసగా మూడు రోజులు దేశీ స్టాక్ మార్కెట్లు క్షీణ పథంలో సాగిన విషయం విదితమే.

విదేశీ ఎఫెక్ట్

నేటి(10న) ట్రేడింగ్‌లో యూరోపియన్ మార్కెట్లు నేలచూపులకే పరిమితంకావడం, అంతకుముందు యూఎస్, ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియడంతో సెంటిమెంటు బలహీనపడినట్లు కొటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ రిటైల్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ పేర్కొన్నారు. దేశీ ఇన్వెస్టర్లు విదేశీ అంశాలకు ప్రభావితమైనట్లు తెలియజేశారు. సెన్సెక్స్ దిగ్గజాలలో ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎన్‌టీపీసీ, ఐటీసీ, ఆర్‌ఐఎల్, టెక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్ ప్రధానంగా నష్టపోయాయి. అయితే టాటా మోటార్స్, పవర్ గ్రిడ్, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎంఅండ్ఎం బలపడ్డాయి. ముందురోజు అక్టోబర్–డిసెంబర్(క్యూ3) ఫలితాలు ప్రకటించిన టీసీఎస్ 1 శాతం వెనకడుగు వేసింది.

చిన్న షేర్లు డీలా

బీఎస్‌ఈలో టెలికం, సర్వీసులు, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, టెక్నాలజీ, కమోడిటీస్, రియల్టీ రంగాలు 1.6–0.7 శాతం మధ్య క్షీణించాయి. మరోవైపు మెటల్, హెల్త్‌కేర్, ఆటో, ఆయిల్– గ్యాస్ స్వల్పంగా బలపడ్డాయి. మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 0.5 శాతం స్థాయిలో డీలా పడ్డాయి. ట్రేడైన షేర్లలో 2189 నష్టపోగా.. 1329 లాభపడ్డాయి. సోమవారం రూ. 203 కోట్ల విలువైన షేర్లను విక్రయించిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) మరో రూ. 2,109 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. దేశీ ఫండ్స్(డీఐఐలు) మాత్రం రూ. 1,807 కోట్లను ఇన్వెస్ట్ చేశాయి.

స్టాక్ హైలైట్స్

- ఈ ఏడాది తొలి అర్ధభాగంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు ప్రకటించిన ష్నీడర్ ఎలక్ట్రిక్ ఇన్‌ఫ్రా షేరు 14 శాతం దూసుకెళ్లి ఏడేళ్ల గరిష్టం రూ. 203కు చేరింది.
- క్యూ3లో జేఎల్ఆర్ హోల్‌సేల్ అమ్మకాలు ఊపందుకోవడంతో టాటా మోటార్స్ షేరుకి డిమాండ్ పెరిగింది. పతన మార్కెట్లోనూ 6 శాతం జంప్‌చేసి రూ. 413 వద్ద ముగిసింది.
- సెర్బియన్ సంస్థ నోవెలిక్‌లో 54 శాతం వాటా కొనుగోలు వార్తలతో సోనా కామ్‌స్టార్ షేరు 6 శాతం జంప్‌చేసి రూ. 448 వద్ద ముగిసింది.

రెండో రోజూ రూపీ దూకుడు

61 పైసలు అప్ • 81.74 వద్ద ముగింపు

డాలరుతో మారకంలో వరుసగా రెండో రోజు దేశీ కరెన్సీ దూకుడు ప్రదర్శించింది. గత రెండు నెలల్లోలేని విధంగా 61 పైసలు జంప్‌చేసి 81.74 వద్ద ముగిసింది. బాండ్ల విభాగం నుంచి పెట్టుబడులు లభించనున్న అంచనాలు రూపాయికి బలాన్నిచ్చినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 82.20 వద్ద హుషారుగా ప్రారంభమైంది. సోమవారం ముగింపు 82.35 కాగా ఒకదశలో 81.72 వరకూ ఎగసింది.

దేశవ్యాప్తంగా ఫ్రాంక్లిన్ ఈవీ

- రూ.50 కోట్లతో కంపెనీ విస్తరణ
- డిసెంబర్‌కల్లా 200 షోరూంలు



కోరోతో నవీన్, రంజిత్ (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ కంపెనీ ఫ్రాంక్లిన్ ఈవీ దేశవ్యాప్తంగా డిసెంబర్‌కల్లా 200 షోరూంలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కంపెనీ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, వైజాగ్, విజయవాడ తదితర 30 నగరాల్లో 54 షోరూంలను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోనే 14 షోరూంలు ఉన్నాయి. 2021లో అమ్మకాలను ప్రారంభించి రెండేళ్లలోనే 6,000 పైచిలుకు కస్టమర్లకు చేరువయ్యామని ఫ్రాంక్లిన్ ఈవీ ఫౌండర్ డాక్టర్ శశిధర్ కుమార్ మంగళవారమిక్కడ తెలిపారు.

నెలకు 3,000 యూనిట్లు..

కొత్తగా ఫ్రాంచైజీ కోసం 30 మంది ఔత్సాహికులతో చర్చలు జరుగుతున్నాయని కో–ఫౌండర్ రంజిత్ కుమార్ తెలిపారు. 'నేపాల్, బంగ్లాదేశ్, ఆఫ్రికాకు ఎగుమతులు చేస్తున్నాం. ఇతర దేశాల్లో అడుగు పెడతాం. 2023 చివరికల్లా నెలకు 3,000 యూనిట్ల అమ్మకాల స్థాయికి చేరాలన్నది లక్ష్యం. ఇందుకు రూ.50 కోట్లతో విస్తరణ చేపడుతున్నాం. కంపెనీలో పెట్టుబడికి ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఉన్నారు. హైదరాబాద్‌లో ప్లాంటు ఉంది' అని చెప్పారు.

తొలి డ్యూయల్ బ్యాటరీ..

కోరో మోడల్‌కు డిమాండ్ బాగుందని కో–ఫౌండర్ నవీన్ కుమార్ తెలిపారు. 'దక్షిణాదిన రిమూవబుల్ డ్యూయల్ బ్యాటరీతో తయారైన తొలి మోడల్ ఇదే. ఒకసారి చార్జింగ్‌తో 200 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. పవర్ ప్లస్, నిక్స్ డీలక్స్ మోడళ్లు సైతం మార్కెట్లో ఉన్నాయి. ఏప్రిల్‌కల్లా మరో 2 స్కూటర్లను ప్రవేశ పెడతాం. కస్టమర్ల ఇంటి వద్దే సర్వీస్ అందిస్తున్నాం. 2.1–3 కిలోవాట్ లిథియం అయాన్, లిథియం ఫాస్ఫేట్ రిమూవబుల్ బ్యాటరీలను పొందుపరిచాం. వీటికి ఐక్యాట్–ఏఐఎస్ 156, బీఐఎస్, సీఈ, ఐఎస్‌వో, ఆర్‌వోహెచ్ఎస్ ధ్రువీకరణ ఉంది. ధర రూ.75 వేల నుంచి ప్రారంభం' అని చెప్పారు.

ఐపీవోకు సైయంట్ డీఎల్ఎం



- రూ. 740 కోట్లు సమీకరణ
- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్ తయారీ సేవల (ఈఎంఎస్) సంస్థ సైయంట్ డీఎల్ఎం పబ్లిక్ ఇష్యూకు (ఐపీవో) వస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రాస్పెక్టస్ ముసాయిదాను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి దాఖలు చేసింది. దీని ప్రకారం ఐపీవో ద్వారా రూ. 740 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఈ నిధులను మూలధనం, రుణాల చెల్లింపు, ఇతర సంస్థల కొనుగోలు తదితర అవసరాల కోసం వినియోగించుకోనుంది. ఈ ఇష్యూలో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గంలో షేర్ల విక్రయం ఉండదు. పూర్తిగా కొత్త షేర్లను జారీ చేయనున్నారు. ప్రీ–ఐపీవో ప్లేస్‌మెంట్ రౌండులో రూ. 148 కోట్ల వరకు విలువ చేసే షేర్లను జారీ చేసే అవకాశం ఉంది. ఐటీ ఇంజనీరింగ్ సేవల సంస్థ సైయంట్‌కు ఇది అనుబంధ సంస్థగా ఉంది. దీనికి హైదరాబాద్, బెంగళూరు, మైసూర్‌లో తయారీ ప్లాంట్లు ఉన్నాయి.

ఐటీ హార్డ్‌వేర్ కోసం పీఎల్ఐ స్కీము

కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వెల్లడి

హైదరాబాద్: మొబైల్ ఫోన్ల విభాగం తరహాలోనే ఐటీ సర్వర్, ఐటీ హార్డ్‌వేర్‌కు కూడా ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాన్ని త్వరలో ప్రవేశపెట్టబోతున్నట్లు కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. అలాగే ఐటీ పీఎల్ఐలో దేశీయంగా డిజైన్ చేసిన మేథో సంపత్తిని తమ ఉత్పత్తుల్లో వినియోగించే తయారీదారులకు అదనంగా ప్రోత్సాహకాలు కూడా ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు.

వీఎల్ఎస్ఐ డిజైన్ కాన్ఫరెన్స్ 2023లో వర్చువల్‌గా పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. కొత్త తరం యాప్స్‌ను తయారు చేసే దిశగా ఐపీ, సాధనాలు, డివైజ్‌లను రూపొందించే స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేసేందుకు 200 మిలియన్ డాలర్ల ఫ్యూచర్ డిజైన్ ప్రోగ్రామ్‌ను కేంద్రం ప్రకటించిందని మంత్రి వివరించారు. గ్లోబల్ డిజిటలైజేషన్‌లో కొత్త ఆవిష్కరణలకు సెమీకండక్టర్ల తోడ్పాటు అనే అంశంపై అయిదు రోజులపాటు ఈ సదస్సు జరగనుంది.

జాబ్ పాయింట్

తెలంగాణ పురపాలక శాఖలో 78 అకౌంటెంట్ పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ).. జూనియర్, సీనియర్ అకౌంటెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 78
» **పోస్టుల వివరాలు:** అకౌంట్స్ ఆఫీసర్ (యూఎల్‌బీ)–01, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్(యూఎల్‌బీ)–13, సీనియర్ అకౌంటెంట్(యూఎల్‌బీ)–64.
» **అర్హత:** బీకాం ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ఏవో పోస్టులకు రూ.45,960 నుంచి రూ.1,24,150, జేఏవో పోస్టులకు రూ.42,300 నుంచి రూ.1,15,270, ఎస్ఏ పోస్టులకు రూ.32,810 నుంచి రూ.96,890 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్) పేపర్–1, పేపర్–2, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 20.01.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2023
» **పరీక్ష తేది:** ఆగస్ట్ 2023.
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

తెలంగాణ కళాశాల, సాంకేతిక విద్యలో 71 లైబ్రేరియన్ పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ).. లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 71
» **పోస్టుల వివరాలు:** లైబ్రేరియన్(కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్)–40, లైబ్రేరియన్ (కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్)–31.

అర్హత:

» **లైబ్రేరియన్(కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్):** 50% మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేట్(లైబ్రరీ సైన్స్)డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **లైబ్రేరియన్(కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్):** మాస్టర్స్ డిగ్రీ(లైబ్రరీ సైన్స్/ ఇన్ఫర్మేషన్ సైన్స్/డాక్యుమెంటేషన్ సైన్స్)తోపాటు జాతీయ స్థాయి పరీక్షలో అర్హత సాధించి ఉండాలి. లేదా మాస్టర్స్ డిగ్రీతోపాటు నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)/స్లెట్/సెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు లైబ్రేరియన్‌కు(ఇంటర్ విద్య) రూ.54,220 నుంచి రూ.1,33,630, లైబ్రేరియన్(సాంకేతిక విద్య)–లెవల్–9ఎ రూ.56,100, లెవల్–10 రూ.57,700.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్) పేపర్–1, పేపర్–2, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.01.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.02.2023
» **పరీక్షతేది:** మే/జూన్/2023
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

తెలంగాణ జిల్లా కోర్టుల్లో 77 ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 77
» **జిల్లాల వారీగా ఖాళీలు:** భద్రాద్రి కొత్తగూడెం –05, కోర్టు ఆఫ్ ద ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి ఫర్ సీబీఐ కేసెస్, హైదరాబాద్–01, సిటీ సివిల్ కోర్టు, హైదరాబాద్–11, జోగులాంబ గద్వాల–03, జగిత్యాల–05, జయశంకర్ భూపాలపల్లి–04, కామారెడ్డి–02, కొమరం భీమ్ ఆసిఫాబాద్–01, మంచిర్యాల–04, మేడ్చల్–మల్కాజగిరి–07, మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు, హైదరాబాద్–01, ములుగు–01, నాగర్ కర్నూల్–03, నారాయణపేట–03, పెద్దపల్లి–02, రాజన్న సిరిసిల్ల–02, రంగారెడ్డి–10, సిద్దిపేట–04, సూర్యాపేట–03, వికారాబాద్–02, వనపర్తి–01, యాదాద్రి భువనగిరి–02.
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణతతోపాటు స్థానిక భాషలు తెలిసి ఉండాలి. నిర్ణీత విద్య, సాంకేతిక అర్హతల కంటే ఎక్కువ అర్హత ఉన్న అభ్యర్థులు, ధ్రువపత్రాల పరిశీలన సమయంలో సంబంధిత పత్రాలను అందజేయాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.24,280 నుంచి రూ.72,850 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** సీబీటీ/ఓఎమ్మార్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్షా విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)/ఓఎమ్మార్ పరీక్షలో 100 ప్రశ్నలుంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగంలో 60, జనరల్ ఇంగ్లిష్ విభాగంలో 40 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 11.01.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** మార్చి 2023
» **వెబ్‌సైట్:** tshc.gov.in

ఒక్క పరీక్షతో.. 54 వర్సిటీల్లో ప్రవేశం

» సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలకు సీయూఈటీ–యూజీ
» మే 21 నుంచి 31 వరకు సీయూఈటీ–యూజీ పరీక్షలు
» రెండు స్లాట్లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష
» ఏప్రిల్ మొదటి వారంలో నోటిఫికేషన్!

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీల్లో డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకుంటే.. సీయూఈటీ యూజీ(సెంట్రల్ యూనివర్సిటీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–అండర్ గ్రాడ్యుయేట్)లో అర్హత సాధించాలి. గత ఏడాది నుంచి ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఒకే ఒక్క పరీక్షతో 54 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందొచ్చు. 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి మే 21 నుంచి 31 వరకు సీయూఈటీ యూజీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. సీయూఈటీ–యూజీతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, ప్రవేశ ప్రక్రియ గురించి తెలుసుకుందాం..


సీయూఈటీ–యూజీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో ప్రతిభ ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న 54 సెంట్రల్ యూనివర్సిటీల్లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశానికి సీయూఈటీ–యూజీ స్కోర్ ప్రామాణికం. కేంద్రీయ విశ్వవిద్యాలయాల తోపాటు టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్), ఎస్ఐఐటీ యూనివర్సిటీ, బీఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ తదితర మరో 50కు పైగా డీమ్డ్, ప్రైవేట్ వర్సిటీలు కూడా సీయూఈటీ–యూజీ స్కోర్ ఆధారంగానే గతేడాది ప్రవేశాలు కల్పించాయి.

50 శాతం మార్కులు తప్పనిసరి!

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు, 2023 ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సీయూఈటీ యూజీకి దరఖాస్తు చేసుకోవచ్చు. సీయూఈటీ–యూజీకి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత సరిపోతుందని ఎన్‌టీఏ వర్గాలు పేర్కొన్నాయి. కానీ.. పలు సెంట్రల్ యూనివర్సిటీలు మాత్రం ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులు తప్పనిసరి అంటున్నాయి. కాబట్టి విద్యార్థులు ముందుగానే ఆయా వర్సిటీల ప్రవేశ అర్హతల నిబంధనలపై స్పష్టత ఏర్పరచుకోవాలి.

గత ఏడాది 44 వర్సిటీలు

సీయూఈటీ–యూజీ స్కోర్ ఆధారంగాగతేడాది 44 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు కల్పించారు. యూజీసీ తాజా గణాంకాల ప్రకారం–సెంట్రల్ యూనివర్సిటీల సంఖ్య 54కు పెరిగింది. అంటే.. ఈ ఏడాది విద్యార్థులకు మరిన్ని సీట్లు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఏపీలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, సాంస్క్రిట్ యూనివర్సిటీ, తెలంగాణలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లు ఉన్నాయి.



రెండు స్లాట్లు.. మూడు సెక్షన్లు

- గతేడాది సీయూఈటీ–యూజీ పరీక్షను రెండు స్లాట్లలో, మూడు విభాగాలుగా నిర్వహించారు. మొదటి స్లాట్ 3:15 గంటలు; రెండో స్లాట్ 3:45 గంటల వ్యవధిలో జరిగింది. 2023కి సంబంధించి కూడా ఇదే విధానంలో పరీక్ష ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

స్లాట్-1 పరీక్ష విధానం

- స్లాట్–1లో సెక్షన్–1ఎ(లాంగ్వేజెస్), సెక్షన్–2 (డొమైన్ సంబంధిత సబ్జెక్టులు)లలో 50 ప్రశ్నలకుగాను 40 ప్రశ్నలకు సమాధానం గుర్తించాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు 5 మార్కులు కేటాయిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక విధానంలోనే ఉంటాయి.
- సెక్షన్–3 జనరల్ టెస్ట్‌లో 75 ప్రశ్నలకు గాను 60 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ప్రతి ప్రశ్నకు 5 మార్కులు కేటాయించారు. నెగెటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు.

స్లాట్-2 పరీక్ష విధానం

- రెండో స్లాట్‌లో సెక్షన్–1బి(లాంగ్వేజెస్)కి సంబంధించి.. సెక్షన్1ఎలో ఎంచుకున్న భాష కాకుండా వేరే భాషను ఎంచుకోవాల్సి ఉంటుంది.
- రెండో స్లాట్‌లో లాంగ్వేజెస్ విభాగాలు (సెక్షన్–1ఎ, 1బి), డొమైన్ సంబంధిత సబ్జెక్ట్ విభాగం (సెక్షన్–2) మాత్రమే ఉంటాయి. స్లాట్–1లో పేర్కొన్న సెక్షన్–3(జనరల్ టెస్ట్) స్లాట్–2లో ఉండదు. రెండు స్లాట్స్‌లోనూ డొమైన్ సంబంధిత సబ్జెక్ట్ విషయంలో అభ్యర్థులు డిగ్రీలో తాము చేరదల చుకున్న కోర్సుకు సంబంధించిన సబ్జెక్ట్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది.

ఆసక్తికి ప్రాధాన్యం

- అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ స్లాట్‌కు, ఏ విభాగాలకు హాజరవ్వాలనుకుంటున్నారో తెలియజేయాల్సి ఉంటుంది.
- తాము డిగ్రీలో చేరదలచుకున్న కోర్సు ఆధారంగా డొమైన్ స్పెసిఫిక్ సబ్జెక్ట్‌ను ఎంచుకోవచ్చు.
- డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌లు 27 అందుబాటులో ఉన్నాయి. మొదటి స్లాట్‌లో గరిష్టంగా రెండు, రెండో స్లాట్‌లో గరిష్టంగా నాలుగు డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌లకు హాజరయ్యే అవకాశముంది.

గరిష్టంగా 9 టెస్ట్‌లు

- అభ్యర్థులు తమ ఆసక్తి మేరకు గరిష్టంగా తొమ్మిది టెస్ట్‌లకు హాజరవ్వచ్చు.
- సెక్షన్–1ఎ, 1బి లాంగ్వేజ్ టెస్ట్‌ల నుంచి రెండు లాంగ్వేజ్‌లు, సెక్షన్–2లో గరిష్టంగా ఆరు డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌లు, సెక్షన్–3 జనరల్ టెస్ట్.
- సెక్షన్–1ఎ,1బిలు కలిపి గరిష్టంగా మూడు లాంగ్వేజ్‌లు, సెక్షన్–2(డొమైన్ సబ్జెక్ట్) నుంచి గరిష్టంగా 5 డొమైన్ సబ్జెక్ట్‌లు, సెక్షన్–3 జనరల్ టెస్ట్.
- అభ్యర్థులు ఈ రెండు విధానాల్లో ఆసక్తి ఉన్న విధానాన్ని దరఖాస్తు సమయంలో పేర్కొంటే.. దాని మేరకు పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు.
- స్లాట్–1 పరీక్షలో సెక్షన్–1ఎ నుంచి గరిష్టంగా ఒక లాంగ్వేజ్ టెస్ట్, సెక్షన్–2 (డొమైన్ సంబంధిత సబ్జెక్ట్)లో గరిష్టంగా రెండు సబ్జెక్ట్‌లు, సెక్షన్–3 జనరల్ టెస్ట్‌కు మాత్రమే అవకాశం ఉంటుంది. ఒక్కో విభాగానికి 45 నిమిషాలు చొప్పున గరిష్టంగా 195 నిమిషాలు(3:15 గంటలు) సమయం అందుబాటులో ఉంటుంది.
- స్లాట్–2లో సెక్షన్–1ఎ, బి నుంచి ఒక లాంగ్వేజ్, సెక్షన్–2లో గరిష్టంగా నాలుగు డొమైన్ సంబంధిత సబ్జెక్ట్ టెస్ట్‌లు లేదా.. సెక్షన్–1ఎ,బి నుంచి రెండు లాంగ్వేజెస్, సెక్షన్–2 నుంచి మూడు డొమైన్ సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు. అంటే..స్లాట్–2లో అభ్యర్థుల ఆసక్తి మేరకు గరిష్టంగా అయిదు టెస్ట్‌లకు హాజరవ్వచ్చు.

సెక్షన్-1ఎ లాంగ్వేజ్‌లు

- ఇంగ్లిష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాళం, మరాఠి, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ.
- **సెక్షన్–1బి లాంగ్వేజ్‌లు:** అరబిక్, బోడో, చైనీస్, డోంగ్రి, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్, కాశ్మీరీ, కొంకణి, మైథిలి, మణిపురి, నేపాలి, పర్షియన్, సంథాలి, సింధి, స్పానిష్, టిబెటిన్, సంస్కృతం.

డొమైన్ సబ్జెక్ట్‌లు

- మొత్తం 27 డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌లలో పరీక్ష నిర్వహిస్తారు. అవి.. • అకౌంటెన్సీ/బుక్ కీపింగ్ • బయాలజీ/బయలాజికల్ స్టడీస్/ బయోటెక్నాలజీ/బయో కెమిస్ట్రీ • బిజినెస్ స్టడీస్ • కెమిస్ట్రీ • కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్ • ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్ • ఇంజనీరింగ్ గ్రాఫిక్స్ • ఎంట్రప్రెన్యూర్‌షిప్ • జాగ్రఫీ/జియాలజీ • హిస్టరీ • హోమ్ సైన్స్ • నాలెడ్జ్ ట్రెడిషన్ అండ్ ప్రాక్టీసెస్ ఆఫ్ ఇండియా • లీగల్ స్టడీస్ • ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ • మ్యాథమెటిక్స్ • ఫిజికల్ ఎడ్యుకేషన్/ఎన్‌సీసీ/యోగా • ఫిజిక్స్ • పొలిటికల్ సైన్స్• సైకాలజీ • సోషియాలజీ • టీచింగ్ ఆప్టిట్యూడ్ • అగ్రికల్చర్ • మాస్ మీడియా/ మాస్ కమ్యూనికేషన్ • ఆంత్రోపాలజీ • ఫైన్ ఆర్ట్స్/విజువల్ ఆర్ట్స్ • పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ • సంస్కృతం.

ఈ అంశాలపై ప్రశ్నలు

- సెక్షన్–1ఎ, 1బి లాంగ్వేజ్‌లలో రీడింగ్ కాంప్రహెన్షన్, సంబంధిత లాంగ్వేజ్‌లో లిటరరీ ఆప్టిట్యూడ్, వొకాబ్యులరీలలో నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి.
- సెక్షన్–2లోని డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌ల విషయంలో ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పుస్తకాల ఆధారంగా ఆయా సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- సెక్షన్–3 జనరల్ టెస్ట్‌లో.. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ నైపుణ్యాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి.



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 291

బుధవారం 11-1-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



LUCKY OFFERS
INDIAN TERRAIN
Flat 40% Off
U.S. POLO ASSN. SINCE 1890
BUY2 GET 2 Free
spykar
Tops: BUY2 GET 40%
Bottoms: BUY2 GET 50%
KILLER
Tops: BUY2 GET 50%
Bottoms: BUY2 GET 40%
WHITE HOUSE sports
PRONINE cotton Trouser
LKG 4 WAY LYCRA
core CAMPUS FORMAL TROUSER
BUY 3 @ 999
MUFTI
BUY1 GET 1
BLACKBERRYS
BUY3 GET 40%
XEMBERG
TWILLS
WALKER
COOL COLORS
BLUE JERSEY
WHITE HOUSE
PAN AMERICA SHIRTS | TROUSERS | JEANS
TDU
LIVE IN
BUY2 GET 1 FREE
MINISTER WHITE DHOTIES & SHIRTS
RAMRAJ
CRAZE Designer Shirts
BUY3 GET 20%
Amstead
Bottle Pack T-shirt's
4pcs 999
Wonderful women's wardrobe
5 pcs చున్నీస్ ₹199/-
upto 30% OFF చుడీదార్స్ పై
7 pcs లెగ్గింగ్స్ ₹499/-
2 pcs స్కర్ట్స ₹499/-
1+1 ప్లాజో సెట్స్ ₹849/-
₹699/- ₹899/- ₹999/- డ్రెస్ మెటీరియల్స్
1+1 కుర్తీస్ ₹399/- ₹449/-
1+1 ఫ్యాన్సీ టి-షర్ట్స ₹399/-
2pcs ₹1099/- ప్రంజుల్ పటియాలా సెట్స్
A BIG STYLE ZONE
FOR YOUR LITTLE ONES
5 pcs గర్ల్స్ టి-షర్ట్స ₹499/-
4 pcs గర్ల్స టాప్స ₹499/-
3 pcs కాటన్ ఫ్రాక్స్ (16-18 సైజ్) ₹299/-
3 pcs కాటన్ ఫ్రాక్స్ (20-30 సైజ్) ₹399/-
1+1 & 3 pcs ఆఫర్స్ (బాయ్స్ & గర్ల్స్)
Fashion Style fun and JOY.....
contact@eyecatch.co.in
*T&C Apply
• WOMEN
• MEN • KIDS
LUCKY® shopping mall
హోటల్ DV మేనర్ పక్కన, MG రోడ్, విజయవాడ



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 291

బుధవారం 11-1-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




భారత్ 'టాప్'గేర్

శతక్కొట్టిన కోహ్లి.. తొలి వన్డేలో శ్రీలంకపై ఘన విజయం -IVలో



పది భారతీయ చిత్రాలు

ఆస్కార్ అవార్డుల షార్ట్ లిస్టులో చోటు.. తుది నామినేషన్లు 24న వెల్లడి -IVలో



మెట్రో పిల్లర్ కూలి.. ఇద్దరు మృతి

బెంగళూరులో నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్ కూలి పోవడంతో ఓ తల్లి, ఆమె కుమారుడు ప్రాణాలు కోల్పోయారు. భర్త, కుమార్తె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వివరాలు 6లో ▸



కాలిఫోర్నియాలో వరద బీభత్సం

అమెరికాను వరదలు ముంచెత్తాయి. కాలిఫోర్నియా జనాభాలో ఏకంగా 90 శాతం మంది ప్రజలు వరద ముప్పును ఎదు ర్కొంటున్నారు. పలు చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి.

వివరాలు 6లో ▸

టీడీపీని వీడని నిరాశ, నిస్పృహలు...

వేర్ ఈజ్ ద 'పార్టీ'!


గెలిచిన ఎమ్మెల్యేల్లోనే 30 శాతం మంది దూరం.. దూరం

అప్పట్లో హవా నడిపించిన నాయకులిప్పుడు తెరచాటుకు

రాష్ట్రంలో 68 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులే లేరు

పార్టీ పదవులిస్తామంటున్నా... మాకొద్దంటున్న నేతలు

- చివరకు జీతాలిచ్చి మరీ అనుబంధ సంఘాలకు నియామకం
- ఏ కార్యక్రమం పెట్టినా ఫ్లాపే.. ఏ ఎన్నికలోనైనా ఓటమే
- బాబు సభలకు జనం రాకపోవటంతో 'ఇరుకు రోడ్ల' వ్యూహం
- అది బెడిసికొట్టడంతో కానుకలిస్తామని పిలిచే ఎత్తుగడ
- అది కూడా వర్కవుట్ కాకపోవటంతో.. అటెన్షన్ కోసం యాగీ
- ఇక ఈ వ్యూహాలు పనిచేయవని తెలిసి మిత్రుడు పవన్ చెంతకు
- పొత్తులు లేకుండా కనీసం నలుగురు జనాన్నీ రప్పించలేని దైన్యం
- బాబును ఎలాగైనా లేపేందుకు అధికార పార్టీపై పచ్చ రామోజీ
- అందుకే రాయలసీమ వైకాపాలో 'కుంపట్లు' అంటూ రాతలు
- అధికార పార్టీ అన్నాక ఒకటి రెండు చోట్ల అసంతృప్తులు సహజం
- పార్టీ గురించి చెప్పాలంటే దానికి జనంలో ఉన్న ఇమేజ్ చూడాలి
- రాష్ట్ర ప్రజలు నేరుగా కనెక్ట్ అయి ఉన్నది వైఎస్సార్ సీపీతోనే
- విద్య, వైద్యం నుంచి వ్యవసాయం వరకూ అన్నింటా విప్లవమే
- మెరుగైన జీవనం కోసం పింఛన్లు సహా ఎన్నెన్నో మార్పులు
- దీంతో 2019 నుంచి ప్రతి ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌కు జనం జేజేలు



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: చచ్చీచెడి గెలిచిన 23 మంది ఎమ్మెల్యేల్లో 20 శాతం మంది తెలుగుదేశం పార్టీతో సం బంధం లేకుండానే కొనసాగుతున్నారు. మిగిలిన వారి లోనూ ఇద్దరు ముగ్గురిది.. అంటే మరో 10 శాతానిది అంటీముట్టని వ్యవహారశైలే. వీటికి తోడు అధికారంలో ఉన్నప్పుడు అంతా తామై హవా చెలాయించిన నాయకు లంతా ఇపుడు పార్టీ క్రియాశీలక వ్యవహారాలకు దూరం గా ఉండి... అజ్ఞాతాన్ని ఆశ్రయించారు. ఎవరికి వారు ఈ పార్టీతో ఒరిగేదేమీ లేదని భావిస్తుండటంతో 68 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను కూడా నియమించలేని దుస్థితిలో పడిపోయారు చంద్రబాబు. టీడీపీని

మిగతా 4వ పేజీలో ▶



ఆధునిక అంగన్‌వాడీలు

- నాడు–నేడుతో రూ.1,500 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం
- మూడు విడతల్లో మౌలిక వసతుల పనులు పూర్తి
- టీచింగ్ క్వాలిటీపై దృష్టి.. మాంటిస్సోరీ విధానంపై అధ్యయనం
- ఆహార పంపిణీలో అలక్ష్యం జరిగితే బాధ్యులపై చర్యలు
- విలేజ్, వార్డు క్లినిక్స్‌తో 'అంగన్ వాడీ'ల్లో ఆరోగ్య పర్యవేక్షణ
- పైలట్ ప్రాజెక్టుగా ఫ్లేవర్డ్ పాలు... 3 నెలల్లో అన్ని చోట్లా
- లోపాలకు తావులేకుండా తల్లు లకు టేక్ హోం రేషన్ విధానం
- మహిళా శిశు సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి జగన్ సమీక్ష

2 లో

చిరు వ్యాపారుల పెట్టుబడికి భరోసా

నేడు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్

2 లో

హైకోర్టు జడ్జిలుగా మరో ఇద్దరు

- న్యాయమూర్తుల పోస్టులకు జ్యోతిర్మయి, గోపాలకృష్ణారావుల పేర్ల సిఫారసు
- సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదం
- వీరి నియామకంతో న్యాయాధికారుల కోటా పూర్తి
- మిగిలిన 5 ఖాళీలు న్యాయవాదుల కోటా నుంచే భర్తీ
- త్వరలో పేర్లు పంపనున్న హైకోర్టు కొలీజియం

2 లో


గోపాలకృష్ణారావు


జ్యోతిర్మయి

కొత్త ఇండస్ట్రీ వస్తుంటే

'ఈనాడు' ఏడుపు!

- 'షిర్డి సాయి' చిన్న సంస్థ అట.. ప్రభుత్వం భూములు అప్పనంగా కట్టబెట్టేస్తోందట
- కంపెనీ సొంత నిధులతో భూముల కొనుగోలు చేస్తుండటం వాస్తవం కాదా?
- కేంద్రం ఇస్తున్న ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీంకు అర్హత సాధించిన కంపెనీ ఇది
- ఈ కంపెనీ కోసం ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు లాంటి రాష్ట్రాలు ఆఫర్లు

- వివరాలు 2లో

'నారా'యణ.. నల్లధనం

ఓ 'ఎన్‌స్పైర'!

- రూ.వెయ్యి కోట్లకుపైగా మళ్లించిన మాజీ మంత్రి నారాయణ
- ఆ నిధులు తన బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్‌లోకి
- నారాయణ సిబ్బంది పేరుతో అసైన్డ్ భూముల కొనుగోలు
- బినామీల పేరిట 169.27 ఎకరాల అసైన్డ్ భూములు హస్తగతం
- హైదరాబాద్‌లోని ఎన్‌స్పైర ఆఫీసులో సీఐడీ తనిఖీలు.. హార్డ్ డిస్కులు, కీలక పత్రాలు స్వాధీనం
- అమరావతిలో మొత్తం రూ.5,600 కోట్ల విలువైన 1,400 ఎకరాల అసైన్డ్ దందా

7 లో

గంగిరెద్దుల 'డిజిటల్ భిక్షాటన'



పూర్వం సంక్రాంతి పండుగ వేళ గంగిరెద్దులతో గ్రామాల్లో విన్యాసాలు ప్రదర్శించి నగదు, పాత వస్త్రాలు, అన్నం తదితరాలు భిక్షమడిగేవారు. ప్రస్తుతం మారిన సమాజంతో పాటు వారి భిక్షాటనలోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం ఖండ్రిగ గ్రామానికి చెందిన ఆవుల గొల్లయ్య కొత్తపేటలోని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలకు తన గంగిరెద్దుతో హాజరయ్యాడు. రంగుల తాళ్లు, వస్త్రాలతో అలంకరించిన గంగిరెద్దు తలకు 'యూపీఐ స్కాన్ కోడ్' (కార్డు) తగిలించాడు. డిజిటల్ భిక్షాటన చేశాడు. అతని ఐడియా చూసి పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ అభినందించారు. - కొత్తపేట

శేషాచలంలో శ్రీలంక బల్లి



శ్రీలంకలో కనిపించే ఈ అరుదైన హెమిడాక్టిలస్ ట్రైడ్రస్ బల్లి మంగళవారం శేషాచల అటవీ ప్రాంతంలోని మాల్వాడిగుండం ప్రాంతంలో కనిపించింది. ఈ కొత్త జాతి బల్లిని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. కాగా, శేషాచల అటవీప్రాంతంలో బంగారు బల్లి ఉన్నట్లు 'సాక్షి' కెమెరానే ముందుగా పాఠకులకు పరిచయం చేసింది.

- కేతారి మోహన్‌కృష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



అరుదైన గుడ్లగూబలు



శేషాచల అటవీ ప్రాంతంలో 2 అరుదైన జాతులకు చెందిన గుడ్లగూబలను పరిశోధకులు గుర్తించారు. ఈ నెల 7న తలకోన అటవీ ప్రాంతంలో స్పాట్ బెల్లీడ్ ఈగల్ ఔల్‌ను, ఆదివారం చామల అటవీ సమీప పంట పొలాల్లో మాల్టెడ్ ఉడ్ ఔల్‌ను గుర్తించారు. అటవీ శాఖ అధికారులతో కలసి బర్డ్‌మెన్ కార్తీక్ (పక్షి శాస్త్రవేత్త), లక్కల గోపి (వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్) నెల రోజుల నుంచి శేషాచలం ప్రాంతంలో ప్రత్యేక పరిశోధన చేసి ఈ 2 జాతులను గుర్తించినట్లు 'సాక్షి'కి మంగళవారం తెలిపారు. - తిరుపతి అలిపిరి (తిరుపతి జిల్లా)

క్లుప్తంగా...

కొనసాగుతున్న చలి తీవ్రత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతూనే ఉన్నాయి. మంచుతోపాటు పొగమంచు కురుస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో మంగళవారం తెల్లవారుజామున 3.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. జి.మాడుగుల మండలం కుంతలంలో 4.1, చింతపల్లి మండలం చింతపల్లిలో 4.2, జీకే వీధిలో 4.3, డుంబ్రిగూడలో 4.4, జి.మాడుగుల, హుకుంపేటలో 4.7, పాడేరులో 5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏజెన్సీలోని చాలా ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 8 డిగ్రీల కన్నా తక్కువగా నమోదయ్యాయి. రాయలసీమలోని పలు ప్రాంతాల్లోనూ విశాఖ ఏజెన్సీ తరహాలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవడం విశేషం. శ్రీసత్యసాయి జిల్లా అగళిలో 7.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అదే జిల్లా మడకశిర మండలం ఆర్.అనంతపురం, అనంతపురం జిల్లా బెళుగుప్పలో 8.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పూర్వ ప్రాథమిక నుంచి కాలేజీ వరకు 'సమగ్ర' ప్రణాళిక

సాక్షి, అమరావతి: పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఆయా విద్యా సంస్థలలో 2023–24 విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు, ఇతర కార్యక్రమాలపై సమగ్ర శిక్ష సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది. డెవలప్‌మెంటు ప్లాన్, హేబిటేషన్ డెవలప్‌మెంటు ప్లాన్, మండల, క్లస్టర్ డెవలప్‌మెంటు ప్లాన్‌లను తయారు చేయాలని క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ప్రొఫార్మాలను ఎంఈవోలకు పంపింది. గతంలో స్కూళ్ల వరకే ఈ ప్రణాళికలు పరిమితం కాగా, తాజాగా కాలేజీలకు కూడా వీటిని వర్తింపజేసింది.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పు

- ఫిబ్రవరి 20 నుంచి వొకేషనల్, 26 నుంచి జనరల్ కోర్సుల ప్రాక్టికల్స్
- మార్చి 15 నుంచి థియరీ పరీక్షలు యథాతథం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటర్మీడియెట్–2023 పబ్లిక్ పరీక్షల ప్రాక్టికల్స్ తేదీలను ఇంటర్ బోర్డు మార్పు చేసింది. వొకేషనల్ కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి 20 నుంచి మార్చి 7 వరకు, జనరల్ కోర్సుల ప్రాక్టికల్స్‌ను ఫిబ్రవరి 26 నుంచి మార్చి 7 వరకు నిర్వహించనున్నట్లు బోర్డు కార్యదర్శి ఎం.వి.శేషగిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు ఎథిక్స్, హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షను ఫిబ్రవరి 15న, పర్యావరణ విద్య పరీక్షను ఫిబ్రవరి 17న నిర్వహిస్తామన్నారు. గతంలో విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. ప్రాక్టికల్ పరీక్షలను ఏప్రిల్ 15 నుంచి 25 వరకు, ఆ తర్వాత 30 నుంచి మే 10 వరకు రెండు విడతల్లో నిర్వహించేలా షెడ్యూల్ ఇచ్చారు. ఇంటర్ థియరీ పరీక్షలు గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జరగనున్నాయి. మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఈ పరీక్షలను నిర్వహించనున్నారు.

ఆధునిక అంగన్‌వాడీలు

- ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్నారులకు బోధన
- రక్తహీనత, పౌష్టికాహార లోపం నివారణకు సమగ్ర కార్యాచరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. నాడు–నేడు ద్వారా మౌలిక వసతులు కల్పించి అంగన్‌వాడీలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ.1,500 కోట్లు ఖర్చు చేస్తోందని గుర్తు చేస్తూ మూడు విడతల్లో ఈ పనులను పూర్తి చేయాలని నిర్దేశించారు. పనుల్లో నాణ్యత ఉండాలని, ప్రతి మండలంలోనూ జరిగేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అంగన్‌వాడీల్లో టీచింగ్ క్వాలిటీపై మరింత దృష్టి సారించడంతోపాటు మాంటిస్సోరీ తరహా విద్యా విధానంపై అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీతో పాటు పదోన్నతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. 63 సీడీపీవో పోస్టుల భర్తీకి అనుమతిస్తూ వీలైనంత త్వరగా వీటిని భర్తీ చేయాలని సూచించారు. విద్య, వ్యవసాయం, వైద్య ఆరోగ్య రంగాల తరహాలో మహిళా శిశు సంక్షేమాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా చేపట్టిందన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖపై సీఎం జగన్ మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆ వివరాలివీ..

సమగ్ర పర్యవేక్షణ

అంగన్‌వాడీ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణతో చిన్నారులకు ఆహ్లాదకరమైన మంచి వాతావరణాన్ని అందించాలి. అంగన్‌వాడీల ద్వారా అందించే పాలు, గుడ్లు పంపిణీలో ఎలాంటి సమస్యలు ఉండకూడదు. పంపిణీపై సమగ్ర పర్యవేక్షణ, పరిశీలన ఉండాలి. ఇందుకోసం టెక్నాలజీని వినియోగించుకుంటూ ఎస్‌వోపీలు రూపొందించుకోవాలి. ఆహారం పంపిణీలో ఎక్కడైనా లోపాలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

> అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో బలహీన వర్గాలకు చెందిన పిల్లలే అధికంగా ఉంటారు. ఆ చిన్నారులకు తోడుగా నిలబడాల్సిన బాధ్యత మనపై ఉంది. వారి పట్ల సానుకూల దృక్పథంతో పని చేయాలి. 10 - 12 ఏళ్ల వయస్సులో మంచి బోధన అందించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.
> - సీఎం జగన్

సూపర్‌వైజర్లపై కూడా పర్యవేక్షణ ఉండాలి.

ఫ్లేవర్డ్ మిల్క్ పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాల్లో నూటికి నూరుశాతం పిల్లలకు పాల పంపిణీ జరగాలి. పిల్లలకు ఫ్లేవర్డ్ పాల పంపిణీని పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలి. మూడు నెలల తర్వాత రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్తిస్థాయిలో ఫ్లేవర్డ్ మిల్క్ పంపిణీ కావాలి. ఈ మేరకు షెడ్యూల్ రూపొందించుకోవాలి. అంగన్‌వాడీలలో బోధనపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఆహ్లాదకరంగా ఉత్తమ బోధనా విధానాలను అందుబాటులోకి తేవాలి. స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ పద్ధతుల్లో బోధనపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

విలేజ్, వార్డు క్లినిక్స్ సేవలు

అంగన్‌వాడీల్లో పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటూ విలేజ్, వార్డు క్లినిక్స్ ద్వారా పర్యవేక్షణ చేపట్టాలి. చిన్నారులకు వైద్యపరంగా ఎలాంటి చికిత్స అవసరమైనా ఆరోగ్యశ్రీ వినియోగించుకుని మెరుగైన వైద్యం అందచేయాలి. ఎవరైనా తల్లీబిడ్డలు రక్తహీనత, పౌష్టికాహార లోపం లాంటి సమస్యలతో బాధపడుతుంటే నివారించేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలి. ఈ విషయంలో అంగన్‌వాడీలు, విలేజ్ క్లినిక్స్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పని చేయాలి. రక్తహీనత, పౌష్టికాహారలోపం లాంటి సమస్యలు ఉన్నవారికి అందరితోపాటు ఇచ్చే ఆహారం, మందులు కాకుండా అదనంగా అందించి ఆరోగ్యం మెరుగుపడేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. దీనిపై సమగ్ర ఎస్‌వోపీలు రూపొందించుకోవాలి. ఈ విధానాన్ని ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలులోకి తెచ్చి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో పరిష్కారం చూపించాలి. తల్లులకు టేక్ హోం రేషన్ విధానాన్ని లోపాలకు తావులేకుండా అమలు చేయాలి.

సమీక్షలో మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ బాబు.ఎ, పాఠశాల మౌలిక వసతుల శాఖ కమిషనర్ కాటమనేని భాస్కర్, పౌర సరఫరాల శాఖ ఎండీ జి.వీరపాండ్యన్, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల పెట్టుబడికి భరోసా

- వారి జీవనోపాధికి అండగా నిలుస్తున్న 'జగనన్న తోడు' పథకం
- నడ్డి విరిచే వడ్డీలకు చెల్లుచీటీ.. రూ.10 వేల వరకు వడ్డీలేని రుణం
- 3.95 లక్షల మంది చిరు వ్యాపారులకు కొత్తగా రూ.395 కోట్ల రుణాలు
- ఇప్పటిదాకా రూ.15,31,347 మందికి రూ.2,406 కోట్లు వడ్డీ లేని రుణాలు
- గత ఆరు నెలలకు సంబంధించి రూ.15.17 కోట్లు వడ్డీ రీయింబర్స్‌మెంట్
- నేడు లబ్ధిదారుల ఖాతాల్లో బటన్ నొక్కి డబ్బు జమ చేయనున్న సీఎం జగన్



సాక్షి, అమరావతి : చిరు వ్యాపారుల కోసం ప్రభుత్వం మహత్తర కార్యక్రమం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా నడ్డి విరిచే వడ్డీలకు చెల్లుచీటీ చెబుతూ చిరు వ్యాపారులకు అండగా నిలబడుతూ జగనన్న తోడు పథకం అమలు చేస్తోంది. పూర్తి వడ్డీ భారాన్నీ ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున 3.95 లక్షల మంది చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారికి బ్యాంకుల ద్వారా కొత్తగా రూ.395 కోట్ల కొత్త రుణాలు అందించడంతో పాటు, గత 6 నెలలకు సంబంధించిన రూ.15.17 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను అందించనుంది. సీఎం జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమ చేయనున్నారు.

వారి కష్టాన్ని చూశారు.. ఆదుకున్నారు..

తన సుదీర్ఘ పాదయాత్రలో ఈ చిరు వ్యాపారుల కష్టాలను చూసి, వారి కడగండ్లను స్వయంగా విన్న వైఎస్ జగన్.. సీఎం కాగానే ఆ పరిస్థితులను మారుస్తూ, నిత్యం కష్టంపైనే ఆధారపడి గౌరవంగా జీవిస్తున్న వారిని ఆదుకోవడం కోసం సున్నా వడ్డీకే రుణాలు అందిస్తూ జగనన్న తోడు పథకం అమలు చేస్తున్నారు. దేశంలో అత్యధికంగా వడ్డీలేని రుణాలు అందిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం.. బుధవారం అందిస్తున్న రూ.395 కోట్ల రుణంతో కలిపి ఇప్పటి వరకు రూ.15,31,347 మంది చిరు వ్యాపారాలు చేసుకునే లబ్ధిదారులకు రూ.2,406 కోట్లు వడ్డీ లేని రుణాలు అందించింది. వీరిలో సకాలంలో రుణాలు చెల్లించి రెండోసారి రుణం పొందిన వారు 8,74,745 మంది. నేడు అందిస్తున్న వడ్డీ రీయింబర్స్‌మెంట్ రూ.15.17 కోట్లతో కలిపి సకాలంలో రుణాలు చెల్లించిన 13.28 లక్షల లబ్ధిదారులకు ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.63.65 కోట్లు వడ్డీ చెల్లించింది. ముఖ్యమంత్రి తీసుకున్న చురుకైన చర్యల కారణంగా సకాలంలో రుణాలు చెల్లించిన వీధి వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి నిత్యం మూలధనం అందుబాటులో ఉంటోంది. ఏ ఏడాదికి ఆ ఏడాది రుణాల మొత్తాన్ని రూ.10 వేల నుంచి రూ.11 వేలకు, రూ.11 వేల నుంచి రూ.12 వేలకు, రూ.12 వేల నుంచి రూ.13 వేలకు పెంచుతూ బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించేలా చర్యలు తీసుకుంది.

వీరందరికీ జగనన్న తోడు..

గ్రామాలు, పట్టణాల్లో సుమారు 5 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పు స్థలంలో శాశ్వత లేక తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకున్న వారు, ఫుట్‌పాత్‌ల మీద, వీధుల్లో తోపుడు బండ్లపై వస్తువులు, కూరగాయలు, పండ్లు అమ్ముకుని జీవించేవారు.. రోడ్ల పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు.. గంపలు, బుట్టలలో వస్తువులు అమ్మేవారందరికీ జగనన్న తోడు పథకం వర్తిస్తోంది. సైకిల్, మోటారు సైకిల్, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసే వారితో పాటు, సంప్రదాయ చేతి వృత్తుల కళాకారులు, ఇత్తడి పని చేసేవాళ్లు, బొబ్బిలి వీణ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల తయారీ, లేస్ వర్క్స్, కలంకారీ, తోలుబొమ్మలు, కుమ్మరి తదితర వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారు కూడా ఈ పథకానికి అర్హులే.

హైకోర్టు జడ్జిలుగా మరో ఇద్దరు

- న్యాయమూర్తుల పోస్టులకు వెంకట జ్యోతిర్మయి, గోపాలకృష్ణారావుల పేర్లు సిఫారసు
- సుప్రీం కోర్టు కొలీజియం ఆమోదం

సాక్షి, అమరావతి : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తుల పోస్టులకు న్యాయాధికారుల కోటా నుంచి పి. వెంకట జ్యోతిర్మయి, వి. గోపాలకృష్ణారావుల పేర్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర హైకోర్టు కొలీజియం చేసిన సిఫారసుకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ధనుంజయ్ యశ్వంత్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్‌లతో కూడిన కొలీజియం మంగళవారం సమావేశమై ఈ మేరకు తీర్మానం చేసింది. ఈ ఇద్దరి పేర్లను కేంద్రానికి పంపింది. వీరికి కేంద్రం ఆమోదం తెలిపిన తరువాత ఆ ఫైలు రాష్ట్రపతికి చేరుతుంది. రాష్ట్రపతి నియామక ఉత్తర్వులు తరువాత వారి నియామకాలను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీచేస్తుంది. ఆ తరువాత వారి ప్రమాణ స్వీకారం ఉంటుంది.

ఇక ఈ ఇద్దరు న్యాయాధికారుల్లో వెంకట జ్యోతిర్మయి ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి (పీడీజే)గా వ్యవహరిస్తున్నారు. గోపాలకృష్ణ గుంటూరు మొదటి అదనపు న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరి పేర్లను హైకోర్టు కొలీజియం నాలుగు నెలల క్రితమే సుప్రీంకోర్టుకు పంపింది. వీరిద్దరి నియామకంతో ప్రస్తుతానికి న్యాయాధికారుల కోటా పూర్తవుతుంది. ఇదే సమయంలో వీరి నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 32కు చేరుకుంది. అలాగే, హైకోర్టు మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 37 కాగా.. మరో ఐదు ఖాళీలుంటాయి. ఇవి న్యాయవాదుల కోటాకు సంబంధించినది. వీటిని సైతం భర్తీచేసేందుకు హైకోర్టు కొలీజియం త్వరలో న్యాయవాదుల పేర్లను సుప్రీంకోర్టుకు ప్రతిపాదించనుంది. మరోవైపు.. ఈ ఏడాది ముగ్గురు న్యాయమూర్తులు పదవీ విరమణ చేయనున్నారు.

పి. వెంకట జ్యోతిర్మయి

గుంటూరు జిల్లా, తెనాలిలో బాలాత్రిపుర సుందరి, పీవీకే శాస్త్రి దంపతులకు జన్మించారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు తెనాలిలోనే విద్యాభ్యాసం పూర్తిచేశారు. నాగార్జున యూనివర్సిటీ నుంచి లా పట్టా పొందారు. చదువులో టాపర్. మూడు బంగారు పతకాలు సాధించారు. 2008లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. వివిధ హోదాల్లో రాష్ట్రంలో పలుచోట్ల పనిచేశారు. 2022 ఏప్రిల్ 18 నుంచి ఇప్పటివరకు తూర్పు గోదావరి జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు

కృష్ణాజిల్లా చల్లపల్లి గ్రామంలో కోటేశ్వరమ్మ, సోమయ్య దంపతులకు జన్మించారు. తండ్రి సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేశారు. పదవ తరగతి మచిలీపట్నం జైహింద్ పాఠశాలలో చదివారు. ఇంటర్ ఎస్ఆర్ వైఎస్‌పీ జూనియర్ కాలేజీలో పూర్తి చేశారు. డిగ్రీ, పీజీ మచిలీపట్నంలో చదివారు. 1994లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2007లో సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందారు. 2016లో జిల్లా జడ్జిగా పదోన్నతి పొందారు. గుంటూరు మొదటి అదనపు జిల్లా జడ్జిగా వ్యవహరిస్తున్నారు. వీరి కుటుంబంలో న్యాయాధికారి అయిన మొదటి వ్యక్తి ఈయనే. కుమారుడు వి.రఘునాథ్ ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై ప్రస్తుతం కర్నూలు జిల్లా, ఆత్మకూరు కోర్టులో పనిచేస్తున్నారు.

కొత్త ఇండస్ట్రీ వస్తుంటే 'ఈనాడు' ఏడుపు!

- 'షిర్డి సాయి' చిన్న సంస్థ అట..
- ప్రభుత్వం భూములు అప్పనంగా కట్టబెట్టేస్తోందట..
- కంపెనీ సొంత నిధులతో భూములు కొనుగోలు చేస్తుండటం వాస్తవం కాదా?
- పారిశ్రామికవేత్త కడపకు చెందిన వారు కావడమే పాపమైపోయిందా?
- కేంద్రం ఇస్తున్న ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీంకు అర్హత సాధించిన కంపెనీ ఇది
- ఆర్థిక స్థితిగతులు, కంపెనీ పనితీరు, సామర్థ్యం చూశాకే కేంద్రం ఎంపిక
- ఈ కంపెనీ కోసం ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు లాంటి రాష్ట్రాలు ఆఫర్లు
- బిడ్డింగ్‌లో రిలయన్స్, అదానీలతో పోటీ పడి ఎల్–1గా నిలిచింది
- ఈ కంపెనీ ఏర్పాటైతే ప్రత్యక్షంగా 11,500 మందికి ప్రత్యక్షంగా ఉపాధి
- ఈ కంపెనీ ఏర్పాటులో ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్ మాత్రమే

సాక్షి, అమరావతి : వేలాది మందికి ఉపాధి కల్పించేలా ఒక కొత్త పరిశ్రమ వస్తుంటే 'ఈనాడు'కు ఏడుపు ముంచుకొస్తోంది. ఈ ప్రభుత్వానికి ఎక్కడ మైలేజీ ఇంకా పెరిగిపోతోందోనని ఆందోళన చెందుతోంది. ఉన్నవి లేనివి అన్నీ కలిపి.. టన్నులకొద్దీ బురద జల్లుతూ ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపుతోంది. ఏదైనా ఇండస్ట్రీ రాకపోతే ఏడవడం మామూలే అనుకుంటే.. ఎంతో మందికి ఉపకరించే పరిశ్రమ మన రాష్ట్రంలో వెలుస్తోందంటే ఎందుకు ఏడుస్తున్నట్లు? ఎవరి కోసం ఏడుస్తున్నట్లో ఇట్టే అర్థమవుతోంది. ఇండస్ట్రియల్ హబ్ పేరుతో షిర్డిసాయి ఎలక్ట్రికల్ అనుబంధ కంపెనీ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు నెల్లూరు జిల్లా రావూరు, చేవూరు గ్రామాల్లోని 4,827.04 ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టేస్తోందని మంగళవారం 'ఈనాడు' అక్కసు వెళ్లగక్కింది. షిర్డి సాయి ఏ విధంగా చిన్న సంస్థ? కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీం (పీఎల్ఐ)కు అర్హత సాధించిన కంపెనీ. ఆర్థిక స్థితిగతులు, కంపెనీ పనితీరు, సామర్థ్యం చూశాకే కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేస్తుంది. ఇలాంటి కంపెనీని పట్టుకుని 'ఈనాడు' విషం కక్కడం దుర్మార్గం. కేవలం కడపకు చెందిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి చెందిన సంస్థ కావడమే పాపమైపోయింది. విశాఖపట్నంలో అత్యంత విలువైన భూములను ఎంవీవీఎస్ మూర్తి ఆక్రమించినప్పుడు ఏనాడైనా ఈనాడు ఇలాంటి కథనం రాసిందా? 'షిర్డిసాయికి 4,827 ఎకరాలు' శీర్షికన ప్రచురించిన ఈనాడు కథనంలో అసలు వాస్తవాలు ఇలా ఉన్నాయి.

ఆరోపణ : సీఎంకు సన్నిహితుడైన వ్యక్తికి చెందినది..

వాస్తవం : ఈ కంపెనీ కోసం ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు లాంటి రాష్ట్రాలు చాలా ఆఫర్లు ఇచ్చాయి. ప్రస్తుతం పరిశ్రమల కోసం వివిధ రాష్ట్రాలు పోటీ పడుతున్న ప్రస్తుత వాతావరణంలో ఇలాంటి కంపెనీలు వస్తున్నాయంటే రెడ్ కార్పెట్ పరుస్తారు. అలాంటివేమీ అవసరం లేకుండానే వెనకబడ్డ రామాయపట్నం లాంటి ప్రాంతంలో కంపెనీ పెట్టడానికి ముందుకొచ్చింది. గతంలో కియా సంస్థకు ఇచ్చిన స్థాయిలో కూడా ఇండోసోల్‌కు రాయితీలు ఇవ్వలేదు. భూమి, కరెంట్, ఎస్‌జీఎస్‌టీ, మౌలిక సౌకర్యాల విషయంలోనూ కియా కంటే తక్కువ ప్రోత్సాహకాలే ఇచ్చారు. ఈ స్థాయిలో ఏ కంపెనీ వచ్చినా ఏ ప్రభుత్వమైనా సహకరిస్తుంది. ఇక్కడ ముఖ్య విషయం ఏమిటంటే ప్రభుత్వం ఫెసిలిటేటర్‌గా మాత్రమే వ్యవహరిస్తుండటం.

ఆరోపణ: హైదరాబాద్‌లో రిజిస్టరైన కంపెనీ

వాస్తవం : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రంలోనే రిజిస్టర్ అయి ఉండక్కర్లేదు. ఉదాహరణకు కియా పరిశ్రమనే తీసుకుంటే ఆ సంస్థ మన రాష్ట్రానికి చెందిందా? కియా కోసం యూనిట్ రూ.3 చొప్పున 100 శాతం విద్యుత్‌ను 20 ఏళ్ల పాటు ఇస్తుంది. ఇండోసోల్‌కు మాత్రం 7 సంవత్సరాల పాటు యూనిట్‌కు రూ.4.5 చొప్పున. ఆ తర్వాత 8 సంవత్సరాలకు యూనిట్‌కు రూ.4.5 చొప్పున 40% విద్యుత్‌ను మాత్రమే కేటాయించారు. సొంత విద్యుత్ అవసరాల కోసం ప్రత్యేకంగా విద్యుత్ యూనిట్ ఏర్పాటుకు (క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను) స్థలం కేటాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరింది. ఆ ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం ఇండోసోల్ తన సొంత ఖర్చుతో 7.2 గిగా వాట్స్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన భూమిని కేటాయించింది. కియాకు ఎకరా రూ.6 లక్షలతో మాత్రమే సేకరించే అవకాశం ఇచ్చింది. పైగా భూమిని చదును చేసే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించింది.

ఆరోపణ: అప్పనంగా భూములు కట్టబెట్టేస్తోంది..

వాస్తవం : ఈనాడు చెబుతున్నట్టుగా 4,827 ఎకరాల భూమిని ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడం లేదు. పైగా అవి ప్రభుత్వ భూములు కావు. రామాయపట్నంలో ఏపీఐఐసీ, మారిటైమ్ బోర్డ్ ద్వారా భూ సేకరణను సులభతరం చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. ప్రస్తుతం అమల్లో విధానం ప్రకారం భూసేకరణ కయ్యే వ్యయాన్ని పూర్తిగా మార్కెట్ ధర ప్రకారం ఇండోసోల్ కంపెనీయే భరిస్తుంది. అంతే గానీ భూమి కొనుగోలు కోసం ఇండోసోల్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు, సబ్సిడీ ఇవ్వలేదు.

ఆరోపణ: కలెక్టర్ లేఖ ఆధారంగా భూ సేకరణ

వాస్తవం : దేశంలోనే అతి పెద్ద పీవీ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ కోసం ఈ భూమిని సేకరిస్తున్నారు. ఈ యూనిట్ మొదటి దశకు కేంద్ర ప్రభుత్వం ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ కింద అర్హత సాధించింది. దాని ప్రకారం జాతీయ ప్రాముఖ్యతను కలిగిన ప్రాజెక్టు కోసం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని భూసేకరణ జరుగుతోంది. ఇంధన భద్రత, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి అవసరమైన భాగాలపై ఆధార పడటాన్ని తగ్గించడం, గ్రామీణ విద్యుదీకరణ కోసం అవసరమైన విధానాలను కేంద్రం రూపొందించింది. ఇండస్ట్రియల్ కారిడార్లు, హబ్‌ల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాల మేరకు అధిక జీతంతో కూడిన ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల విద్యుత్ అవసరాలను తీర్చడం వంటి అంశాలు ఈ ప్రాజెక్టులో భాగం. రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా, కేబినెట్ ఆమోదంతో ప్రజా ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు భూ సేకరణ కోసం చర్యలు చేపట్టింది.

ఆరోపణ: ఏళ్ల తరబడి కార్యకలాపాలు సాగించలేదు..

వాస్తవం : రాష్ట్రంలోని ప్రముఖ విద్యుత్ ఉప కరణాల తయారీ కంపెనీ షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు అనుబంధంగా ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటైంది. ఇప్పటికే షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ 2,500 మందికి పైగా ఉద్యోగాలను కల్పిస్తోంది. ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్ఇడిఎ) ద్వారా సమీకృత సోలార్ మాడ్యూల్ తయారీకి సంబంధించిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్ఐ) బిడ్డింగ్‌లో రిలయన్స్, అదానీలతో పోటీ పడి ఎల్–1గా నిలిచి రూ.1875 కోట్ల రాయితీలను దక్కించుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఐదేళ్ల వ్యవధిలో దశల వారీగా ప్రత్యక్షంగా 11,500 మందికి, పరోక్షంగా దాదాపు 10,000 –11,000 మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంది. ప్రత్యక్షంగా 11,500 మందికి ఉపాధి కల్పిస్తుండటంతో రాష్ట్ర ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు జాగ్రత్తగా పరిశీలించాకే ప్రోత్సాహకాలను వర్తింప చేసింది.

శ్రీశైలంలో రేపటి నుంచి సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



శ్రీశైలం టెంపుల్: మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు శ్రీశైల మహాక్షేత్రం ముస్తాబవుతోంది. పంచాహ్నిక దీక్షతో ఏడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం యాగశాల ప్రవేశంతో అంకురార్పణ చేస్తారు. ప్రతిరోజు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, మండపారాధనలు, పంచావరణార్చనలు, రుద్రహోమం, చండీహోమం, నిత్యహవనాలు జరిపిస్తారు. బ్రహ్మోత్సవాలలో ఈ నెల 13న భృంగివాహనసేవ, 14న రావణవాహన సేవ, 15న నందివాహనసేవ, బ్రహ్మోత్సవ కల్యాణం, 16న కైలాస వాహనసేవ, 17న పూర్ణాహుతి, ధ్వజావరోహణ, 18న అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ కార్యక్రమాలు ఉంటాయి. సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం నుంచి 18వ తేదీ వరకు ఆలయంలో జరిగే ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్ష సేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, స్వామి, అమ్మవార్ల కల్యాణం, ఏకాంత సేవలను నిలుపుదల చేశారు.

రూ.75 కోట్లతో క్యూ కాంప్లెక్స్ నిర్మాణం :

శ్రీశైలంలోని దేవస్థాన పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం రూ.75 కోట్లతో నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు ధర్మకర్తల మండలి ఆమోదించినట్లు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. అలాగే మల్లికార్జున సదన్‌పై రూ.5.80 కోట్లతో రెండవ అంతస్తు నిర్మాణం, ఇటీవల జరిగిన భూసర్వే ఆధారంగా దేవస్థాన సరిహద్దు చుట్టు రూ.5.50 కోట్లతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న పాల్గొన్నారు.

పర్యాటకంలో సంక్రాంతి సందడి

నేటి నుంచి భవానీ ద్వీపంలో సంక్రాంతి ఫెస్ట్

- శిల్పారామాల్లో 14 నుంచి 16 వరకు పల్లె పండుగకు భారీ ఏర్పాట్లు
- సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం
- పాపికొండల బోటింగ్‌కు ఫుల్ డిమాండ్

సాక్షి, అమరావతి:

రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. ఈ ఏడాది పర్యాటక ప్రదేశాలు, శిల్పారామాల్లో సంక్రాంతి సంబరాలకు ఏపీ శిల్పారామం, ఏపీటీడీసీ ఏర్పాట్లు చేశాయి. విశాఖపట్నం, విజయనగరం, కాకినాడ, తిరుపతి, కడప, పులివెందుల, అనంతపురం, పుట్టపర్తి శిల్పారామాల్లో 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజులపాటు ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించనున్నారు. సందర్శకులను అలరించేలా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు, 'సంక్రాంతి లక్ష్మి' పేరుతో సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నారు. తెలుగు సంస్కృతికి అద్దం పట్టేలా హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, జానపద, సంప్రదాయ కళారీతుల ప్రదర్శనకు సర్వం సిద్ధంచేశారు. బుల్లితెర హాస్యనటులతో హాస్యవల్లరి, భోజనప్రియులకు నోరూరించేలా పల్లె రుచులతో ఫుడ్ కోర్టులను ఏర్పాటుచేస్తున్నారు.



సంక్రాంతి వేడుకలకు ముస్తాబైన శిల్పారామం

నేటి నుంచి భవానీ ద్వీపంలో..

దేశంలోనే అతిపెద్ద నదీ ద్వీపమైన విజయవాడ భవానీ ఐలాండ్‌లో బుధవారం నుంచి సోమవారం వరకు ఆరు రోజులపాటు 'సంక్రాంతి ఫెస్ట్' నిర్వహించనున్నారు. పల్లెటూరి సంప్రదాయ జీవనాన్ని ప్రతిబింబించేలా ఈ ఫెస్ట్‌లో వినూత్న కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. చేతివృత్తి కళాకారుల స్టాల్స్, ఎగ్జిబిషన్‌తోపాటు మహిళలు, చిన్నారులకు ముగ్గులు, వంటల పోటీలు, సంప్రదాయ వస్త్రధారణ, జానపద గీతాలు, డ్రాయింగ్, గాలిపటాల తయారీ పోటీలు నిర్వహించనున్నారు. చిన్నారులకు మన సంస్కృతిలోని సైన్స్ గొప్పదనాన్ని చాటిచెప్పేలా థీమ్స్‌ను రూపొందించారు.

పాపికొండల యాత్రకు ఫుల్ డిమాండ్..

సంక్రాంతి సందర్భంగా పర్యాటకులు పాపికొండల బోటింగ్‌కు క్యూకడుతున్నారు. ప్రస్తుతం భద్రాచలం వైపున పోచవరం, దేవీపట్నంలోని గండిపోచమ్మ బోటింగ్ పాయింట్ల నుంచి 29 బోట్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికే చాలాబోట్లలో అడ్వాన్స్ బుకింగ్‌లు ఊపందుకున్నాయి. ఆదివారం, సోమవారాల్లో పర్యాటక శాఖ బోట్లు ముందస్తు బుకింగ్‌లతో నిండిపోయాయి. పోచవరం నుంచి పెద్దలకు రూ.950, చిన్నారులకు రూ.750, గండిపోచమ్మ నుంచి పెద్దలకు రూ.1,250, చిన్నారులకు రూ.1,050గా టికెట్ ధర ఉంది. ఇక పర్యాటక శాఖ హోటళ్లు, రిసార్టులు సైతం నిండిపోయాయి.



పాపికొండల అందాలు

కిడ్నీ బాధితులను ఆదుకుంటాం

- డయాలసిస్ రోగులకు అందుబాటులో మరో 12 రకాల మందులు
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌లో కిడ్నీ పరీక్షలకు చర్యలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



తలతంపర సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

కంచిలి: ఉద్దానంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులను జగనన్న ప్రభుత్వంలో అన్నివిధాలా ఆదుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని భరోసా ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం తలతంపరలో కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మంగళవారం ముఖాముఖి నిర్వహించారు. స్థానిక సర్పంచ్ డాక్టర్ జగబంధు దొళాయి, సీనియర్ వైద్యుడు డాక్టర్ పి.శివాజీ ఉద్దానంలో కిడ్నీరోగులు, వారికి అందుతున్న సేవలు, అందాల్సిన సేవలను వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్నవారంతా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డయాలసిస్ చేయించుకున్న వారిలో రక్తం పెరగడానికి అవసరమైన ఎరిత్రోమైసిన్ ఇంజక్షన్లు మరింత ఎక్కువగా సరఫరా చేయాలని నిర్ణయించామన్నారు. సోంపేట, కవిటి సీహెచ్‌సీల్లో డయాలసిస్ బెడ్లు ఐదేసి చొప్పున అదనంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఎప్పటికప్పుడు 'బ్లడ్ యూరియా' పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కిడ్నీల పరిమాణం తెలుసుకోవడానికి 'అల్ట్రాసౌండ్' పరీక్షలు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పలాస వరకే వస్తున్న నెఫ్రాలజిస్టును ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని డయాలసిస్ రోగులకు కూడా సేవలందించేందుకు వీలుగా వారంలో కొన్ని రోజులు కేటాయించడానికి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌లో కిడ్నీ పరీక్షలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డయాలసిస్ రోగులకు మరో 12 రకాల మందుల్ని అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కిడ్నీ రోగుల కోసమే పలాసలో రూ.50 కోట్లతో ఏర్పాటు చేస్తున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ మార్చికల్లా పూర్తవుతుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, కార్యదర్శి జె.నివాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, స్వచ్ఛభారత్ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణరావు, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, తహశీల్దార్ సీర హైమావతి, ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేబీస్ నిర్మూలనకు స్టీరింగ్ కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: జాతీయ రేబీస్ నిర్మూలన కార్యక్రమం (ఎన్ఆర్‌ఈపీ) రాష్ట్ర స్థాయి జాయింట్ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. 23 మందితో ఉన్న ఈ కమిటీకి చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉంటారు. వైద్య, ఆరోగ్య శాఖ, పశుసంవర్థక శాఖల ముఖ్యకార్యదర్శులు కో–చైర్మన్‌లుగా వ్యవహరిస్తారు. ఇతర సభ్యుల్లో పలు శాఖల ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, ఎన్జీవోలు ఉంటారు. 2030 నాటికి కుక్క కాటు ద్వారా వచ్చే రేబీస్ వ్యాధిని దేశంలో నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర వైద్య, పశుసంవర్థక శాఖలు సంయుక్తంగా జాతీయ కార్యాచరణ ప్రణాళిక– రేబీస్ నిర్మూలన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాయి. రాష్ట్రాల్లో కార్యక్రమం సమర్థవంతంగా అమలు అవడానికి రాష్ట్ర యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయడంతో పాటు, పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహిస్తుంది.

57 మంది బీసీ గురుకుల విద్యార్థులకు ఇన్‌స్పైర్ మానక్ అవార్డులు

సాక్షి, అమరావతి : సైన్స్ అండ్ టెక్నాలజీ కేంద్ర మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఇన్‌స్పైర్ మానక్ అవార్డులకు రాష్ట్రానికి చెందిన 57 మంది బీసీ సంక్షేమ గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) కార్యదర్శి కృష్ణమోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులు సాధించినందుకు ఒక్కో విద్యార్థికి రూ.10 వేల చొప్పున పారితోషికం లభిస్తుందన్నారు.

సాక్షి

బుధవారం, జనవరి, 11

అర్ధరహితమైన వివాదం

తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి స్వల్ప వ్యవధిలోనే మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఈసారి ఆ రాష్ట్ర అసెంబ్లీ అందుకు వేదికైంది. అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో సభనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. సభా సంప్రదాయానికి అనుగుణంగా రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన ప్రసంగ పాఠాన్ని ఆయన చదవాల్సివుండగా అందులోని కొన్ని వాక్యాలనూ, పదాలనూ ఆయన విడిచిపెట్టారు. పైగా కొన్నింటిని సొంతంగా చేర్చారు. దాంతో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గవర్నర్ తీరును నిరసిస్తూ ముఖ్యమంత్రి తీర్మానాలు ప్రవేశపెట్టడం, సభ వాటిని ఆమోదించటం అయిపోయింది. ఆ దశలో రవి అర్ధంతరంగా సభ నుంచి నిష్క్రమించారు. తమిళనాట ద్రవిడ ఉద్యమ ప్రభావం ఇప్పటికీ ఎంత బలంగా ఉన్నదో అందరికీ తెలుసు. కేరళ క్యాడర్ ఐపీఎస్ మాజీ అధికారి అయిన రవికి దీనిపై పూర్తి అవగాహన ఉంటుందనటంలో సందేహం లేదు. మరి 'ద్రవిడ మోడల్ ప్రభుత్వం' ప్రస్తావన, పెరియార్ రామస్వామి, అన్నాదురై వంటి తమిళ దిగ్గజాలతోపాటు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రస్తావన సైతం రవికి ఎందుకు రుచించలేదో అనూహ్యం. ఒక పౌరుడిగా ఈ దిగ్గజాలపైనా, మొత్తంగా ద్రవిడ ఉద్యమంపైనా రవికి సొంతాభిప్రాయాలేవో ఉండివుండొచ్చు. అంతమాత్రాన తనకిచ్చిన ప్రసంగపాఠంలో ఆ ప్రస్తావనలను మినహాయించటం హర్షించదగ్గదికాదు. అసలు తమిళనాడు అనటంపైనే ఆయనకు అభ్యంతరం ఉన్నట్టుంది. ఈమధ్య రాజ్‌భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమం సందర్భంగా ఆయన 'తమిళనాడు'కు బదులు 'తమిళగం' అని అన్నారు. ఆ వెంటనే దానిపై పెద్ద వివాదం రాజుకుంది. 'నాడు' అంటే సార్వభౌమాధికారం ఉండే ఒక రాజ్యంగా ధ్వనిస్తూ వేర్పాటువాద భావన కలగజేస్తున్నదని రవి అభిప్రాయంగా కనబడుతోంది. తమిళ సాహితీవేత్తల వివరణ ప్రకారం 'నాడు' అంటే 'గడ్డ', 'ప్రాంతం' అనే తప్ప వేరే అర్థం లేదు. అసలు తమిళనాడు అనే పేరు రాజ్యాంగానికి అనుగుణమైనదైనప్పుడు దానిపై పట్టింపులకు పోవటం సరైంది కాదు. అదింకా సద్దుమణగక మునుపే తాజా వివాదం తలెత్తింది.

మన ఫెడరల్ వ్యవస్థలో గవర్నర్ల పాత్రపై వివాదాలు చెలరేగడం ఇది మొదటిసారి కాదు... చివరిసారి కూడా కాకపోవచ్చు. నిజానికి అలాంటి సందర్భాల్లో తప్ప గవర్నర్ల వ్యవస్థపైనా, దాని అవసరంపైనా ఎవరూ ప్రశ్నలు లేవనెత్తడం లేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఇప్పటివరకూ ఎన్నో వ్యవస్థలపై చర్చలు సాగాయి. కొన్నింటి రూపురేఖలు కూడా మారాయి. కానీ సుప్రీంకోర్టు, కొన్ని హైకోర్టులూ తమముందుకొచ్చే కేసుల విచారణ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు, నిర్దేశించిన మార్గదర్శకాల పర్యవసానంగా ఏదోమేరకు మారింది తప్ప మొత్తంగా గవర్నర్ల వ్యవస్థ మునుపటి కాలంలో ఉన్నట్టే మిగిలిపోయింది. అందుకే సమస్యలు తప్పడం లేదు. అత్యంత ప్రజాస్వామ్యవాదిగా ముద్రపడిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూయే గవర్నర్ల వ్యవస్థపై తొలి మరక పడటానికి, ఫెడరల్ వ్యవస్థ మనుగడపై సందేహాలు ముసురుకోవటానికి కారకుడు కావటం ఒక వైచిత్రి. ఆనాటి కేరళ గవర్నర్ ద్వారా తనకు కావలసిన నివేదిక తెప్పించుకుని రాజ్యాంగంలోని 356 అధికరణ కింద 1959లో నంబూద్రిపాద్ నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వాన్ని సాగనంపేవరకూ నెహ్రూ విశ్రమించలేదు. అనంతరకాలంలో ప్రధాని అయిన ఆయన కుమార్తె ఇందిరాగాంధీ రికార్డు స్థాయిలో 50 సార్లు ఆ అధికరణాన్ని ఉపయోగించుకుని తనకు గిట్టని రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేశారు. అటుతర్వాత వచ్చిన సంకీర్ణ రాజకీయ యుగంలో దాన్ని పెద్దగా ఎవరూ ఉపయోగించలేదు. విపక్ష ఏలుబడిలో ఉంటున్న రాష్ట్రాల్లో గవర్నర్లకూ, సీఎంలకూ వివాదం ఏర్పడే ధోరణి తరచు కనబడటం మాత్రం వాస్తవం. అలాగని అన్నిచోట్లా అలా లేదు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బిహార్ గవర్నర్‌గా ఉన్నకాలంలో అప్పటికి బీజేపీ వ్యతిరేక కూటమిలో ఉన్న నితీశ్ కుమార్ ముఖ్య మంత్రిగా ఉన్నా ఆ ఇద్దరి మధ్యా పొరపొచ్చాలు రాలేదు. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా గవర్నర్‌గా పనిచేసినప్పుడు పెద్దగా వివాదాల్లోకెక్కలేదు. కానీ కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, తెలంగాణ గవర్నర్ తమిళిసైలకు అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలతో పొరపొచ్చాలు ఎడతెగకుండా సాగు తూనే ఉన్నాయి.

తమిళనాడు గవర్నర్ తన వ్యవహారశైలితో ఏం చెప్పదల్చుకున్నారో అర్థంకాదు. ఆయన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు ప్రోత్సాహంతోనే ఇలా చేస్తున్నారని డీఎంకే నేతలు ఆరోపించటం వల్ల ఆ రాష్ట్రంలో బీజేపీకి రాజకీయంగా నష్టమే తప్ప లాభం ఉండదు. పైగా తమిళనాట నీరాజనాలందుకునే పెరియార్, అన్నాదురైల పేర్లూ...అన్నిటికీ మించి అంబేడ్కర్ వంటి మహనీయుడి ప్రస్తావన ససేమిరా సమ్మతం కాదని పరోక్షంగా తెలియజెప్పటం ఏమేరకు సబబో రవి ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఒక రాష్ట్ర ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికీ, అక్కడ గవర్నర్‌గా నియమితులైనవారికీ మధ్య ఆధిపత్య పోరు ఎడతెగకుండా సాగటం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేకపోగా ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరని నష్టం కలగజేస్తుంది. ఇలాంటి వివాదాలు చెలరేగినప్పుడల్లా పరస్పరం విమర్శలు చేసుకోవటం, రాజ్యాంగ సంక్షోభం తలెత్తటం, ఆ తర్వాత మరో కొత్త తగువు బయల్దేరేవరకూ మౌనం వహించటం కాక... గవర్నర్ల అధికారాలు, వారి పరిధులు, పరిమితులపై సరైన దిశగా చర్చ జరిగి వర్తమాన కాలానికి అనుగుణమైన విధానం రూపుదిద్దుకోవటం శ్రేయస్కరం.

అనూహ్య వ్యూహం 'గృహ సారథి'

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

'గృహ సారథి' పేరుతో ఈ ఏడాది 5.20 లక్షల మంది యువతను సూక్ష్మ (గ్రాస్ రూట్స్) స్థాయి క్రియాశీల రాజకీయాల్లో భాగస్వామ్యుల్ని చేయాలని ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నిర్ణయించింది. ఈ 'గృహ సారథులు' ప్రతి 50 కుటుంబాలకు ఇద్దరు చొప్పున వారి అవసరాలు ప్రభుత్వం వద్ద 'పెండింగ్' కనుక ఉంటే, వాటి పరిష్కారం కోసం పార్టీ తరఫున పనిచేస్తారు. ఆ కుటుంబాల్లోని మహిళా సభ్యుల అవసరాలు తెలుసు కోవడం కోసం వీరిలో ఒక యువతి కూడా ఉంటుంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఎన్నికల ముందు– 'మా పార్టీ మీ గుమ్మం వద్ద' అన్నట్టుగా వీరు ప్రజలకు అందుబాటులో ఉంటారు. వీరి పనితీరును సమీక్షించడానికి మరో 45 వేల మంది 'కన్వీనర్లు' ఉంటారు. ఎనభై శాతం పైగా నిర్లక్ష్యానికి గురైన వర్గాల యువత గత మూడేళ్ళుగా వలంటీర్లు, గ్రామ సచివా లయాలల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. వీరిలో ఎక్కువమంది సర్వీస్ ఇప్పటికే ప్రభుత్వం 'రెగ్యులరైజ్' చేసింది. మళ్ళీ అవే వర్గాలకు ఆ వ్యవస్థతో సమాంతరంగా, అధికార రాజకీయ పార్టీ శ్రేణులుగా పని చేయడానికి మరో కొత్త అవకాశం వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ రంగంలో ఇంత పెద్ద 'రిక్రూట్మెంట్' జరగడం ఇది ప్రథమం. ఈ 'గృహ సారథి' వ్యవస్థ వల్ల తాత్కాలిక ప్రయోజనం వారిని నియమించిన పార్టీకి ఉంటే, దీర్ఘకాలిక ప్రయోజనం పెద్ద సంఖ్యలో రాజకీయ రంగంలోకి ప్రవేశిస్తున్న ఈ యువతది అవుతుంది. ఇన్నాళ్లూ పార్టీ శ్రేణులుగా తలల లెక్కకు తప్ప దేనికీ పనికిరాని ఈ యువతకు, ఇక ముందు 'బూత్' స్థాయిలో అధికార పార్టీ ప్రతినిధులుగా కొత్త గుర్తింపు రాబోతున్నది. అంటే– భవిష్యత్ రాజకీయాల్లో క్రియాశీలంగా పనిచేయడానికి వర్ధమాన వర్గాల నుంచి వైసీపీ 'నర్సరీ'లో సరికొత్త మానవ వనరు సిద్ధమవుతున్నదన్న మాట! సరిగ్గా ఇక్కడే తెలుగునాట మూడు దశాబ్దాల దళిత బహుజన రాజకీయాల ప్రస్తావన అనివార్యం అవుతున్నది. అప్పట్లో క్షేత్ర స్థాయి శ్రేణుల పాటవ నిర్మాణాన్ని (కెపాసిటీ బిల్డింగ్) పట్టించుకోకుండా, కేవలం కొందరు నాయకుల వ్యక్తిగత 'ఫోకస్' తాపత్రయం కారణంగా, అప్పటి ఆ రాజకీయాల ఆయుష్షు అర్ధంతరంగా ముగిసింది. ఈ నేపథ్యంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పలుకుబడి వర్గాల 'లాబీయింగ్'కు 'చెక్' పెట్టి మరీ, సాంఘిక సంక్షేమంలో– అర్హులైన అన్ని ఉపకులాలకు ఫలాలు అందే విధంగా 'హైబ్రిడ్ మోడల్' ప్రవేశపెట్టింది. దాంతో కాలం చెల్లిన ఒత్తిడి పెంచే 'ట్రిక్స్' ఇక్కడా మొదలయ్యాయి. 'ఒకప్పటి ఎస్సీ కార్పొరేషన్ కాలం నాటి బడ్జెట్ ఏది? ఆ పథకాలు ఇప్పుడు ఏవి?' అని ఇటీవల కొందరు వాపోతున్నారు. దామాషా మేరకు పంపిణీ లక్ష్యం కోసం, స్వీయ సామాజిక వర్గాల ఒత్తిళ్లనే జగన్ పట్టించుకోవడం లేదు. లొంగడం లేదు. చిత్రం– ఇప్పటికీ ఇక్కడ సమస్య ఏమంటే – 'రాజ్యాధికారం' అంటే, కాపుకొచ్చిన తోటలో పంట దింపుకోవడం కాదనీ, వీరికి అర్థం కావడం లేదు. దాన్ని ఆశించేవారు, అందుకు తమదైన నేల బాగుచేసి, అందులో అనువైన విత్తనాలు జల్లి ముందుగా మనదైన పంట పండించాలి. రాష్ట్ర విభజన తర్వాత, మారిన సమీకరణాలతో– 'పోస్ట్ మండల్' 'పోస్ట్ ఎకనామిక్ రిఫార్మ్స్' కాలానికి తగిన సరి కొత్త రాజకీయాలు... కేవలం సాంప్రదాయ రాజకీయాలు మాత్రమే తెలిసిన ఈ పార్టీలకు అవగాహన లేదు. నిశ్శబ్దంగా ఆ ఖాళీ జాగాను ఆక్రమించి, గత మూడున్నర ఏళ్లుగా తన సంక్షేమ–అభివృద్ధి ప్రయోగా లను ఇక్కడ అమలు చేస్తున్నారు జగన్. గత ఏడాది జరిగిన తొలి పార్టీ సమీక్షలో– జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, 'అవుట్ రీచ్ అప్రోచ్'తో మనం పనిచేయాలి అని ఒక కొత్త పదప్రయోగం చేశారు. దాని భావం అర్థమైతే, ఆయన విమర్శకులకు సగం పని భారం తగ్గుతుంది!

ఇటీవల బహిరంగ సభల్లో జగన్ 'ఇది కులాల మధ్య యుద్ధం కాదు, వర్గాల మధ్య యుద్ధం' అన్న తర్వాత, ఆ ప్రకటనపై వ్యాఖ్యానించలేని దశలో ఇక్కడి రాజకీయ పక్షాలు మిగిలిపోవడం, 'అకడమిక్' వర్గాల్లో అధ్యయనం అవసరమైన అంశం. 'గృహ సారథి' నియామకం ప్రపంచీకరణ దుష్పరిణామాలను ఎదు ర్కోవడానికి సామాజిక శాస్త్రవేత్తలు ప్రతిపాదిస్తున్న – 'గ్రీన్ పాలిటిక్స్' దిశలో ఒక ఆహ్వానించదగిన పరిణామం. ఎందుకంటే – 'సోషల్ కేపిటల్', 'ఫంక్షనల్ పాలిటిక్స్' థియరీల ఆచరణకు ఇదొక పెద్ద ముందడుగు అవు తుంది. లోతులు తెలియని విమర్శకులు కురచ దృష్టితో దీన్ని తక్కువచేసి చూడ్డం తేలికే గానీ, వీరిని నియమించిన పార్టీ కంటే, ఆ పార్టీ శ్రేణులకు దీనివల్ల కలిగే ప్రయోజనం విలువైనది.

వ్యాసకర్త అభివృద్ధి, సామాజిక అంశాల వ్యాఖ్యాత

వేర్ ఈజ్ ద 'పార్టీ'!

▶ మొదటి పేజీ తరువాయి

యుద్ధానికి సిద్ధం చేయటం కుదిరే పనికాదని ఆయనకు స్పష్టంగా అర్థం కావటంతో... పొత్తుల కోసం తిరగని దారంటూ లేక తీవ్రమైన నిస్పృహకు లోనవుతున్నారు. తను చెప్పినట్టల్లా వినే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను వ్యూహం ప్రకారం కావాలనుకున్నపుడల్లా కలుస్తూ... తామిద్దరం కలిస్తే ఏదో అద్భుతం జరిగిపోతుందనే సంకేతాలివ్వటానికి తాపత్రయపడుతున్నారు. ప్రతిసారీ 'ప్రజాస్వామ్య పరిరక్షణ' ముసుగు మాత్రమే వేసుకోవాల్సి రావటం కూడా ఆయనలో నిరాశా నిస్పృహలను పెంచేస్తోంది. అది ఎప్పటికప్పుడు ఆయన మాటల్లో కనిపిస్తూనే ఉంది. కాకపోతే బాబు కొమ్ము కాయటం ఒక్కటే తెలిసిన 'ఈనాడు'కు టీడీపీలోని ఈ అస్తవ్యస్త పరిస్థితులు కనిపించకపోవటం... వైఎస్సార్ సీపీలో అక్కడక్కడా ఉండే అసంతృప్తి మాత్రమే కనిపించటం పెద్ద విచిత్రమేమీ కాదు.

ఇదీ టీడీపీ వాస్తవ స్థితి

తెలుగుదేశానికి ఆది నుంచీ మీడియా బలం ఎక్కువే. పత్రికలతో ఆరంభమైన ఈ జాడ్యం... ఎలక్ట్రానిక్ మీడియా విస్తరిస్తున్న కొద్దీ ఛానెళ్లకూ అంటుకుంది. బలమైన బలగాలను పెట్టుకునే ధన బలం ఉండటంతో ఈ ధోరణి సోషల్ మీడియాకూ వ్యాపించింది. జనంలో తప్ప అన్నిరకాల మీడియాలోనూ తెలుగుదేశం బలంగా కనిపించటానికి ఇప్పటికీ ఇదే కారణం. అగ్రనేతలు సైతం ప్రయివేటుగా మాట్లాడేటపుడు 'పార్టీ లేదు... బొక్కా లేదు' అంటూ వాస్తవాలు చెప్పటం... మీడియా మైకుల ముందుకు వచ్చేసరికి పాలక పక్షంపై తీవ్ర విమర్శలతో రెచ్చిపోవటం మనకి తెలియనిదేమీ కాదు. ఫోటోలు వీడియోల కోసం మీడియా సమావేశాలు పెట్టడమే తప్ప పార్టీ పరంగా క్రియాశీలక కార్యక్రమాలేవీ లేవు. చంద్రబాబు పిలుపునిచ్చినా స్పందించే పరిస్థితి లేదు. 'బాదుడే బాదుడు' అనే కార్యక్రమం పెట్టినా అది ఫ్లాప్ కావడంతో దాని పేరు మార్చి 'ఇదేం ఖర్మ' నినాదం అందుకున్నారు. దానిక్కూడా పెద్ద స్పందన లేకపోవటంతో జనాన్ని తెచ్చి ఇరుకు రోడ్లపై సభలు పెట్టడం... వారిని డ్రోన్లతో చిత్రించి తన మీడియాలో బీభత్సంగా చూపించటమనే వ్యూహాన్ని ఎంచుకున్నారు. కానీ కందుకూరులో అది బెడిసికొట్టింది. 8 మంది ప్రాణాలు కోల్పోవటంతో... జనాన్ని రప్పించడానికి కానుకల ఎర వేశారు. అక్కడ కూడా మాట నిలబెట్టుకోలేక ముగ్గురిని బలితీసుకున్నారు.

'కుప్పం'లోనూ ఓటమి భయం!

175 స్థానాల్లో 68 చోట్ల ఇన్‌ఛార్జిలు లేకున్నా... ఇన్‌ఛార్జిలు ఉన్నచోట కూడా వారు కార్యకర్తలను, పార్టీని పట్టించుకోవడం లేదని నిత్యం చంద్రబాబు గగ్గోలు పెడుతున్నారు. పార్టీ మహా ఘనంగా ఉన్నట్లు చెప్పే కృష్ణా జిల్లాలోనే నాలుగు నియోజకవర్గాల్లో పార్టీని పట్టించుకునే నాథుడు లేడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పిలిచి పార్టీ పదవులిస్తామన్నా తీసుకునేందుకు టీడీపీ నాయకులెవరూ ముందుకు రాకపోవటంతో... కొందరికి నెల వారీ జీతాలు ఇచ్చి అనుబంధ సంఘాల అధ్యక్షులుగా నియమించుకున్నారు. ఒకప్పుడు తమది అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ అని ఘనంగా చెప్పిన టీడీపీ అధినేత... ఇపుడు అందులో దాదాపు 20 శాతం కూడా లేరనే వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. నిజానికి 2019లో సార్వత్రిక ఎన్నికల ఘోరపరాజయం... తర్వాత జరిగిన పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లోనూ వెంటాడింది. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లోనూ అదే కథ. చివరకు 1989 నుంచి గెలుస్తూ చంద్రబాబు తన అడ్డాగా చెబుతున్న కుప్పంలోనూ టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయింది. అక్కడి 87 శాతం పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేసింది. నియోజకవర్గంలోని 4 మండల పరిషత్ అధ్యక్ష పదవులను, నాలుగు జడ్పీటీసీ స్థానాలనూ గెలిచి క్లీన్ స్వీప్ చేసింది. కుప్పం కంచుకోట కూలిపోవటంతో దిక్కుతోచని బాబు... అక్కడ సొంత ఇల్లు కట్టుకునే ప్రయత్నాల్లో పడటమే కాక... పదేపదే తన నియోజకవర్గానికి వెళ్తూ ర్యాలీలు, సభలు నిర్వహిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వచ్చే ఎన్నికల్లో కుప్పం కూడా దక్కదేమోనన్న భయంతోనే... బాబు అనుకూల మీడియా ఈ 'కుంపట్లు' రాజేస్తోంది.

కుంపట్లు కాదిక్కడ... దహించే కార్చిచ్చు

రాయలసీమలో వైఎస్సార్ సీపీ నేతల్లో అసంతృప్తి కుంపట్లు రగులుతున్నాయనేది రామోజీ ప్రవచిత వార్త. నిజానికి అధికారంలో ఉన్న పార్టీలో స్థానికంగా దిగువన ఎంతో కొంత అసంతృప్తి ఉండటం సహజం. దాన్ని చక్కదిద్దటానికే ప్రాంతీయ స్థాయిలో కో–ఆర్డినేటర్లు, నియోజకవర్గాల్లో సమన్వయ కర్తలు, పరిశీలకులు నిరంతరం పని చేస్తున్నారు. వారు సమీక్షల్లో కొన్ని వర్గాలు తమ అసంతృప్తిని వ్యక్తం చేయటమనేది అసాధారణమేమీ కాదు. దీన్ని 'రగులుతున్న కుంపట్ల'తో పోల్చిన రామోజీ రావుకు... తెలుగుదేశాన్ని దహించేస్తున్న కార్చిచ్చు మాత్రం కనపడలేదు.

టీడీపీలో అంతర్గత పోరు విషయానికొస్తే

శ్రీకాకుళం జిల్లాలో కళా వెంకట్రావు, అచ్చెన్నాయుడి మధ్య విభేదాలు తారస్థాయిని చేరాయి. అచ్చెన్నాయుడిని రాష్ట్ర అధ్యక్షుడి పదవి నుంచి తప్పించాలని పార్టీ పొలిట్ బ్యూరో సమావేశంలోనే కళా వెంకట్రావు డిమాండ్ చేశారు. ఉమ్మడి విజయనగరంలో అశోక్ గజపతిరాజు తీరును మెజారిటీ నేతలు వ్యతిరేకిస్తుండగా... ఉమ్మడి విశాఖ జిల్లాలో గంటా శ్రీనివాసరావు బాబు పిలుపులకు స్పందించటమే మానేశారు. విలేకరుల సమావేశాల్లో అయ్యన్న, బండారు కలిసి కనిపించినా... లోలోపల ఒకరంటే ఒకరు రగిలిపోతున్నారు. 'తూర్పు'లో గోరంట్ల, చినరాజప్ప, యనమల, ఆదిరెడ్డి వర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తూనే ఉంది. 'కృష్ణా' గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే టీడీపీకి అంత మంచిది. కేశినేని నాని, బుద్దా వెంకన్న, బోండా ఉమా, దేవినేని ఉమా వర్గాలు రోజూ రోడ్డున పడుతూనే ఉన్నాయి. రాయలసీమ జిల్లాల్లో ఆ పార్టీకి సరైన నాయకత్వమే లేదు.

చూడాల్సింది.. జనం నాడి!

స్థానికంగా ఉండే అధికార పార్టీ నాయకుల్లో ఎంతో కొంత అసంతృప్తి సహజం. అది ఎటుతిరిగీ సర్దుకునేదే. ఇక్కడ ముఖ్యంగా చూడాల్సింది జనం ఏమనుకుంటున్నారనేది కదా? ప్రభుత్వం పట్ల, అధికారంలో ఉన్న పార్టీ పట్ల జనం ఎలా ఫీలవుతున్నారనేది కదా? ఇపుడు రాష్ట్రంలో 87 శాతం ఇళ్లకు ప్రభుత్వ పథకాలు నేరుగా చేరుతున్నాయి. గ్రామాల్లో ఇది ఏకంగా 92 శాతం. ఆ ఇళ్లలో ఉండేవారి పేర్లతో సహా ఎవరెవరికి ఎంత మేలు చేశామో అంకెలతో సహా వివరిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. గతంలో మాదిరి జన్మభూమి కమిటీలు లేవు. నేతల సిఫారసులు అక్కర్లేదు. అర్హతే ప్రామాణికంగా అందరికీ పథకాలు అందుతున్నాయి. జనం దీనికి జై కొడుతున్నారు కనకే... ప్రతి ఎమ్మెల్యే, సమన్వయకర్త తన నియోజకవర్గంలోని ప్రతి గడపకూ వెళ్లి వారి ఆశీస్సులు తీసుకోగలుగుతున్నాడు.





సంస్కరణల విప్లవం

స్వాతంత్ర్యం వచ్చాక గడిచిన 75 ఏళ్లలో ఈ స్థాయి సంస్కరణలను ఈ రాష్ట్రమే కాదు! దేశంలోని ఏ రాష్ట్రమూ చూడలేదనే చెప్పాలి. సమాజంలోని ప్రతి వర్గానికీ మెరుగైన జీవితాన్నిచ్చేలా, జీవనాన్ని సులభతరం చేసేలా విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ప్రతి 50 ఇళ్లకూ ఓ వలంటీరును ఏర్పాటు చేసి పింఛన్లు నేరుగా అవ్వాతాతల ఇళ్లకే పంపిస్తున్నారు. గ్రామ స్థాయిలో సచివాలయాలు ఏర్పాటు చేసి గ్రామ వ్యవహారాలన్నీ అక్కడే పరిష్కరించటం కాక... అక్కడే భూ రిజిస్ట్రేషన్లు కూడా జరిపే స్థాయికి తీసుకొచ్చారు. 'నాడు–నేడు' పేరిట కార్పొరేట్‌ను తలదన్నేలా స్కూళ్లను తీర్చిదిద్దటమే కాక... ఆసుపత్రుల రూపురేఖలూ మార్చారు. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వీటికి తోడవటంతో... గ్రామాల ముఖచిత్రమే మారిపోయింది. స్కూళ్లను అందంగా తీర్చిదిద్దటమే కాక.. విద్యార్థులను స్కూళ్లకు పంపించే తల్లులకు 'అమ్మ ఒడి' పేరిట నగదు అందజేస్తున్నారు. విద్యా సంవత్సరం ఆరంభం కాకముందే పుస్తకాలతో పాటు యూనిఫామ్, సాక్సులు, షూ, బెల్టు ఇలా మొత్తం సెట్‌ను అందిస్తున్న జగనన్న విద్యాకానుక... మధ్యాహ్నం రుచికరమైన భోజనాన్ని అందిస్తున్న 'జగనన్న గోరుముద్ద'... కుట్రలకు ఎదురీది తెచ్చిన ఇంగ్లిష్ మీడియం... అగ్రగామి ఎడ్యుటెక్ సంస్థ 'బైజూస్' 5వ తరగతి నుంచీ విద్యార్థులకిస్తున్న విలువైన కంటెంట్... పాఠాలు సులువుగా అర్థమయ్యేలా తెలుగు– ఇంగ్లిష్‌ల్లో ముద్రిస్తున్న పుస్తకాలు... 8వ తరగతి విద్యార్థుల చేతికి వచ్చిన విలువైన ట్యాబ్‌లు... ఉన్నత విద్య చదువుతున్నవారికిస్తున్న విద్యాదీవెన, వసతి దీవెన... ఇవన్నీ రాష్ట్ర విద్యా రంగంపై ముఖ్యమంత్రి చూపిస్తున్న శ్రద్ధకు నిలువెత్తు నిదర్శనాలు. 'నాడు–నేడు'లో ఇప్పటికే రూపు మార్చుకున్న స్కూళ్లలో వచ్చే ఏడాది నుంచీ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఉండే డిజిటల్ క్లాస్‌రూమ్‌లు అందుబాటులోకి వస్తున్నాయంటే... విద్యకిస్తున్న ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. ఇవన్నీ చూస్తున్నారు కనకే... జనం మళ్లీ ఆశీస్సులివ్వటానికి సిద్ధంగా ఉన్నారన్నది వైఎస్సార్ సీపీ విశ్వాసం.

వైద్యం, వ్యవసాయం... ఊహించని ముందడుగు

మెరుగైన వైద్య సేవలే కాదు. ఫ్యామిలీ డాక్టర్లు సైతం ఊళ్లకే వస్తున్నారంటే ఇది ఏ స్థాయి మార్పో తెలియకమానదు. 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లతో గ్రామాల్లోనే 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు అందుతున్నాయి. టెలీమెడిసిన్ ద్వారా నిపుణుల సేవలు చేరువయ్యాయి. 2019కి ముందు... ఆస్పత్రుల్లో శిశువులను ఎలుకలు పీక్కుతిన్న అధ్వాన్న స్థితులు, సెల్‌ఫోన్ వెలుతురులో సర్జరీలు చేసిన ఘటనలు చూశాక ప్రజలకు ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం పోయింది. ఈ పరిస్థితుల్ని చక్కబెడుతూ 'నాడు–నేడు' పేరిట రూ.16వేల కోట్లకు పైగా నిధులతో ఆసుపత్రులను సంస్కరించారు వైఎస్ జగన్. వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా ఏకంగా 47వేలకు పైగా పోస్టులను భర్తీ చేశారు.



'ఆరోగ్య శ్రీ'లో 1,059 చికిత్సలు మాత్రమే అందుబాటులో ఉండగా... ఆ సంఖ్యను ఏకంగా 3,255కు పెంచారు. ఫలితంగానే 2019 నుంచి గత ఏడాది డిసెంబర్ నెలాఖరు వరకూ 57 లక్షల మంది ఉచితంగా వైద్య సేవలు పొందగా... వారికోసం ప్రభుత్వం రూ.12,353 కోట్లు ఖర్చు చేసింది. అందుకే జనంలో ఈ పార్టీకి అంతటి ఆదరణ.



దేశానికే ఆదర్శంగా... ఆర్బీకే

సచివాలయాలకు అనుబంధంగా గ్రామ స్థాయిలో విత్తు నుంచి విక్రయం వరకు రైతులను చేయి పట్టి నడిపించేలా 10,778 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. 14,413 మంది సిబ్బంది వీటిలో సేవలందిస్తుండగా, ప్రతి ఆర్బీకేకి ఓ వలంటీర్‌తో పాటు వీటికి 9277 మంది బ్యాంకింగ్ కరస్పాండెంట్లను అనుసంధానించారు. ఆర్బీకేల్లోని కియోస్క్‌ల ద్వారా బుక్ చేసుకున్న 24 గంటల్లోనే సర్టిఫై చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను అందిస్తున్నారు. ఈ–క్రాపింగ్ కూడా ఇక్కడే అందుతోంది. అన్నీ అందించటమే కాదు. పండించిన పంటను కొనుగోలు చేయడమూ ఇక్కడే. అందుకే ఈ వ్యవస్థ ప్రపంచ దేశాలకే రోల్ మోడల్ అవుతోంది. అద్దెకు యంత్ర పరికరాలను రైతులకివ్వాలన్న సంకల్పంతో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. 2వేల డ్రోన్లు కూడా రైతులకు అందుబాటులోకి రాబోతున్నాయి. ఇంకా వేబ్రిడ్జ్‌లు, 2536 బహుళ ప్రయోజన కేంద్రాలు, 1134 గోదాములు నిర్మాణంలో ఉన్నాయి. నియోజకవర్గ స్థాయిలో 147 వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ ఏర్పాటు చేస్తుండగా... ఇప్పటికే 70 వరకు అందుబాటులోకి వచ్చాయి. పాడి పశువుల కోసం అంబులెన్స్‌లు... స్వదేశీ గోజాతిని పెంపొందించేందుకు 58 యూనిట్లు వచ్చాయి. మరో 55 రాబోతున్నాయి. అమూల్ సహకార సంస్థను తెచ్చి రాష్ట్ర పాడి రైతుల కష్టానికి తగ్గ ఫలితాన్ని ఇప్పిస్తున్నారు ముఖ్యమంత్రి.

రైతు భరోసా పేరిట ప్రతి రైతు ఖాతాలో ఏడాదికి రూ.13,500 జమ చేస్తున్న ప్రభుత్వం... వారిపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమానూ అమలు చేస్తోంది. లక్ష లోపు పంట రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన రైతులకు సీజన్ ముగియకుండానే వడ్డీ రాయితీ అందించటమే కాదు... ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతుకు సీజన్ ముగియకుండానే పెట్టుబడి రాయితీని, ఆ సీజన్ మళ్లీ వచ్చేలోగా బీమా మొత్తాన్ని అందిస్తున్నారు. ఖర్చుకు వెనకాడకుండా రైతులకు పూర్తి ఉచితంగా పగటిపూట 9 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే రైతుకు ఈ రకంగా అండగా నిలిచిన ప్రభుత్వం చరిత్రలోనే కనిపించదు. ఇప్పుడు రాష్ట్ర రైతాంగం యావత్తూ వైఎస్సార్ సీపీ వెంట ఉన్నదంటే కారణం ఇదే మరి. రకరకాల సంక్షేమ పథకాలతో అసహాయులకు అండగా నిలవటమే కాదు... అర్హత ఉండి కూడా ఏ పథకమైనా దక్కకపోతే వారిని గుర్తించి మరీ అందజేస్తోంది ప్రభుత్వం. అందుకే జనమంతా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి నేరుగా కనెక్ట్ అవగలుగుతున్నారు. ఆ విశ్వాసంతోనే ముఖ్యమంత్రి సైతం ఈ సారి 175 స్థానాల్లోనూ ఎందుకు గెలవలేం? అనే ప్రశ్న వేసుకుని... దాన్ని సమాధానం సాధించే దిశగా తన టీమ్‌ను నడిపిస్తున్నారు. ఆ భయంతో పొత్తుల కోసం పరుగులుపెడుతున్న చంద్రబాబును ఏదో ఒకలా లేపటానికి, వైఎస్సార్‌సీపీ విషయంలో లేని గందరగోళాన్ని సృష్టించడానికి రామోజీ తనకు చేతనైనంత మేర రాస్తున్నారు. అయినా జనం నమ్మటం లేదని రగిలిపోతున్నారు. ఆ సెగలోంచి పుట్టుకువస్తున్నవే... ఈ కుంపట్లు!!.

ఈగ – తేనెటీగ

జ్యోతిర్మయం

అదొక ఆశ్రమం. ఒక శిష్యుడు 'గురువు గారూ... మీరు ప్రకృతి గురించి, ఇతర ప్రాణుల గురించి అనేక విషయాలు చెప్తూ వస్తున్నారు. వాటి నుంచి అనేకం నేర్చు కోవచ్చన్నారు. అయితే నాలాంటి సామాన్యులైన విద్యార్థులు ఓ ఈగ నుంచి ఏం నేర్చు కోవచ్చో చెప్పగలరు' అన్నాడు.

'శిష్యా! మంచి ప్రశ్న వేశావు. ఈగ దేని పైనా ఎక్కువసేపు దృష్టి పెట్టకుండా తిరుగు తూనే ఉంటుంది. పూవు మీద వాలినా, తేనెను రుచి చూసినా దానిని తనతో తీసుకుపోదు. నీలాంటి విద్యార్థి పాఠం చదువుతున్నప్పుడు ఈగ లాగే మనసు ఎక్కడెక్కడికో తిరగడానికి పోతుంటుంది. అటువంటి మనసుని పక్కకు పోనివ్వకుండా చదువుతున్న పాఠంమీదే ఏకాగ్రత వహించాలి అనేది ఈగ ప్రవర్తన నుంచి నేర్చుకోవలసిన పాఠం' అన్నారు గురువుగారు.

అనంతరం ఇంకొక శిష్యుడు 'అలాగైతే మరి మేం దేనిలా ఉండాలి' అని అడిగాడు. 'ఒక్కొక్క విద్యార్థీ తేనెటీగలా ఉండాలి. తేనె టీగ ప్రతి పువ్వు దగ్గరకు వెళ్ళి ఎంతో పొందికగా ఆ పువ్వులోని మకరందాన్ని సేకరి స్తుంది. ఏ పువ్వు నుంచి తేనె స్వీకరించినా మొదటగా దానిని తన నోటి నాళంలోకి పోని స్తుంది. అక్కడి నుంచి తన గూటికి పోయి అక్కడ పద్ధతి ప్రకారం నిల్వ చేస్తుంది. అలాగే విద్యార్థి కూడా తాను చదివే వేద వేదాంగాలనూ అర్థం చేసుకుని సారాన్ని తనలో నిలుపుకోవాలి. అలా ఉంచుకున్న విషయాలు ఇహలోకంలో ఆదర్శ జీవనం గడపడానికే కాదు... దైవ సాయుజ్యాన్ని పొందటానికీ ఉపయోగపడతాయి. ఈగ మీరు ఎలా ఉండ కూడదో చెబుతుంటే... తేనెటీగ మీరు ఎలా ఉండాలో చెబుతోంది' అని గురువుగారు సమాధానం ఇచ్చారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** బ.చవితి ప.11.34 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** మఖ ఉ.9.37 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** సా.6.15 నుండి 8.01 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.44 నుండి 12.31 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.01 నుండి 8.44 వరకు; **రాహుకాలం**: ప.12.00 నుండి 1.30 వరకు; **యమగండం** : ఉ.7.30 నుండి 9.00 వరకు ; **సూర్యోదయం** 6.38 ; **సూర్యాస్తమయం** 5.39.


ఏలూరు జిల్లా ఈదేపల్లిలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు


పార్వతీపురం మన్యం జిల్లా పాంచాలిలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

గడప గడపకు మన ప్రభుత్వం


అన్నమయ్య జిల్లా గద్దరాజులపల్లెలో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి


గుంటూరు జిల్లా తెనాలిలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

క్లుప్తంగా...

శ్రీవాణి దర్శనం టికెట్ల కోటా రోజుకు 1000

- ఆన్‌లైన్‌లో 750, ఆఫ్‌లైన్‌లో 250

తిరుమల: శ్రీవారి దర్శనం విషయంలో సామాన్య భక్తులకు మరింత ప్రాధాన్యత పెంచేందుకు వీలుగా శ్రీవాణి దర్శన టికెట్లను టీటీడీ రోజుకు 1,000కి పరిమితం చేసింది. ఇందులో ఆన్‌లైన్‌లో 750, ఆఫ్ లైన్‌లో 250 టికెట్లను జారీచేస్తారు. ఇప్పటికే టీటీడీ 500 టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయగా, అదనంగా బుధవారం మరో 250 టికెట్లు విడుదల చేయనుంది. మాధవం విశ్రాంతి గృహంలో శ్రీవాణి టికెట్ల కేటాయింపును టీటీడీ రద్దు చేసింది. ఇక నుంచి శ్రీవాణి దాతలకు విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్‌ను అందుబాటులో ఉంచారు. బోర్డింగ్ పాస్ ద్వారా తిరుపతి ఎయిర్‌పోర్టు కౌంటర్‌లో మాత్రమే ఆఫ్‌లైన్ టికెట్లు జారీ చేస్తారు. శ్రీవాణి దాతలు బ్రేక్ దర్శనం టికెట్‌కి బోర్డింగ్ పాస్‌ను జతచేయాలి. టికెట్‌పై ఎయిర్‌లైన్ రిఫరెన్స్‌తో కూడిన పీఎన్ఆర్ నంబర్‌ను కూడా నమోదు చేయించాలి. వైకుంఠం క్యూ కాంప్లెక్సులోని సిబ్బంది బ్రేక్ దర్శన టికెట్‌తో పాటు బోర్డింగ్ పాస్‌ను తనిఖీ చేసి దర్శనానికి అనుమతిస్తారు.

తిరుప్పావడ సేవ పునఃప్రారంభం: తిరుమల శ్రీవారి ఆలయంలో తిరుప్పావడ ఆర్జిత సేవ ఈ నెల 12 నుంచి పునఃప్రారంభం కానుంది. ఇందుకోసం యాత్రికులు తిరుమలలోని సీఆర్‌వో కౌంటర్‌లో నమోదు చేసుకోవాలి. వీరికి బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా 25 టికెట్లు జారీ చేస్తారు.

నిర్ణీత సమయంలో శ్రీవారి దర్శనం: తిరుమలలో నిర్ణీత సమయంలో కేటాయించిన టైమ్స్ స్లాట్ టికెట్లకు త్వరితగతిన దర్శనమవుతోంది. సోమవారం అర్ధరాత్రి వరకు 56,003 మంది స్వామి వారిని దర్శించుకోగా, 20,365 మంది తలనీలాలు సమర్పించారు.

ఐసీఏఆర్-ఐఐఓపీఆర్ నాన్ అఫీషియల్ మెంబర్‌గా క్రాంతికుమార్‌రెడ్డి



సాక్షి, అమరావతి: భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్)కు అనుబంధంగా ఉన్న భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ (ఐఐఓపీఆర్) నాన్‌అఫీషియల్ మెంబర్‌గా ఆయిల్ పామ్ రంగంలో సుదీర్ఘ అనుభవం కల్గిన కే క్రాంతికుమార్‌రెడ్డిని నియమిస్తూ ఐసీఏఆర్ ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లా పెదవేగిలో ఉన్న ఐఐఓపీఆర్ ఆయిల్ పామ్ రంగంలో విస్తృత పరిశోధనలు చేస్తోంది. ఇటీవలే జాతీయ స్థాయిలో మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో నాన్ అఫీషియల్ కేటగిరిలో క్రాంతికుమార్‌రెడ్డికి చోటు కల్పించింది. జాతీయ ఆయిల్ పామ్ రైతుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్న క్రాంతికుమార్‌రెడ్డి ఆ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడుగా ఆర్.ధనుంజయ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్.ధనుంజయ్‌రెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జనవరి 5వ తేదీన ప్రకటించిన పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుల ప్రకటనను సవరించినట్లు పేర్కొంది. ఇకపై పార్టీ ప్రచార విభాగం పూర్తిస్థాయి బాధ్యతలను ధనుంజయ్‌రెడ్డి నిర్వర్తిస్తారని పార్టీ కార్యాలయం తెలిపింది.

ఓబుళాపురం మైనింగ్ కేసు గ్రీన్ బెంచ్‌కు బదిలీ

- సుప్రీం కోర్టు ధర్మాసనం ఉత్తర్వులు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో మైనింగ్ కొనసాగింపుపై ఓబుళాపురం మైనింగ్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు గ్రీన్ బెంచ్‌కు బదిలీ చేసింది. మంగళవారం ఈ వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ రామసుబ్రమణియన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. ఏపీ, కర్ణాటకల మధ్య సరిహద్దులు చెరిగిపోయాయని ఏపీ ప్రభుత్వం మైనింగ్‌ను నిలిపివేసిందని, అయితే, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా నివేదికతో తిరిగి మైనింగ్‌కు అనుమతించిందని తెలిపారు. 13 ఏళ్లుగా మైనింగ్ హక్కులు కోల్పోతున్నామని అన్నారు. వాదనలు విన్న అనంతరం ఈ వ్యాజ్యాన్ని ఈ నెల 18న గ్రీన్ బెంచ్ ముందు విచారణ జాబితాలో చేర్చాలని ధర్మాసనం రిజిస్ట్రీని ఆదేశించింది. ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ హాజరయ్యారు.

రేనాటి చోళులు ఏలారిక్కడ!

- మదనపల్లె మండలం కొత్తరెడ్డివారిపల్లెలో వెలుగుచూసిన పుణ్యకుమార శాసనం
- 7వ శతాబ్దపు కాలం నాటి అక్షరాలుగా అంచనా

మదనపల్లి: అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలోని కొత్తరెడ్డివారిపల్లె వద్ద వ్యవసాయ భూముల్లో రేనాటి చోళుల కాలం నాటి శాసనం వెలుగుచూసింది. ఇది 7వ శతాబ్దానికి చెందిన రేనాటి చోళరాజు పుణ్యకుమారుడి శాసనంగా పరిశోధక విద్యార్థులు తేల్చారు. రాష్ట్రంలో క్రీ.పూ. 3–4 శతాబ్దాల్లోని శాసనాలు ప్రాకృత భాషలోను, 5వ శతాబ్దంలో సంస్కృతంలో ఉండగా.. 6వ శతాబ్దం నుంచి తెలుగులో ఉన్నట్టు చెబుతున్నారు. తెలుగులో మొదటి శాసనం వేసిన ఘనత రేనాటి చోళులకే దక్కిందని చరిత్ర చెబుతోంది. వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు తాలూకాలు, చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, వాయల్పాడు తాలూకాలు ప్రాచీన ఆంధ్రదేశంలో రేనాడు ప్రాంతంగా గుర్తింపు పొందాయి. తెలుగును అధికార భాషగా స్వీకరించిన రేనాటి చోళులు తెలుగులోనే శాసనాలు వేసినట్టు తెలుస్తోంది. నాలుగు తామ్ర శాసనాలు, 50 శిలా శాసనాలు వీరి చరిత్రకు ఆధారాలుగా నిలుస్తున్నాయి.


క్రీ.శ. 9వ శతాబ్దానికి చెందినవిగా పేర్కొంటున్న వైదుంబుల వీరగల్లు


మదనపల్లెకు 3 కిలోమీటర్ల దూరంలో కొత్తరెడ్డిగారిపల్లె వద్ద పొలంలో లభించిన రేనాటిచోళుల శాసనం

బ్రాహ్మణుడికి దానమిచ్చిన భూమి అని..

కొత్తరెడ్డిగారిపల్లెలోని ఒక పొలంలో రాయిపై శాసనం, మరోచోట బండపై చేతిలో కత్తి పట్టుకున్నట్టుగా, వాటి మీద మూడు బొమ్మలు, చుట్టూ కొన్ని శాసన అక్షరాలు, ఇంకొంత దూరంలో మరో బండమీద కత్తి పట్టుకున్న వీరుడు, అందులో రెండు గుర్రాలు, పైన ప్రాచీన తెలుగు లిపిలో కొన్ని అక్షరాలు (వైదుంబుల వీరగల్లులు) కనిపిస్తున్నాయి. వీటిని ఆ కాలంలో వీరగల్లులుగా పేర్కొనే వారని చెబుతున్నారు. రేనాటి చోళుల్లో మూడో తరానికి చెందిన పుణ్యకుమారుడు సూర అనే బ్రాహ్మణుడికి భూమిని దానంగా ఇచ్చినట్టు ఈ శాసనంలో ఉందని వాటిని పరిశీలించేందుకు వచ్చిన పరిశోధక విద్యార్థి చెప్పినట్లు స్థానిక రైతులు తెలిపారు. ఈ శిలాశాసనాలు తమ తండ్రుల కాలం నుంచీ అక్కడే ఉన్నాయని, వీటి గురించి తామెవరూ పట్టించుకోలేదని చెప్పారు.

చిప్పిలి రాజధానిగా..

రేనాటి రాజుల్లో ముఖ్యుడైన పుణ్యకుమారుడు 'చెప్పలియపట్టు' రాజధానిగా పాలించినట్టు తిప్పలూరు శాసనం ద్వారా తెలుస్తోంది. దీనిని అప్పట్లో కొంతమంది మదనపల్లె తాలూకాలోని చిప్పిలి గ్రామంగా గుర్తించినా.. తర్వాత కాలంలో పరిశోధకులు తిప్పలూరు గ్రామ సమీపంలోని కమలాపురం మండలంలోని పెద్ద చెప్పలి గ్రామ పరిసర ప్రాంతాల్లో రేనాటి చోళుల తామ్ర శాసనాలు, శిలాశాసనాలు అనేకం లభించడంతో దానిని రేనాటి చోళుల రాజధానిగా నిర్ణయించారు. అయితే, ప్రస్తుతం మదనపల్లె తాలూకా కొత్తరెడ్డివారిపల్లెలోని పొలంలో వెలుగు చూసిన పుణ్యకుమార శాసనం చిప్పిలి గ్రామానికి సమీపంలోనే ఉంది. ఈ శాసనం పుణ్యకుమారుడిదే కావడం, ఇలాంటివి అక్కడే కాకుండా వేంపల్లె, చిప్పిలి పరిసర ప్రాంతాల్లో గతంలో అనేకం ఉండేవని చెబుతున్నారు. సమ్మర్ స్టోరేజి ట్యాంక్ తవ్వకాల్లోనూ ఒకటి రెండు కనిపించాయని గ్రామస్తులు చెబుతున్నారు.

అవినీతి రాజధాని కోసమే బాబు తాపత్రయం

- 835వ రోజు రిలే దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: నిపుణుల కమిటీ నివేదికలను పక్కనపెట్టి.. అవినీతి రాజధానిని నిర్మించిన చంద్రబాబు.. దానిని కాపాడుకునేందుకే తాపత్రయపడుతున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 835వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. నాడు సీఆర్డీయే పేరుతో ఓ సంస్థను సృష్టించిన బాబు దానికి చైర్మన్‌గా ఉండి రాష్ట్ర ఖజానాను నిలువుదోపిడీ చేశాడన్నారు. బాబు కుటిల యత్నాలను గమనించిన ప్రజలు తరిమికొట్టినా బుద్ధి లేకుండా వ్యవహరించడం సిగ్గుచేటని, బాబు హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ వేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. 29 గ్రామాల్లోని రెండు నియోజకవర్గాల్లో ఘోర పరాజయం పొందిన చంద్రబాబు.. సొంత కుమారుడిని గెలిపించుకోలేక చతికిలపడ్డాడన్నారు. 29 కేసుల్లో స్టేలు తెచ్చుకుని తిరుగుతున్న చంద్రబాబును ప్రజలను నమ్మే పరిస్థితి ఎప్పటికీ ఉండదన్నారు. పవన్ కళ్యాణ్‌తో చేతులు కలిపి ఆశల పల్లకిలో ఊరేగుతున్న బాబుకు భంగపాటు తప్పదని.. వీరిద్దరికీ రాజకీయంగా బడితె పూజ చేసేందుకు బహుజనులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, బేతపూడి సాంబయ్య, పల్లె బాబు, బొలిమేర శామ్యూల్ పాల్గొన్నారు.

'త్వరలో పీఠాధిపతులు, మఠాధిపతులతో విశిష్ట సదస్సు'



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విస్తృతంగా హిందూ ధర్మ ప్రచారం చేపట్టేందుకు త్వరలో పీఠాధిపతులు, మఠాధిపతులతో విశిష్ట సదస్సు నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం సచివాలయంలో ధార్మిక పరిషత్, కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) సమావేశం జరిగింది. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. హిందూ ధర్మ ప్రచారంపై సదస్సులో చర్చించి, రోడ్ మ్యాప్ రూపొందిస్తామని చెప్పారు. రోడ్ మ్యాప్ మేరకు ప్రచార రథాల ద్వారా ధార్మిక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ ఏడాది రూ. 249.26 కోట్ల సీజీఎఫ్ నిధులతో అన్ని నియోజకవర్గాల్లో పురాతన ఆలయాల పునర్నిర్మాణం, కొత్త ఆలయాల నిర్మాణం చేపడతామన్నారు. ధార్మిక పరిషత్ సమావేశంలో 9 ఆలయాలకు ట్రస్టు బోర్డుల ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్టు చెప్పారు.

13 మందితో ఆగమ సలహా మండలి ఏర్పాటు

మొత్తం 13 మందితో ఆగమ సలహా మండలిని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి చెప్పారు. బ్రహ్మర్షి, వైఖానస ఆగమ ప్రవర వేదాంతం సత్య శ్రీనివాస అయ్యంగార్ మండలి చైర్మన్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. సభ్యులుగా.. మహామహోపాధ్యాయ దోర్బల ప్రభాకర్ శర్మ, పి.కృష్ణమాచార్యులు (చాత్తాద శ్రీవైష్ణవ ఆగమం), నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి (వీరశైవ ఆగమం), బొద్దుపల్లి దత్తాత్రేయ శర్మ (శాక్తేయ ఆగమం), ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు (వైఖానస ఆగమం), కళ్లేపల్లి సుబ్రహ్మణ్యం (స్మార్త వైదికాగమం), బుట్టే వీరభద్ర సిద్ధాంతి (వాస్తు, జ్యోతిష్యం), అక్కి రాఘవేంద్రాచార్య (తంత్ర సారం), ఆర్‌వీవీ గోపాలాచార్యులు (పాంచరాత్రం), జేకే సుబ్బారావు (వైదికం), వి.నాగభూషణం (గ్రామదేవత)ను నియమించినట్టు తెలిపారు. అర్చక సంఘాల ప్రతినిధులు, అధికారులు కలిపి 9 మందితో అర్చకులు, ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్టు బోర్డును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ బోర్డుకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా, దేవదాయ, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులు, దేవదాయ శాఖ కమిషనర్, టీటీడీ ఈవో, సీఏవోలు, అర్చక సంఘాల నుంచి ఎ. ఆత్రేయబాబు, పి.శ్రీనివాసులు, వి.శ్రీనివాస్ సభ్యులుగా ఉంటారని తెలిపారు.

సమతుల అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి

- రాయలసీమ, ఉత్తరాంధ్ర సమతుల అభివృద్ధికి కమిషన్ ఏర్పాటు చేయండి
- సీఎస్ జవహర్‌రెడ్డికి ఏఎఫ్ఈసీ డైరెక్టర్ మల్లారెడ్డి విజ్ఞప్తి


కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సీఎస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఎఫ్ఈసీ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి

సాక్షి, అమరావతి: మూడు ప్రాంతాల సమతుల అభివృద్ధితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని యాక్షన్ ఫ్రటెర్నా ఎకాలజీ సెంటర్ (ఏఎఫ్ఈసీ) డైరెక్టర్ డాక్టర్ వై.వి.మల్లారెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.ఎస్.జవహర్‌రెడ్డిని కలిశారు. విభజన చట్టం సెక్షన్–94(2)లో రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని సీఎస్‌కు గుర్తుచేశారు. వ్యవసాయం, నీటి పారుదల, పారిశ్రామికరంగాల్లో అత్యంత వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించడానికి నిపుణులతో సమతుల అభివృద్ధి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ కమిషన్ రూపొందించిన ప్రణాళికను కేంద్రానికి పంపి.. బుందేల్‌ఖండ్ ప్రాంతం అభివృద్ధికి అమలు చేస్తున్న ప్యాకేజీని ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు సాధించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సిరిధాన్యాల సాగుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రశంసించారు. ఈ ఏడాదిని అంతర్జాతీయ సిరిధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందన్నారు. సిరిధాన్యాలకు మద్దతు ధర ప్రకటించడం ద్వారా రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో సిరిధాన్యాల సాగు పెంచేలా రైతులను ప్రోత్సహించాలని కోరారు. ఇదేరీతిలో పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కళ్లలో కారం చల్లి, కర్రలతో దాడి

విజయవాడలో వైఎస్సార్‌సీపీ మహిళా నేతలపై టీడీపీ దాష్టీకం

- వలంటీర్‌పైనా దాడికి యత్నం
- ఆదరణ కోల్పోయి చిల్లర రాజకీయం : దేవినేని అవినాష్


వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలపైకి దూసుకొస్తున్న టీడీపీ మహిళా కార్యకర్తలు


టీడీపీ దాడిలో గాయపడిన సునీత, బచ్చు మాధవి


సునీత తలపై అయిన గాయం

లబ్బీపేట, కృష్ణలంక (విజయవాడ తూర్పు): విజయవాడలో టీడీపీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొనడానికి మంగళవారం తారకరామ నగర్‌లో పలువురు వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు ఎదురు చూస్తున్నారు. అంతలో టీడీపీకి చెందిన షేక్ ఫాతిమా రమీజా మరికొందరు అక్కడికి వచ్చి వారితో దురుసుగా వ్యవహరించారు. మాటలతో రెచ్చగొడుతూ వారిపైకి దూసుకెళ్లారు. వెంట తెచ్చుకున్న కారం వారి కళ్లల్లో చల్లి.. కర్రలతో దాడి చేస్తూ భయానక వాతావరణం సృష్టించారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన బచ్చు మాధవి, సునీత మరికొందరికి గాయాలయ్యాయి. అక్కడే ఉన్న వలంటీర్ శాంతిరెడ్డిపైనా దాడికి యత్నించారు. సౌత్ ఏసీపీ రవికిరణ్, కృష్ణలంక సీఐ దుర్గారావు పోలీసు సిబ్బందితో వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. గాయపడ్డ వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తమ కళ్లల్లో కారం చల్లి, దాడి చేశారని బి.సునీత.. టీడీపీకి చెందిన షేక్ ఫాతిమా, రమీజా, శైలు, మరో 10 మందిపై ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు కృష్ణలంక పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని, వైఎస్సార్‌సీపీ నేతలే తమ వాళ్లపై దాడి చేశారని ఆందోళన చేపట్టారు. బచ్చు మాధవి, రామిరెడ్డి, దామోదర్, మరో 11 మంది తమపై దాడి చేశారంటూ ఫాతిమా, రమీజా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాల ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో తనకు లభిస్తున్న ఆదరణ చూసి ఓటమి భయంతోనే టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దేవినేని అవినాష్ మండిపడ్డారు.

నూర్పిడి యంత్రం బోల్తా..

ఇద్దరు కూలీల మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

బొబ్బిలి రూరల్: విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం అన్నంనాయుడువలసలో ప్రమాదవశాత్తు నూర్పిడి యంత్రం బోల్తా కొట్టడంతో ఇద్దరు కూలీలు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, బొబ్బిలి సీఐఎం. నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతిరోజూ వలే అన్నంనాయుడువలస గ్రామానికి చెందిన గోర్జ తిరుపతమ్మ (50), పోల లక్ష్మమ్మ (48), మడక సత్యవతి, గేదెల శ్రీదేవి అదే గ్రామంలోని చొక్కాపు చంద్రకు చెందిన వరి నూర్పిడి యంత్రంపై కూర్చుని మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో పొలంలోని వరిచేను కుప్పలు నూర్పిడి పనికి బయలుదేరారు. పొలంలో వెళ్తున్న వాహనం ఓ పుట్టను తప్పించే క్రమంలో బోల్తాపడింది. వాహనంపై కూర్చుని ప్రయాణిస్తున్న గోర్జ తిరుపతమ్మ, పోల లక్ష్మమ్మ యంత్రం కింద పడి అక్కడికక్కడే మృతి చెందగా, సత్యవతి శ్రీదేవి గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు.

క్లుప్తంగా...

భారతీయులు పౌరసత్వాన్ని ఎందుకు వదిలేస్తున్నారు?

న్యూఢిల్లీ: 2014 నుంచి భారత పౌరసత్వాన్ని వదిలేసుకుని వెళ్లే వారి సంఖ్య 1.7 రెట్లు పెరగడంపై కాంగ్రెస్ పార్టీ కేంద్రాన్ని నిలదీసింది. 'అచ్చే దిన్'ను వెతుక్కుంటూ భారతీయులు ఎందుకు వెళ్లిపోతున్నారో కారణాలు చెప్పాలని ప్రధాని మోదీని ప్రశ్నించింది. 2022లో రోజుకు 604 మంది చొప్పున మన వాళ్లు పౌరసత్వాన్ని త్యజించినట్లు విదేశాంగ శాఖ తెలిపిన గణాంకాలపై కాంగ్రెస్ ప్రతినిధి గౌరవ్ వల్లభ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2014లో ఈ సంఖ్య 354 మాత్రమేనన్నారు. నిరుద్యోగం, అవకాశాల లేమితోపాటు ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ, నోట్ల రద్దు వంటి వాటి వల్లే దేశం వీడుతున్నారని చెప్పారు. ప్రధాని చెప్పే అమృత కాలం ఇదేనా అని ప్రశ్నించారు. ప్రధాని చెబుతున్న 'అచ్చే దిన్' దేశ పౌరులకు కాకుండా విదేశాల్లో ఉంటున్న భారతీయులకు వచ్చాయన్నారు.

నాసా చీఫ్ టెక్నాలజిస్ట్‌గా భారతీయ అమెరికన్



వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష సంస్థ ప్రతిష్టాత్మక నాసా చీఫ్ టెక్నాలజిస్ట్‌గా భారతీయ అమెరికన్ ఏసీ చరానియా నియమితులయ్యారు. వాషింగ్టన్‌లోని నాసా ప్రధాన కార్యాలయంలో అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్‌కు టెక్నాలజీ పాలసీ, ప్రోగ్రామ్‌ల ప్రధాన సలహాదారుగా చరానియా సేవలందించాల్సి ఉంటుంది. మరో భారతీయ అమెరికన్ సైంటిస్ట్ భవ్యా లాల్ స్థానంలో ఆయన ఈ నెల 3వ తేదీన కొత్త బాధ్యతలు చేపట్టారని నాసా ఒక ప్రకటనలో తెలిపింది. టెక్నాలజీ, పాలసీ, స్ట్రాటజీ సంబంధిత విషయాలపై ప్రధానంగా ఆయన పనిచేస్తారని పేర్కొంది. ఇప్పటివరకు రిలయబుల్ రోబోటిక్స్ సంస్థకు ప్రొడక్ట్ స్ట్రాటజీ వైస్‌ప్రెసిడెంట్‌గా ఉన్నారు. వర్జిన్ ఆర్బిట్‌లోనూ చరానియా పనిచేశారు. నాసాకు చెందిన ఫాస్ట్ ఫార్వర్డ్ ఇండస్ట్రీ గ్రూపునకు చరానియా నేతృత్వం వహించారు. లూనార్ ఎక్స్‌ప్లోరేషన్ అనాలిసిస్ గ్రూప్ కమర్షియల్ అడ్వైజరీ బోర్డు సభ్యుడు కూడా. చరానియా ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీ పొందారు.

విశాఖలో మాజీ గ్యారిసన్ ఇంజనీర్‌పై సీబీఐ కేసు

న్యూఢిల్లీ: టెండర్ వేసిన పనులు పూర్తికాకమునుపే ఆ కాంట్రాక్టర్లకు సొమ్ము చెల్లించారనే ఆరోపణలపై మాజీ గ్యారిసన్ ఇంజనీర్‌పై సీబీఐ కేసు నమోదుచేసింది. ప్రశాంత్ శివహరే గతంలో విశాఖపట్నంలోని నేవీ డాక్‌యార్డ్‌లో గ్యారిసన్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ హోదాలో కొన్ని టెండర్లు పిలిచి వాటికి చెల్లింపులు చేసే అధికారం ఆయనకు ఉంది. ఈ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ 2018 ఆగస్ట్ నుంచి 2019 మార్చి కాలంలో కొందరు కాంట్రాక్టర్లకు రూ.7.84 కోట్లు ముందే చెల్లించి ఖజానాకు నష్టం తెచ్చారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఐపీసీ సెక్షన్ల కింద ఆయనపై, డిపార్ట్‌మెంట్‌లో ఆయన కింది ఉద్యోగులపై, సొమ్ము పొందిన కాంట్రాక్టర్లపై సీబీఐ 3 కేసులు నమోదుచేసిందని సంబంధిత అధికారులు మంగళవారం వెల్లడించారు.

పార్లమెంట్ విశ్వాసం పొందిన ప్రచండ

కఠ్మాండూ: నేపాల్ నూతన ప్రధానమంత్రి పుష్ప కమల్ దహల్ 'ప్రచండ'(68) మంగళవారం పార్లమెంట్ విశ్వాస తీర్మానం నెగ్గారు. ఎన్నికల ముందు నేపాలీ కాంగ్రెస్‌తో పెట్టుకున్న పొత్తును వదిలేసి, అనూహ్యంగా ప్రతిపక్ష నేత కేపీ ఓలీతో చేతులు కలిపిన ప్రచండ మూడోసారి నేపాల్ ప్రధానిగా డిసెంబర్ 26న బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రతినిధుల సభలోని 275 మందికి గాను 138 మంది ఓట్లు అవసరం కాగా, ప్రచండకు రికార్డు స్థాయిలో 268 మంది అనుకూలంగా ఓటేశారు. ప్రచండ సభ విశ్వాసం పొందినట్లు సభాధ్యక్షుడిగా వ్యవహరించిన సీనియర్ నేత పశుపతి షంషేర్ రాణా ప్రకటించారు.

స్వర్ణ దేవాలయంలో రాహుల్ ప్రార్థనలు



చండీగఢ్/అమృత్‌సర్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం మధ్యాహ్నం అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంలో ప్రార్థనలు చేశారు. హరియాణాలోని అంబాలాలో మంగళవారం ఉదయం యాత్ర ముగించుకుని ఆయన విమానంలో అమృత్‌సర్‌కు చేరుకున్నారు. సిక్కుల తలపాగా ధరించి స్వర్ణదేవాలయంలో ప్రార్థనలు చేశారు. రాహుల్ వెంట పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్ తదితరులు ఉన్నారు. బుధవారం ఉదయం నుంచి పంజాబ్‌లో జోడో యాత్ర ఫతేఘర్‌లోని సిర్‌హింద్ నుంచి ప్రారంభవుతుందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చెప్పారు. భిన్నత్వాన్ని ఆసరాగా తీసుకుని మన సమాజాన్ని విభజించేందుకు యత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భాష, ప్రాంతం, కులం, మతం పేరుతో దేశంలో విద్వేషాన్ని వ్యాపింపజేస్తున్నారంటూ పరోక్షంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించారు. మన భిన్నత్వాన్ని పరిరక్షించే ప్రాథమిక బాధ్యత కాంగ్రెస్ పార్టీపై పడిందన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం సమాజాన్ని విభజించే శక్తులతో పోరాటం సాగిస్తామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో తమ యాత్ర ఉద్యమంలా సాగుతోందని చెప్పారు.

పాకిస్తాన్‌లో ఆహార సంక్షోభం

- రాయితీ గోధుమ పిండి కోసం జనం పడిగాపులు
- మార్కెట్లలో తొక్కిసలాటలు
- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- ఏడాదిలోనే 501 శాతం పెరిగిన ఉల్లి ధర



ఇస్లామాబాద్‌లో సబ్సిడీ గోధుమ పిండి కోసం బారులు తీరిన ప్రజలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఆర్థిక సంక్షోభం మరింత ముదురుతోంది. ఆహార సంక్షోభం సైతం మొదలయ్యింది. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రధానంగా గోధుమ పిండి కొరత వేధిస్తోంది. రాయితీపై ప్రభుత్వం అందించే గోధుమ పిండి కోసం జనం ఎగబడుతున్నారు. ఖైబర్ పఖ్తూంఖ్వా, సింధ్, బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న తొక్కిసలాట, తోపులాట దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పిండి కోసం తరలివచ్చిన జనంతో మార్కెట్లు నిండిపోయాయి. మార్కెట్లలో రాయితీ గోధుమ పిండి కోసం జనం గంటల తరబడి వరుసల్లో నిలబడాల్సి వస్తోంది. నిత్యం వేలాది మంది వస్తున్నారని స్థానిక మీడియా వెల్లడించింది.

కిలో గోధుమ పిండి రూ.160

పాకిస్తాన్ ప్రధాన ఆహారమైన గోధుమలు, గోధుమ పిండి ధర విపరీతంగా పెరిగిపోయింది. కరాచీలో కిలో పిండి ధర రూ.160కు చేరింది. ఇస్లామాబాద్, పెషావర్‌లో 10 కిలోల గోధుమ పిండి బ్యాగ్‌ను రూ.1,500కు విక్రయిస్తున్నారు. 15 కిలోల బ్యాగ్ ధర రూ.2,050 పలుకుతోంది. గత రెండు వారాల వ్యవధిలోనే ధర రూ.300 పెరిగింది. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దిగజారడం ఖాయమన్న సంకేతాలను బలూచిస్తాన్ ఆహార మంత్రి జమారక్ అచాక్‌జాయ్ ఇచ్చారు. గోధుమ నిల్వలు పూర్తిగా ఖాళీ అయ్యాయని చెప్పారు. ఆహార శాఖ, పిండి మిల్లుల నడుమ సమన్వయ లోపమే కొరతకు కారణమని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు.

కరిగిపోతున్న విదేశీ మారక నిల్వలు

పాకిస్తాన్‌ను ద్రవ్యోల్బణం హడలెత్తిస్తోంది. గత ఏడాది సంభవించిన భీకర వరదల వల్ల కష్టాలు మరింత పెరిగాయి. కేవలం గోధుమలే కాదు ఉల్లిపాయలు, తృణధాన్యాలు, బియ్యం ధరలు సైతం పైకి ఎగబాకుతున్నాయి. కిలో ఉల్లిపాయల ధర 2022 జనవరి 6న రూ.36.7 కాగా, 2023 జనవరి 5 నాటికి ఏకంగా రూ.220.4కు చేరింది. అంటే ఏడాది వ్యవధిలోనే 501 శాతం పెరిగింది. అలాగే డీజిల్ ధర 61 శాతం, పెట్రోల్ ధర 48 శాతం పెరిగింది. బియ్యం, తృణధాన్యాలు, గోధుమల ధర 50 శాతం ఎగబాకింది. 2021 డిసెంబర్‌లో పాక్ ద్రవ్యోల్బణం 12.3 శాతం కాగా, 2022 డిసెంబర్‌లో 24.5 శాతం నమోదయ్యింది. ఆహార ద్రవ్యోల్బణం ఒక ఏడాదిలోనే 11.7 శాతం నుంచి 32.7 శాతానికి చేరింది. పాకిస్తాన్‌లో విదేశీ మారక నిల్వలు వేగంగా అడుగంటుతున్నాయి. 2021 డిసెంబర్‌లో 23.9 బిలియన్ డాలర్లు ఉండగా, 2022 డిసెంబర్‌లో కేవలం 11.4 బిలియన్ డాలర్లు ఉన్నాయి.

రష్యా గోధుమల దిగుమతి

రష్యా నుంచి గోధుమలు పాకిస్తాన్‌కు చేరుకోవడం కొంత ఊరట కలిగిస్తోంది. రెండు ఓడల్లో వేలాది టన్నుల గోధుమలు తాజాగా కరాచీ రేవుకు చేరుకున్నాయి. అదనంగా 4,50,000 టన్నులు రష్యా నుంచి గ్వాదర్ పోర్టు ద్వారా త్వరలో రానున్నాయని పాక్ అధికారులు వెల్లడించారు. గోధుమల కొరతను అధిగమించడానికి వివిధ దేశాల నుంచి 75 లక్షల టన్నులు దిగుమతి చేసుకోవాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం సరుకు ఈ ఏడాది మార్చి 30 నాటికి పాకిస్తాన్‌కు చేరుకుంటుందని అంచనా.



కొడుకు, కూతురుతో తేజస్విని, ఆమె భర్త(ఫైల్)

మెట్రో పిల్లర్ కూలి.. తల్లి, కొడుకు మృత్యువాత

సాక్షి బెంగళూరు: బెంగళూరులో నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్ కూలిన దుర్ఘటనలో తల్లి(30), ఆమె రెండున్నరేళ్ల కొడుకు ప్రాణాలు కోల్పోయారు. ఔటర్ రింగ్ రోడ్‌లోని హెచ్‌బీఆర్ లే అవుట్ సమీపంలో మంగళవారం ఉదయం ఈ విషాదం జరిగింది. హెణ్ణూరులోని డీఎక్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న లోహిత్, తేజస్విని దంపతులకు కవలలు. తేజస్విని ఐటీ కంపెనీలో పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం భార్యను ఆఫీసులో, ఇద్దరు పిల్లలను బేబీ కేర్ సెంటర్ వద్ద దిగబెట్టేందుకు లోహిత్ బైక్‌పై బయలుదేరారు. మెట్రోకు సంబంధించిన పిల్లర్ ఫ్రేమ్‌ను కార్మికులు నిలబెడుతుండగా అది పక్కకు ఒరిగి లోహిత్ కుటుంబంపై పడిపోయింది. ఘటనలో తీవ్ర గాయాలతో తేజస్విని, కుమారుడు విహాన్ చనిపోయారు. లోహిత్, కూతురు చికిత్స పొందుతున్నారు. బెంగళూరు మెట్రో బాధిత కుటుంబానికి రూ.20 లక్షల పరిహారాన్ని ప్రకటించింది.



చారిత్రక ఎర్రకోట వద్ద మంగళవారం దృశ్య, శ్రవణ ప్రదర్శనలో కళాకారులు. ఈ ప్రదర్శనను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు.

జోషీమఠ్‌లో ఇళ్లు, హోటళ్ల కూల్చివేత!

ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



జోషీమఠ్: ఉత్తరాఖండ్ రాష్ట్రం జోషీమఠ్‌లో ప్రమాదకరంగా మారిన ఇళ్లు, హోటళ్లను కూల్చివేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా మలారీ ఇన్, మౌంట్ వ్యూ హోటళ్లను నేలమట్టం చేయడానికి రంగం సిద్ధమయ్యింది. పటిష్టంగా లేని నిర్మాణాలను కూల్చివేయాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డేంజర్ జోన్‌లో ఉన్న గృహాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రజలను ఖాళీ చేయించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటిదాకా 131 కుటుంబాలను తాత్కాలిక సహాయక శిబిరాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. జోషీమఠ్‌లో దెబ్బతిన్న ఇళ్ల సంఖ్య 723కు చేరుకున్నట్లు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ మంగళవారం ఒక బులెటిన్‌లో ప్రకటించింది.

అత్యవసర విచారణ చేపట్టలేం

ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పరిస్థితిని సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవడానికి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సంస్థలు ఉన్నాయని తేల్చిచెప్పింది. అన్ని ముఖ్యమైన వ్యవహారాలను తమ ముందుకు తీసుకురావాల్సిన అవసరం లేదని సూచించింది. కాగా, జోషీమఠ్ సంఘటనపై కేంద్ర బృందం రంగంలోకి దిగింది. కేంద్ర హోంశాఖ అధికారులు, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీతో సమావేశమయ్యారు. తాజా పరిస్థితిని సమీక్షించారు. కుంగుతున్న ప్రాంతాల్లో భూగర్భంలో నీటి ప్రవాహాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సహాయ పునరావాసం కోసం ఎంపిక చేయాల్సిన ప్రాంతాల్లో జియోలాజికల్ సర్వే చేపడతామన్నారు. సైంటిస్టుల సాయం తీసుకుంటామని తెలిపారు.

యూపీ బోరు బావి ఘటన సుఖాంతం

హాపూర్: ఉత్తరప్రదేశ్‌లో బోరుబావిలో పడిన బాలుడిని జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) సభ్యులు ఐదుగంటల పాటు శ్రమించి, సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. హాపూర్ జిల్లా కట్లా ఏరియాకు చెందిన మవియా అనే నాలుగేళ్ల బాలుడు ఆడుకుంటూ వెళ్లి మూత లేని బోరు బావి గుంతలో పడ్డాడు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం రక్షణ సహాయక చర్యలు చేపట్టింది. ఆక్సిజన్‌ను పంపించి, బాలుడికి శ్వాసను అందించారు. బధిరుడైన చిన్నారి ఏ ప్రాంతంలో ఇరుక్కుపోయి ఉన్నదీ తెలుసుకునేందుకు అత్యాధునిక సాంకేతికతను వాడారు. మొత్తం 47 మంది ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యులు విడతలు వారీగా ఎంతో సహనంతో ఈ క్రతువును కొనసాగించారు. ఐదు గంటలపాటు శ్రమించి, కొద్దిపాటి గాయాలతో బాలుడిని బయటకు తీసుకువచ్చారు. అప్పటి వరకు ఎంతో ఉత్కంఠతో సహాయక చర్యలను గమనించిన గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృంద సభ్యులను ప్రశంసలతో ముంచెత్తారు.

దేశ రాజధానికి మరో అప్రతిష్ట

అత్యంత కాలుష్యమయ నగరంగా రికార్డ్

న్యూఢిల్లీ: కాలుష్యకాసారంగా మారిన ఢిల్లీ పరువు మరోసారి పోయింది. గతంలోనూ కాలుష్యమయ నగరంగా పేరుమోసిన ఢిల్లీ తాజాగా 2022 ఏడాదికి దేశంలోనే అత్యంత కాలుష్యమయ నగరంగా రికార్డులకెక్కింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఈ గణాంకాలతో ఒక నివేదిక విడుదలచేసింది. దీని ప్రకారం ఢిల్లీలో 2.5 స్థాయి(పీఎం) సూక్ష్మ ధూళి కణాలు నాణ్యత పరిమితికి మించి రెట్టింపు స్థాయిలో ఉన్నాయి. 10 గాఢత విభాగంలో దేశంలో ఢిల్లీ మూడో స్థానంలో నిలిచిందని గణాంకాలు వెల్లడించాయి. అయితే, నాలుగేళ్ల క్రితంతో పోలిస్తే కాలుష్యం 7 శాతంపైగా తగ్గడం కాస్త ఊరట కలిగించే విషయం అని ఈ గణాంకాలను ఎన్‌సీఏపీ ట్రాకర్ విశ్లేషించింది. 2.5 స్థాయి సూక్ష్మధూళి కణాల విభాగంలో ఢిల్లీ తొలి స్థానంలో నిలవగా, హరియాణాలోని ఫరీదాబాద్ రెండో ర్యాంక్‌లో, ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ మూడో ర్యాంక్‌లో నిలిచిందని గణాంకాలు పేర్కొన్నాయి. 10 పీఎం విభాగంలో దేశంలో ఘజియాబాద్ తొలిస్థానంలో నిలిచింది. తర్వాత ఫరీదాబాద్, ఢిల్లీ ఉన్నాయి. కనీసం 20–30 శాతం కాలుష్యం తగ్గాలన్న జాతీయ స్వచ్ఛ వాయు పథకం(ఎన్‌సీఏపీ) లక్ష్యాలకు ఈ గణాంకాలు సుదూరంగా ఉండటం విషాదకరం. ఈ పథకం లక్ష్యాలను సాధించడంలో దేశ పురోగతిని గణిస్తూ 'ఎన్‌సీఏపీ ట్రాకర్' ఈ లెక్కలను విడుదలచేసింది. 131 నగరాల్లో కాలుష్యాన్ని 30 శాతం మేర తగ్గించాలన్న కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్దేశించుకుంది. అయితే 2026కల్లా కాలుష్యం 40 శాతం తగ్గించుకోవాలని 2022 సెప్టెంబర్‌లో కొత్తగా లక్షించింది. 2.5 స్థాయి కణాలు అత్యంత సూక్ష్మంగా ఉండి నేరుగా ఊపిరితిత్తుల్లో అక్కడి నుంచి రక్తంలో కలిసిపోగలవు. 'నగరాల్లో కఠిన నిబంధనలను ఖచ్చితంగా అమలుచేయలేకపోతే లక్ష్యాలను సాధించడం చాలా కష్టం' అని క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ డైరెక్టర్ ఆర్తీ ఖోస్లా విచారం వ్యక్తంచేశారు.

ఎమ్మెల్యే గారూ.. పెళ్లికి అమ్మాయిని వెతకండి

- శాసనసభ్యుడిని కోరిన నియోజకవర్గ శివసేన కార్యకర్త
- మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆడియో క్లిప్

ఔరంగాబాద్: దాదాపు పది ఎకరాల భూమి ఉన్నా పిల్లను ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదని తెగ వాపోయాడు ఓ పెళ్లికాని ప్రసాద్. తెలిసిన వారందరినీ వధువు కోసం ఆరాతీసి విసిగిపోయిన ఆ అవివాహితుడు చివరకు ఏకంగా తమ నియోజకవర్గం ఎమ్మెల్యేకే ఫోన్ చేసి బాధపడిపోయాడు. మీరయినా పెళ్లికి సరిజోడీని వెతికిపెట్టండి సారూ అంటూ ఫోన్‌లోనే విన్నపాలు వినిపించాడు. అతని బాధను అర్థంచేసుకున్న ఆ ఎమ్మెల్యే పెళ్లిళ్ల పేరయ్యగా మారేందుకూ సిద్ధమయ్యాడు. వెంటనే బయోడేటా పంపించు.. పెళ్లికి అమ్మాయిని వెతికిపెట్టే పూచీ నాదీ అంటూ హామీ ఇచ్చాడు. ఎమ్మెల్యే, నియోజకవర్గ ఓటరుకు మధ్య జరిగిన ఈ ఆసక్తికర సంభాషణ తాలూకు ఆడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో యమా చక్కర్లు కొట్టేస్తోంది. మహారాష్ట్రలోని కన్నాడ్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉదయ్‌సింగ్ రాజ్‌పుత్‌కు అక్కడి ఖుల్తాబాద్ వాస్తవ్యుడికి మధ్య ఈ సంభాషణ జరిగింది. ఉదయ్‌సింగ్.. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన చీలికవర్గానికి మద్దతు ఇస్తున్నారు. పెళ్లికాని ఓటరు ఫోన్‌కాల్‌పై మీడియా ప్రశ్నించగా ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. 'గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాస్తవిక సమస్య ఇది. ఓ 2,000 మంది జనాభా ఉన్న గ్రామాన్ని తీసుకుంటే అందులో ఖచ్చితంగా 150 మంది యుక్తవయసు అబ్బాయిలు పెళ్లిళ్లుకాక ఇబ్బందులు పడుతున్నారు. 100 ఎకరాల భూస్వామి అయినా సరే వధువు కోసం తిప్పలు పడాల్సిందే. పట్టణప్రాంతాల్లో స్థిరపడిన అబ్బాయిలవైపు అమ్మాయిల తల్లిదండ్రులు మొగ్గుచూపడమే ఇక్కడ అసలు సమస్య. పెళ్లి కావట్లేదు బాబోయ్ అంటూ నాకు ఇలాగే చాలా మంది ఫోన్లు చేశారు' అని ఎమ్మెల్యే చెప్పారు.

ప్రపంచంలోనే సుదూర నదీ పర్యాటకం

- జనవరి 13న వారణాసిలో 'గంగా విలాస్'ను ప్రారంభించనున్న ప్రధాని
- గంగా, బ్రహ్మపుత్రసహా 27 నదులగుండా 52 రోజుల పాటు ప్రయాణించనున్న విలాసనౌక
- వివరాలు వెల్లడించిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: నదీజలాల్లో పర్యాటకులు సుదూరాలకు విలాసవంత ప్రయాణం సాగించేలా రివర్ క్రూయిజ్ (షిప్) పర్యాటకానికి భారతీయ నదులు సిద్ధమయ్యాయి. 52 రోజులపాటు గంగావిలాస్ పేరుతో కొనసాగే ఈ పర్యాటక నౌక సేవలను ప్రధాని మోదీ ప్రారంభించనున్నాను. గంగా నది, బ్రహ్మపుత్ర నదుల మీదుగా కొనసాగే ఈ ప్రయాణం జనవరి 13న వారణాసిలో ప్రారంభం అవుతుంది. దాదాపు 3,200 కిలోమీటర్ల పాటు 5 రాష్ట్రాల్లో మొత్తం 27 నదుల్లో ప్రయాణించి బంగ్లాదేశ్ మీదుగా మార్చి ఒకటిన అస్సాంలోని దిబ్రూగఢ్‌కు గంగా విలాస్ చేరుకుంటుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రపంచంలో ఇంతవరకు ఇలా రెండు పొడవైన నదులపై క్రూయిజ్ (షిప్)లో పర్యటన సందర్భాలు లేవని తెలిపారు. అందుకే తొలిసారిగా అత్యంత ఎక్కువ దూరాలకు గంగ, బ్రహ్మపుత్ర నదులపై కొనసాగే ఈ యాత్రపై ఆసక్తి నెలకొందని వివరించారు. 'గంగా విలాస్ రివర్ క్రూయిజ్ ప్రాజెక్టు ద్వారా భారత్, బంగ్లాదేశ్ మధ్య సాంస్కృతిక బంధాన్ని ప్రపంచానికి చాటిచెప్తాం. భారతీయ పర్యాటకరంగ రూపురేఖలు మార్చడంలో ఈ ప్రాజెక్ట్ కీలక భూమిక పోషించనుంది' అని ఉద్ఘాటించారు.

కాలిఫోర్నియాలో వరద బీభత్సం

వెంటాడుతున్న బురద ముప్పు

కాలిఫోర్నియా: అగ్రరాజ్యం అమెరికాను భీకర వరదలు ముంచెత్తాయి. కాలిఫోర్నియా, లాస్ ఏంజెలిస్‌లో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కాలిఫోర్నియా జనాభాలో ఏకంగా 90 శాతం మంది ప్రజలు వరద ముప్పును ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. భారీ వర్షాల వల్ల వరదలు ముంచెత్తుతున్నాయి. పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో కాలిఫోర్నియా రాష్ట్రంలో దాదాపు 25 వేల మందిని ప్రభుత్వ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం. హాలీవుడ్ సినీ ప్రముఖులు నివసించే మాంటెసిటో నగరంలో పరిస్థితి మరింత దారుణంగా మారిందని అధికారులు వెల్లడించారు. బురద ముప్పు పొంచి ఉందని, ప్రజలు ఈ నగరాన్ని వెంటనే వీడాలని అత్యవసర హెచ్చరిక జారీ చేశారు. కాలిఫోర్నియా రాష్ట్రంలో 17 ప్రాంతాల్లో భీకర వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కాలిఫోర్నియాలో పలు ప్రాంతాలు ఇప్పటికే జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో బురద ప్రవాహం పెరిగింది.

త్వరలో భారత్‌కు ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్ నేతలు

న్యూఢిల్లీ: వచ్చే రెండు, మూడు నెలల్లో ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా సహా పలు దేశాల అధినేతలు భారత్‌కు విచ్చేయనున్నారు. ప్రపంచదేశాలపై ఉక్రెయిన్ యుద్ధం, ఆహార, ఇంధన భద్రతలపై పడిన తీవ్ర ప్రభావంపై చర్చలే లక్ష్యంగా వీరి పర్యటనలు సాగనున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ వచ్చే నెలలో భారత్‌కు రానున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మార్చిలో వస్తారని భావిస్తున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మేక్రాన్ కూడా మార్చి మొదటి వారంలోనే పర్యటించే అవకాశాలున్నాయి.

అరాచకంపై దర్యాప్తు ముమ్మరం

రియో డీ జనీరియో: బ్రెజిల్ నూతన అధ్యక్షుడు లూయిజ్ డ సిల్వాను గద్దె దింపాలన్న ప్రధాన డిమాండ్‌తో దేశ రాజధానిలో అధికార కేంద్రాలపై విధ్వంసకాండకు దిగిన మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో మద్దతుదారులపై కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. సోమవారం నాటి ఘటనలో ఇప్పటికే 1,500 మందికిపైగా నిరసనకారులను అరెస్ట్‌చేసిన పోలీసులు ఇంతటి మెరుపుదాడి వెనుక సూత్రధారులు ఎవరెవరు ఉన్నారనే దానిపై కూపీ లాగుతోంది. రాజధాని ప్రాంత భద్రత బాధ్యతలు చూసే ప్రాంతీయ గవర్నర్‌ను ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ సుప్రీంకోర్టు ఆయనను తాత్కాలికంగా విధుల నుంచి తప్పించింది. ఓవైపు తన మద్దతుదారులు దేశంలో వీరంగం సృష్టిస్తే వారి నాయకుడు బోల్సొనారో అనారోగ్యంతో అమెరికాలోని ఓర్లాండో సిటీలోని ఓ ఆస్పత్రిలో చేరినట్లు వార్తలొచ్చాయి.

తమిళనాట గవర్నర్‌ను వ్యతిరేకిస్తూ పోస్టర్లు

అందుకు ప్రతిగా ఆయన్ను కీర్తిస్తూ బీజేపీ పోస్టర్లు



సాక్షి, చెన్నై: తమిళనాడు డీఎంకే సర్కార్‌కు, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య భేదాభిప్రాయాలు తమిళనాట గోడలపైకి ఎక్కాయి. సోమవారం రాష్ట్ర శాసనసభలో స్టాలిన్ సర్కార్ అందించిన ప్రసంగ పాఠాన్ని ఉన్నది ఉన్నట్లుగా చదవకుండా కొన్ని పదాలు, వాక్యాలు వదిలేసి, సొంతంగా కొన్ని చేర్చి ప్రసంగించిన గవర్నర్‌పై అధికార డీఎంకే గుర్రుగా ఉంది. దీంతో ఆయనను 'రాష్ట్రం నుంచి వెళ్లిపోండి (#GetoutRavi)' అంటూ మంగళవారం చెన్నై, పలు ప్రాంతాల్లో పోస్టర్లు వెలిశాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని గవర్నర్ అసెంబ్లీలో చదవడం సాంప్రదాయం. అందుకు భిన్నంగా వ్యవహరించిన గవర్నర్‌పై వ్యతిరేక తీర్మానాలను సీఎం స్టాలిన్ ప్రతిపాదిస్తుండగా మధ్యలోనే గవర్నర్ హఠాత్తుగా వెళ్లిపోవడం తెల్సిందే. సభ నుంచి వెళ్లిన గవర్నర్ అలాగే రాష్ట్రాన్ని వదిలేయాలంటూ పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. డీఎంకే శ్రేణుల చర్యతో ఆగ్రహించిన రాష్ట్ర బీజేపీ విభాగం నేతలు వెంటనే గవర్నర్‌కు మద్దతుగా నిలిచారు. ఆయనను కీర్తిస్తూ పుదుకొట్టాయ్ జిల్లాలో పోస్టర్లు అంటించారు. సభలో గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు, రభస సృష్టించిన డీఎంకే ఎమ్మెల్యేలపై పోలీసులకు ఫిర్యాదుచేశామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఏ అశ్వత్థామన్ ట్వీట్‌చేశారు. కాగా, తమిళనాట పొంగల్ సంబరాల సందర్భంగా గవర్నర్ కార్యాలయం రాజ్‌భవన్ వెలువరించిన ఆహ్వాన ప్రతిలో రాష్ట్ర అధికార చిహ్నం లేదు. కేవలం జాతీయ చిహ్నం ముద్రించారు. తమిళనాడు అని ఉండాల్సిన చోట తమిళగ అని ఉంది. తమిళనాడు పేరును తమిళగ అని మార్చాలని గవర్నర్ గతంలోనే వ్యాఖ్యానించడం వివాదమైంది.

న్యాయ నిపుణులతో గవర్నర్ భేటీ

అసెంబ్లీలో తన ప్రసంగంలోని కొన్ని అంశాలను తొలగిస్తున్నట్లు తమిళనాడు సీఎం తీసుకొచ్చిన తీర్మానానికి చెక్ పెట్టేందుకు గవర్నర్ పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఈ అంశంపై మంగళవారం ఆయన న్యాయ నిపుణులతో చర్చించినట్లు సమాచారం. మంగళవారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సివిల్ సర్వీసు ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కేంద్రం చెప్పినట్లే వినాలని గవర్నర్ సూచించడం చర్చనీయాంశమైంది.

అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములుగా మారండి

ప్రవాస భారతీయులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపు

ఇండోర్: ప్రవాస భారతీయులు అంతర్జాతీయ స్థాయిలో అత్యంత కీలకమైన, విశిష్టమైన శక్తిగా ఎదిగారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రశంసించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 17వ ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమంలో మంగళవారం ఆమె ప్రసంగించారు. పట్టుదల, నిరంతర శ్రమతో ప్రవాసీలు విభిన్న రంగాల్లో అత్యున్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే 25 ఏళ్లలో స్వయం సమృద్ధ దేశంగా ప్రగతి సాధించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుందని, ఈ ప్రయాణంలో ప్రవాస భారతీయులంతా పూర్తిస్థాయిలో భాగస్వాములు కావాలని ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. మీ శక్తి, అనుభవం, ఆలోచనలు, వ్యాపార వ్యూహాలు, పెట్టుబడులు, సాంకేతిక నిపుణత, విజ్ఞానాన్ని మాతృదేశ అభివృద్ధి కోసం వెచ్చించాలని సూచించారు.

క్లుప్తంగా...

పౌరసరఫరాల శాఖ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ప్రారంభం

అన్ని సమస్యలపై ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్ 1967



ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్

సాక్షి, అమరావతి: పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, ఏపీఎస్డీఆర్సీ అధ్యక్షుడు జస్టిస్ సునిల్‌చౌదరి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ, ధాన్యం కొనుగోళ్లు, తూనికలు–కొలతలు, వినియోగదారుల భద్రతపై ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఈ కాల్ సెంటర్‌లో 10మంది ప్రత్యేక శిక్షణ పొందిన ఎగ్జిక్యూటివ్‌లు విధులు నిర్వర్తించనున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎగ్జిక్యూటివ్‌లు విశ్లేషించి పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు ఆయా విభాగాలకు పంపించనున్నారు. ప్రతి ఫిర్యాదు పరిష్కారానికి కాలపరిమితితో పని చేయనున్నారు. తరచుగా కాల్ సెంటర్‌కు వచ్చే ప్రజాసమస్యలను వర్గీకరించి అవి మరోచోట ఉత్పన్నం కాకుండా నిర్దిష్ట ఎస్‌వోపీలు సిద్ధం చేయనున్నారు.

కందుకూరు, గుంటూరు దుర్ఘటనల వల్లే...

- జీవో–1ను ప్రతి ఒక్కరూ చదవాలి
- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రచార యావకు 11 మంది అమాయకులు బలైపోయారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు బహిరంగ సభలకు విపరీతంగా జనం వస్తున్నారని చూపించుకోవడానికి ఇరుకు సందుల్లో సభ పెట్టి అమాయకులను పొట్టనపెట్టుకున్నారని ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మనోహర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరుకు సందులు, రోడ్లపై సభల వల్ల సంభవించే మరణాలను అరికట్టడానికి ప్రభుత్వం జీవో నంబర్ 1 తెచ్చిందన్నారు. ముందుగా అనుమతులు తీసుకుని ఎవరికీ ఇబ్బంది లేని చోట సభలు నిర్వహించుకోవాలని జీవోలో నిర్దేశించిందని గుర్తు చేశారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కనీసం జీవోను చదవకుండా రాద్ధాంతం చేస్తున్నాయని దుయ్యబట్టారు. లేని నిషేధాన్ని ఉన్నట్టు చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. పైగా అధికార పార్టీ జీవోను ఉల్లంఘించి ర్యాలీలు నిర్వహించిందని పచ్చ పత్రికల్లో నిత్యం తప్పుడు రాతలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలు, ర్యాలీలపై నిషేధం లేదనే విషయాన్ని పట్టించుకోకుండా ప్రజలను తప్పుదారి పట్టించడం సరికాదని హితవు పలికారు. జీవోను ప్రతి ఒక్కరూ చదవాలని కోరారు. పంచాయతీ, మున్సిపల్ రోడ్లు కొన్ని చోట్ల ఇరుకుగా ఉంటాయి కాబట్టి అలాంటి చోట్ల మాత్రమే సభలు వద్దని జీవోలో ఉందన్నారు. జీవోను వక్రీకరిస్తూ మాట్లాడే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల దుష్ప్రచారాన్ని తిప్పికొడతామన్నారు. ప్రజలు చనిపోయినా ఫర్వాలేదు.. అధికారంలోకి రావాలనే యావ బాబుదని నిప్పులు చెరిగారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పాదయాత్ర సందర్భంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం, డీజీపీ అనేక ఆంక్షలను విధించారని గుర్తు చేశారు.

ప్రభుత్వ నిర్ణయం సరైనదే

- చంద్రబాబు అనాలోచిత నిర్ణయంతో 11 మంది బలి
- ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య షారోన్‌రాజు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 1 సరైనదేనని ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగాధిపతి ఆచార్య షారోన్‌రాజు తెలిపారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఎదురవుతున్నప్పుడు వారిని కాపాడటానికి ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను అమలు చేయడం సర్వసాధారణమని చెప్పారు. ఆయన మంగళవారం విశాఖపట్నంలో 'సాక్షి'తో మాట్లాడారు. ప్రజల ప్రాణాలను రక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 1 తెచ్చిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అనాలోచిత నిర్ణయం, ప్రచార ఆర్భాటంతో 11 మంది బలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. బాబుకు ఇది కొత్తేమీ కాదనీ.. గతంలో తాను సీఎంగా ఉన్నప్పుడు పుష్కరాల్లో 29 మంది అమాయకుల ప్రాణాలను హరించారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఆరిపోతున్న టీడీపీ దీపాన్ని కాపాడుకునేందుకు ఇదే విధమైన వ్యూహాన్ని అనుసరిస్తున్నారని మండిపడ్డారు. ఒక ఘటన జరిగి ప్రాణనష్టం సంభవిస్తే ప్రభుత్వం వెంటనే స్పందించి.. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రోడ్లపై రోడ్‌షోలు, సభలను నిషేధించడంలో తప్పేమీ లేదని చెప్పారు. జీవోపై ప్రతిపక్షాలు, కొన్ని పచ్చ పత్రికల విమర్శలను ఆయన ఖండించారు. మేధావులు, ప్రజాస్వామ్యవాదులు సైతం దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

ఎర్ర చందనమే వారికి వరకట్నం



చైనాలో కిలో ఎర్ర చందనం రూ.25 వేలు

- మలేషియా, జపాన్, సింగపూర్, కాంబోడియా, థాయిలాండ్ దేశాల్లోనూ డిమాండ్
- ఎర్ర చందనం, శ్రీగంధం వేర్వేరు జాతులు

భాకరాపేట (తిరుపతి జిల్లా): చైనాలోని కుటుంబ వ్యవస్థల్లో ఎర్ర చందనానికి ఉండే విలువ అంతా ఇంతా కాదు. ఎర్ర చందనంతో చేసిన వస్తువులను వరకట్నంగా ఇవ్వడాన్ని అక్కడి వారు చాలా గొప్పగా, గర్వంగా ఫీలవుతుంటారు. ఎర్ర చందనాన్ని గౌరవాన్ని పెంచే చిహ్నంగా భావిస్తారు. ఎర్ర చందనంతో చేసిన పూసలను బౌద్ధ భిక్షువులు మెడలో ధరిస్తారు. అక్కడ ఒక కేజీ ఎర్ర చందనం దుంగ నుంచి కీ చైన్లు, పూసలు తయారుచేసి అమ్మితే సుమారు రూ.25 వేలు వస్తుంది. టన్ను ఎర్ర చందనం ధర అక్కడ రూ.2.50 కోట్లు పలుకుతోంది కాబట్టే విదేశాలకు అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా సాగిపోతోంది.

అదృష్టం తెస్తుందని..

ఎర్ర చందనాన్ని చైనా, మలేషియా, జపాన్, సింగపూర్, కాంబోడియా, థాయిలాండ్ దేశాలకు ఎక్కువగా తరలిస్తారు. బౌద్ధులు దీనిని చాలా పవిత్రమైనదిగా భావిస్తారు. ఇంట్లో ఎర్ర చందనం ముక్క ఉంటే.. అదృష్టాన్ని తీసుకొస్తుందని నమ్ముతారు. బొమ్మలు, ఇంటి వస్తువులు, సంగీత వాయిద్యాలు, దేవుడి బొమ్మలు, బుద్ధుడి బొమ్మలు, గడియారాలు, టీ కప్పులు తదితర వస్తువుల తయారీకి దీనిని ఉపయోగిస్తున్నారు. ముఖ సౌందర్యం కోసం క్రీమ్‌లు, పౌడర్‌గానూ వాడుతున్నారు. ఆయుర్వేద గుణాలు ఎక్కువగా ఉండడంతో ఔషధాల తయారీలోనూ వినియోగిస్తున్నారు. ఎర్ర చందనంతో చేసిన గ్లాసుల్లో నీటిని ఉంచి తాగితే బీపీ, షుగర్ వ్యాధులు తగ్గుముఖం పడతాయని నమ్ముతారు.

మన దేశంలో తప్ప ఎక్కడా దొరకదు

మన దేశంలో తప్ప ప్రపంచంలో ఎక్కడా ఎర్ర చందనం దొరకదు. మన దేశంలోనూ ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, వైఎస్సార్, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో విస్తరించి ఉన్న శేషాచలం అటవీ ప్రాంతంలోనే ఎర్ర చందనం ఉంది. దాదాపు 6.50 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉంది. శేషాచలం అటవీ ప్రాంతంలో పెరిగే ఎర్ర చందనానికి ఉన్న గిరాకీ ఇతర ప్రాంతాల్లో ఎక్కడ పెరిగినా లేదు.

ఎర్రచందనంతో తయారుచేసిన వివిధ బొమ్మలు



ఎర్ర చందనం, శ్రీగంధం వేర్వేరు

ఎర్ర చందనం, శ్రీ గంధం వృక్షాలు రెండూ సుగంధ ద్రవ్య వృక్షాలే అయినా వృక్ష శాస్త్రపరంగా రెండూ ఒకే జాతికి చెందినవి కావు. ఎర్ర చందనానికి వాసన కన్నా రంగు ఎక్కువ. దీనిని వృక్ష శాస్త్రంలో టెర్రోకార్పస్ శాంటాలీనస్ అంటారు. ఎర్ర చందనం మధ్య భాగం చాలా ధర పలుకుతుంది. ఘనపుటడుగు దాదాపు రూ.లక్షల్లో ఉంటుంది. చాలా దృఢంగాను, ముదురు ఎరుపు రంగులో ఉండటం వల్ల ఈ కలపను ఖరీదైన నిర్మాణాల్లోను, చైనా ఇతర దేశాలు వారు తినడానికి వాడే పుల్లల తయారీలోనూ, ఎర్రని పౌడర్ తయారీలోను ఎర్రచందనాన్ని వాడుతున్నారు. శ్రీగంధం చెట్టును శాస్త్రీయంగా శాంటాలమ్ పేనిక్యూలాటమ్ అంటారు. ఇవి ఎర్రచందనం లాగా దృఢంగా ఉండవు. గరుకుగా ఉన్న బండపై నీరు పోసి రాస్తే పసుపు రంగులో ఉన్న లేపనం లభిస్తుంది. ఈ చెట్టు నుంచి తీసిన నూనె సుగంధ ద్రవ్యాలు, సబ్బుల తయారీలోనూ వాడుతారు.

– ప్రభాకరరెడ్డి, ఫారెస్ట్ రేంజర్

పోలవరం బ్యాక్ వాటర్‌పై సాంకేతిక కమిటీ భేటీ వాయిదా

13న జరిగే సమావేశాన్ని వాయిదా వేయాలని కోరిన ఒడిశా

- సమావేశం ఎప్పుడో మళ్లీ చెబుతామన్న సీడబ్ల్యూసీ
- ఈ సమావేశం నిర్ణయాల ఆధారంగా కేంద్రానికి నివేదిక
- అనంతరం 4 రాష్ట్రాల సీఎంల సమావేశం
- సీఎంల భేటీ తర్వాత సుప్రీంకోర్టుకు కేంద్రం నివేదిక

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ (వెనక జలాలు) ప్రభావంపై ఈ నెల 13న జరగాల్సిన సాంకేతిక కమిటీ సమావేశాన్ని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వాయిదా వేసింది. ఒడిశా ప్రభుత్వం వినతి మేరకు వాయిదా వేశామని, మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామో తర్వాత సమాచారం ఇస్తామని సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్ వోరా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలకు మంగళవారం సమాచారమిచ్చారు. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల తమ రాష్ట్రాల్లో భూమి ముంపునకు గురవుతోందని ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌లు దాఖలు చేశాయి. నాలుగు రాష్ట్రాలతో సమావేశాన్ని నిర్వహించి, అనుమానాలు నివృత్తి చేసి డిసెంబర్‌లోగా నివేదిక ఇవ్వాలని గత ఏడాది సెప్టెంబరు 6న సుప్రీంకోర్టు ఆదేశించింది. గత ఏడాది సెప్టెంబరు 29న నాలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో కేంద్ర జల్ శక్తి శాఖ సమావేశం నిర్వహించి, అనుమానాలను నివృత్తి చేసింది. అక్టోబర్ 6న ఈఎన్‌సీలు, సీడబ్ల్యూసీ చైర్మన్‌తో కూడిన సాంకేతిక కమిటీ బ్యాక్ వాటర్ ప్రభావంపై సమగ్రంగా చర్చించింది. కానీ.. ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లు సంతృప్తి చెందకపోవడంతో సుప్రీంకోర్టుకు కేంద్రం నివేదిక ఇవ్వలేకపోయింది. దీంతో నివేదిక గడువును సుప్రీంకోర్టు ఫిబ్రవరి 29కి పొడిగించింది. ఈ నేపథ్యంలో మరోసారి సాంకేతిక కమిటీ సమావేశమవుతోంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాల ఆధారంగా సుప్రీంకోర్టుకు కేంద్రం నివేదిక ఇవ్వనుంది.

మాంసం ఉత్పత్తి రంగంలో ఔత్సాహికులకు చేయూత

సాక్షి, అమరావతి: మాంసం ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం చేయూతనిస్తోందని ఏపీ మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీరాములు చెప్పారు. రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి రంగాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా దేశవ్యాప్త ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో మంగళవారం విజయవాడలో నిర్వహించిన సమావేశానికి శ్రీరాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన మాంసం ఉత్పత్తులను ప్రజలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్, మీట్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ ఎం.విజయుడు తదితరులు పాల్గొన్నారు.

'నారా'యణ.. నల్లధనం ఓ 'ఎన్‌స్పైర'!

హైదరాబాద్‌లోని ఎన్‌స్పైర కార్యాలయంలో సీఐడీ తనిఖీలు.. హార్డ్ డిస్కులు, కీలక పత్రాలు స్వాధీనం

సాక్షి, అమరావతి: రాజధాని ముసుగులో టీడీపీ పెద్దలు రూ.వెయ్యి కోట్లకుపైగా నల్లధనాన్ని మళ్లించి 169.27 ఎకరాల అసైన్డ్ భూములను సిబ్బంది, పని మనుషుల పేరుతో కాజేసిన బాగోతం బట్టబయలైంది. అమరావతిలో చంద్రబాబు సర్కారు అక్రమాలపై దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులు ఈ కేసులో కీలక పురోగతి సాధించారు. టీడీపీ హయాంలో మొత్తం రూ.5,600 కోట్ల విలువైన 1,400 ఎకరాల అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నట్టు ఇప్పటికే గుర్తించగా నల్లధనాన్ని మళ్లించేందుకు 'ఎన్‌స్పైర' అనే షెల్ కంపెనీని వాడుకున్నట్లు తాజాగా తేలింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని 'ఎన్‌స్పైర' కార్యాలయంలో మంగళవారం విస్తృతంగా సోదాలు నిర్వహించిన సీఐడీ అధికారుల బృందం 45 హార్డ్ డిస్కులు, బ్యాంకు ఖాతా లావాదేవీల కీలక పత్రాలను స్వాధీనం చేసుకుంది. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న పొంగూరు నారాయణ తమ కుటుంబ వ్యాపార సంస్థ 'ఎన్‌స్పైర' ద్వారా సాగించిన అక్రమాల బాగోతం ఇలా ఉంది.

కుమార్తె, అల్లుడు డైరెక్టర్లుగా..

మాజీ మంత్రి నారాయణ తమ కుటుంబం నిర్వహించే నారాయణ విద్యా సంస్థల కోసమంటూ 'ఎన్‌స్పైర మేనేజ్‌మెంట్ సర్వీసెస్' అనే కంపెనీని ఏర్పాటు చేశారు. నారాయణ విద్యా సంస్థలకు సంబంధించి కొనుగోళ్లు, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగులు, సిబ్బందికి జీతాల చెల్లింపుల కోసం దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నారాయణ విద్యాసంస్థను లాభాపేక్షలేని సంస్థగా ఏపీ సొసైటీల చట్టం ప్రకారం ఏర్పాటుచేశారు. విద్యా సంస్థ నిధులను నారాయణ తమ వ్యక్తిగత, కుటుంబ అవసరాలకు మళ్లించేందుకు వీలులేదు. దీంతో నిధుల మళ్లింపు కోసం ఎత్తుగడ వేసిన నారాయణ తన కుమార్తె పొంగూరు సింధూర, అల్లుడు పునీత్ డైరెక్టర్లుగా ఎన్‌స్పైర అనే కంపెనీని నెలకొల్పారు.



ఎన్‌స్పైర కార్యాలయంలో సీఐడీ సోదాల కారణంగా బయట హడావుడి

నల్లధనం భారీగా మళ్లింపు..

నారాయణ విద్యా సంస్థలకు అన్ని రకాల చెల్లింపులు నిర్వహిస్తున్నందుకు ఎన్‌స్పైరకు 10 శాతం కమిషన్ చెల్లిస్తున్నట్లు రికార్డుల్లో చూపారు. ఇదే అవకాశంగా ఎన్‌స్పైరలోకి ఇతర సంస్థల నుంచి భారీగా నిధులు మళ్లించారు. ఎన్‌స్పైరలో ఇతర కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టినట్లు చూపడం గమనార్హం. ఒలంపస్ క్యాపిటల్ ఏషియా క్రెడిట్ అండ్ సీఎక్స్ పార్టనర్స్ మ్యాగజైన్ అనే కంపెనీ 2016లో ఏకంగా రూ.400 కోట్లు పెట్టుబడి పెట్టినట్టు చూపించారు. ఇక 2018లో మోర్గాన్ స్టాన్లీ ప్రైవేట్ ఈక్విటీ ఏషియా, బన్యాన్ ట్రీ గ్రోత్ క్యాపిటల్ అనే సంస్థలు 75 మిలియన్ డాలర్లు (రూ.613.27 కోట్లు) పెట్టుబడి పెట్టినట్టు రికార్డుల్లో చూపడం గమనార్హం. రెండు విడతల్లో ఎన్‌స్పైర కంపెనీలోకి రూ.1,013.27 కోట్లు వచ్చి చేరాయి. ఇలా భారీగా నల్లధనాన్ని ఎన్‌స్పైరలోకి మళ్లించినట్లు తెలుస్తోంది.

ఆ నిధులు రామకృష్ణ హౌసింగ్‌లోకి..

వివిధ మార్గాల్లో ఎన్‌స్పైరలోకి మళ్లించిన నిధులను నారాయణ తమ సమీప బంధువైన కేవీపీ అంజని కుమార్ ఎండీగా ఉన్న రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లోకి తరలించారు. దీంతోపాటు నారాయణ విద్యా సంస్థల సిబ్బంది బ్యాంకు ఖాతాల్లోకి కూడా నిధులు మళ్లించడం గమనార్హం. అనంతరం ఆ చిరుద్యోగుల పేరిట అమరావతిలో అసైన్డ్ భూములను కొనుగోలు చేశారు. తమ వద్ద పనిచేసే చిరుద్యోగులను బినామీలుగా మార్చుకుని 169.27 ఎకరాల అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు.

మొత్తం రూ.5,600 కోట్ల అసైన్డ్ దందా

అమరావతిలో రూ.5,600 కోట్ల విలువైన 1,400 ఎకరాల అసైన్డ్ భూములను టీడీపీ పెద్దలు కొల్లగొట్టినట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. టీడీపీ హయాంలో పురపాలక శాఖ మంత్రిగా అమరావతి వ్యవహారాల్లో చక్రం తిప్పిన నారాయణ కనుసన్నల్లోనే భూ దందాలు జరిగాయి. రాజధాని కోసం సమీకరించే అసైన్డ్ భూములను గత ప్రభుత్వం ఎలాంటి పరిహారం చెల్లించకుండా తీసుకుంటుందని రెవెన్యూ, పురపాలక శాఖ అధికారుల ద్వారా ప్రచారం చేశారు. ఇదే అదనుగా దళితులు, బీసీల భయాందోళనలను సొమ్ము చేసుకునేందుకు రియల్ ఎస్టేట్ కంపెనీలను రంగంలోకి దించారు. అసైన్డ్ భూములను అయినకాడికి అమ్ముకోకుంటే ప్రభుత్వ పరమైపోతాయని పేదలను బెదిరించి కారుచౌకగా కాజేశారు. అసైన్డ్ భూములున్న వారికి నగదు చెల్లింపులు చేసి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) పొందారు. అనంతరం సేల్ డీడ్‌ల ద్వారా కథ నడిపించారు. రిజిస్ట్రేషన్ చట్టం 22 ఏ కింద నిషేధిత భూముల జాబితాలో ఉన్న వీటిని పకడ్బందీగా సొంతం చేసుకున్నారు. ఆ విధంగా అమరావతి పరిధిలోని అనంతవరం, కృష్ణాయపాలెం, కురగల్లు, లింగాయపాలెం, మందడం, నెక్కల్లు, నవులూరు, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెం, బోరుపాలెం, నేలపాడు, రాయపూడి తదితర గ్రామాల్లోని అసైన్డ్ భూములను టీడీపీ పెద్దలు కాజేశారు. అనంతరం అసైన్డ్ భూములకు గత ప్రభుత్వం తాపీగా ప్యాకేజీ ప్రకటించడం గమనార్హం.

అక్రమాలు బహిర్గతం..

అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్న కేసులో మాజీ మంత్రి పి.నారాయణను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ అసైన్డ్ భూముల బదిలీ నిషేధిత చట్టం 1977, ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంతో పాటు ఐపీసీ 34, 35, 36, 37, 409, 420, 506 తదితర సెక్షన్ల కింద సీఐడీ అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ కుంభకోణంలో పాత్రధారులుగా వ్యవహరించిన నారాయణ సన్నిహితులైన ఐదుగురిని గతంలో అరెస్టు చేశారు. కాగా అసైన్డ్ భూములు కొల్లగొట్టేందుకు ఎన్‌స్పైర కంపెనీ ద్వారా నల్లధనాన్ని మళ్లించి అక్రమాల కథ నడిపించినట్లు సీఐడీ దర్యాప్తులో తాజాగా బహిర్గతమైంది.

జీవో నంబర్ 1పై దురుద్దేశంతోనే దుష్ప్రచారం

- రోడ్లపైన మాత్రమే సభలు, సమావేశాలు నిర్వహించవద్దని చెప్పాం
- ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో అనుమతిస్తున్నాం
- అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్



సాక్షి, అమరావతి: ప్రజల భద్రత కోసం నిబంధనలను అనుసరించి హోం శాఖ జీవో నంబర్ 1 జారీ చేసిందని అదనపు డీజీ (శాంతిభద్రతలు) రవిశంకర్ అయ్యన్నార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పాదయాత్రలు, రోడ్‌షోలపై ఎలాంటి నిషేధం విధించలేదని తెలిపారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. కొందరు దురుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం సభలు, సమావేశాలపై నిషేధం విధించిందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసలు జీవో నంబర్ 1లో నిషేధం అనే మాటే లేదన్నారు. జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రహదారులపైన సభలు, సమావేశాలు పెట్టొద్దని మాత్రమే చెప్పామని వెల్లడించారు. పూర్తిగా ప్రజల ప్రయాణం, సరుకు రవాణా కోసమే రహదారులను ఉపయోగించాలని జీవోలో పేర్కొన్నారని గుర్తుచేశారు. వైద్యం, ఇతర అత్యవసర ప్రయాణాలు చేసేవారికి ఇబ్బంది కలగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో సభలు నిర్వహించుకోవాలని సూచించామని తెలిపారు. అత్యవసరమైతే షరతులతో అధికారులు అనుమతినిస్తారని కూడా జీవోలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. కరెంటు వైర్లు, కాలువలు, డ్రైనేజీలు దగ్గరలో లేకుండా సభలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సభల నిర్వహణకు తగిన ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఎంపిక చేయాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో జనసేన సభ కోసం అనుమతి కోరితే అన్నీ పరిశీలించి అనుమతి మంజూరు చేశామని చెప్పారు. చంద్రబాబు కుప్పం పర్యటనలో టీడీపీ నేతలు సరిగా దరఖాస్తు పూర్తి చేయలేదన్నారు. దరఖాస్తు సరిచేసి ఇవ్వాలని పోలీసులు చెప్పినప్పటికీ నిర్వాహకులు స్పందించలేదన్నారు. ఏ పార్టీ అయినా ఒకే రీతిలో జీవో నంబర్1 ను అమలు చేస్తామని వెల్లడించారు. 1861 పోలీసు చట్టం దేశమంతా అమలులో ఉందన్నారు. ఆ చట్టంలోని సెక్షన్లు 30, 30ఏ, 31లలో పేర్కొన్న అంశాలకు అనుగుణంగానే జీవో నంబర్ 1ను హోం శాఖ జారీ చేసిందన్నారు. కందుకూరు, గుంటూరు జిల్లాల్లో దుర్ఘటనలపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐజీ (శాంతిభద్రతలు) రాజశేఖర్ బాబు పాల్గొన్నారు.

జీవో నంబర్ 1ని రద్దు చేయండి

హైకోర్టులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిల్

సాక్షి, అమరావతి: రోడ్లపై బహిరంగ సభలను నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2న జారీ చేసిన జీవో నంబర్ 1ని సవాల్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మంగళవారం హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ జీవో చట్టవిరుద్ధమని, దానిని రద్దు చేయాలని, జీవో అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టును కోరారు. ఇందులో రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ప్రస్తుతం సంక్రాంతి సెలవుల నేపథ్యంలో అత్యవసర కేసుల విచారణ కోసం ఏర్పాటైన వెకేషన్ బెంచ్ ముందు పిటిషనర్ తరపు న్యాయవాదులు ఈ పిల్ గురించి ప్రస్తావించి, అత్యవసర విచారణ కోరనున్నారు. ఈ నెల 12న న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ కృపాసాగర్ ధర్మాసనం ముందు ఈ వ్యాజ్యం గురించి ప్రస్తావించేందుకు రామకృష్ణ న్యాయవాదులు సర్వం సిద్ధంచేశారు. కాగా, రాజకీయ పార్టీల రోడ్‌షోలకు, బహిరంగ సభలకు అనుమతినివ్వకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ పాత్రికేయుడు బాలగంగాధర్ తిలక్ దాఖలు చేసిన పిల్‌పై సంక్రాంతి సెలవుల తర్వాత విచారణ జరుపుతామని గతవారం హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

మా భూమి.. మాకే కౌలు

- టీడీపీ పెద్దల అసైన్డ్ దగాపై రైతన్నల ఆగ్రహం
- తిరిగిస్తే సాగు చేసుకుంటామని సీఆర్‌డీఏ అధికారులకు వినతిపత్రం

సాక్షి, అమరావతి: టీడీపీ పెద్దలు తమను మభ్యపెట్టి కాజేసిన అసైన్డ్ భూములను తిరిగి దక్కించుకునేందుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు గతంలోనే పలువురు అసైన్డ్ రైతులు రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు సమర్పించగా మంగళవారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయానికి చేరుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేతలు అక్రమంగా దక్కించుకున్న తమ అసైన్డ్ భూములను తిరిగి ఇప్పించాలని కోరారు. అసైన్డ్ భూములకు ఎలాంటి పరిహారం చెల్లించకుండా గత ప్రభుత్వం తీసుకుంటుందని బెదిరించి తమ వద్ద నుంచి కాజేశారని సీఆర్‌డీఏ అధికారుల దృష్టికి తెచ్చారు. తమ భూములను కారుచౌకగా తీసుకున్న తరువాత టీడీపీ సర్కారు వాటికి ప్యాకేజీని ప్రకటించిందన్నారు. ఇప్పటికీ అవి రెవెన్యూ రికార్డుల్లో తమ పేరిటే ఉన్నాయని గుర్తుచేశారు. టీడీపీ నేతలు వాటిని భూసమీకరణ కింద సీఆర్‌డీఏకు ఇచ్చినట్లు చూపటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అసైన్డ్ భూములకు సీఆర్‌డీఏ ఇస్తున్న కౌలును తమకే చెల్లించాలని వినతిపత్రం అందించారు. భూసమీకరణ కింద అసైన్డ్ రైతులకు అందిస్తున్న ప్యాకేజీ తమకే ఇవ్వాలని, లేదంటే తమ భూములు తమకు తిరిగిస్తే సాగు చేసుకుంటామని విజ్ఞప్తి చేశారు.

ఇకనైనా న్యాయం చేయాలి



'టీడీపీ ప్రభుత్వం మమ్మల్ని మోసం చేసింది. న్యాయం చేయాలని గతంలో అధికారులను ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలని సీఆర్‌డీయే అధికారులకు వినతి పత్రం సమర్పించాం. ప్రభుత్వం స్పందించి మా భూముల కౌలు మాకే ఇప్పించాలని కోరుతున్నాం.

– టి.బాబూరావు, అసైన్డ్ రైతు, రాయపూడి

బెదిరించి తీసుకున్నారు..



అసైన్డ్ భూమికి పరిహారం ఇవ్వరని టీడీపీ సర్కారు ప్రచారం చేసి మమ్మల్ని మోసం చేసింది. దీంతో భయపడి టీడీపీ నేతలకు అమ్మేందుకు ఒప్పుకున్నాం. కానీ తరువాత మా నిర్ణయం మార్చుకున్నాం. ఇప్పటికీ ఆ భూములు మాపేరునే రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి. సీఆర్‌డీయే రికార్డుల్లో కూడా వాటిని మా పేరిట మార్చాలని కోరాం.

– ఆర్.పున్నారావు, అసైన్డ్ రైతు, రాయపూడి

మా భూములిస్తే సాగు చేసుకుంటాం



'అసైన్డ్ భూమికి ప్రభుత్వం పరిహారం ఇవ్వదని టీడీపీ నేతలు, దళారులు మమ్మల్ని ఆందోళనకు గురి చేశారు. ఎకరం రూ.కోటి పలికే భూమికి మాకు కేవలం రూ.6 లక్షలే ఇచ్చారు. మేం సంతకాలు చేసిన తరువాత టీడీపీ ప్రభుత్వం అసైన్డ్ భూములకు ప్యాకేజీ ప్రకటించింది. టీడీపీ పెద్దలు మోసం చేశారు. మా భూములు రిజిస్ట్రేషన్ కాలేదు కాబట్టి ప్యాకేజీ మాకే ఇవ్వాలి. లేదా మా భూములు మాకు తిరిగిస్తే సాగు చేసుకుంటాం.

– రేమర్ల కోటేశ్వరరావు, అసైన్డ్ రైతు, వెంకటపాలెం

ప్యాకేజీ, కౌలు ఇప్పించండి



'మా భూమి పెండింగ్ రిజిస్ట్రేషన్‌లో ఉంది. సీఆర్‌డీయే రికార్డుల్లో మాత్రం టీడీపీ నేతల పేరిట ఉంది. ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలి. భూసమీకరణ ప్యాకేజీ, కౌలు మాకే ఇప్పించాలి'

– వి.నరసింహారావు, అసైన్డ్ రైతు, రాయపూడి

ముమ్మరంగా రీ సర్వే

7,744 గ్రామాల్లో పూర్తయిన డ్రోన్ సర్వే

- 4,006 గ్రామాలకు సంబంధించిన ఓఆర్‌ఐలు విడుదల
- వాటి ద్వారా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్న యంత్రాంగం
- ఇప్పటి వరకు 2,119 గ్రామాల్లో అన్ని దశల సర్వే పూర్తి
- రెండునెలల్లో మరో రెండువేల గ్రామాల్లో సర్వే పూర్తికి సన్నాహాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ముమ్మరంగా జరుగుతోంది. కీలకమైన డ్రోన్ సర్వే, ఆ తర్వాత దశల్లో జరిగే క్షేత్రస్థాయి నిజ నిర్ధారణ, గ్రౌండ్ వాలిడేషన్ వంటి పనులన్నీ చకచకా ముందుకు సాగుతున్నాయి. డ్రోన్ సర్వేను 7,744 గ్రామాల్లో పూర్తిచేశారు. చిత్తూరు జిల్లాలో అత్యధికంగా 766 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తికాగా, శ్రీకాకుళం జిల్లాలో 758 గ్రామాలు, విజయనగరం జిల్లాలో 737, తిరుపతి జిల్లాలో 726, అనకాపల్లి జిల్లాలో 604 గ్రామాల్లో ఈ సర్వేను పూర్తిచేశారు. అతి తక్కువగా అల్లూరి సీతారామ రాజు జిల్లాలో కేవలం రెండు గ్రామాల్లో మాత్రమే డ్రోన్ సర్వే పూర్తయింది. ఆ జిల్లా అంతా కొండ ప్రాంతాలతో నిండి ఉండడంతో సర్వే సాధ్యం కావడంలేదు. దీంతో అక్కడ డీజీపీఎస్ సర్వే నిర్వహిస్తున్నారు. నంద్యాల, తూర్పు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, కర్నూలు జిల్లాల్లోనూ డ్రోన్ సర్వే ఆశించిన స్థాయిలో జరగడంలేదని గుర్తించారు. దీంతో ఏరియల్ సర్వే ద్వారా ఈ ప్రాంతాల్లో వేగంగా సర్వే చేపడుతున్నారు.

47 లక్షల ఎకరాలకు ఓఆర్‌ఐల జారీ

డ్రోన్ సర్వే నిర్వహిస్తేనే మిగిలిన దశల సర్వే పూర్తి చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. డ్రోన్ కెమెరాల ద్వారా తీసిన ఫొటోలను అభివృద్ధి చేసి ఓఆర్‌ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్)లు జారీచేస్తారు. వాటిని బట్టి క్షేత్రస్థాయిలో సర్వే బృందాలు నిజ నిర్ధారణ, రైతుల సమక్షంలో గ్రౌండ్ వాలిడేషన్ చేపడతాయి. ఇప్పటివరకు 47,33,454 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి 4,006 గ్రామాలకు ఓఆర్‌ఐలు జారీ అయ్యాయి. అవి సర్వే బృందాలకు చేరడంతో వాటిని బట్టి 2,790 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ (క్షేత్రస్థాయి నిజ నిర్ధారణ)ను పూర్తిచేశారు. ఈ గ్రామాల్లోని భూముల విస్తీర్ణం 32,40,618 ఎకరాలు కాగా.. ఈ ప్రాంతం మొత్తం గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయింది.

18,717 వినతులకు పరిష్కారం

ఇక చివరిగా.. రైతుల సమక్షంలో చేసే గ్రౌండ్ వాలిడేషన్‌ను 2,325 గ్రామాల్లో పూర్తిచేశారు. ఈ గ్రామాలకు సంబంధించి ఇప్పటివరకు 18,855 వినతులు, అభ్యంతరాలు రాగా వాటిలో 18,717 వినతుల్ని మొబైల్ మెజిస్ట్రేట్ బృందాలు పరిష్కరించాయి. ఇన్ని దశల తర్వాత చివరిగా రీ సర్వే పూర్తయినట్లు ప్రకటించే నెంబర్–13 నోటిఫికేషన్లను 2,119 గ్రామాల్లో పబ్లిష్ చేశారు. ఆ గ్రామాల్లోని రెండువేల గ్రామాలకు సంబంధించి భూహక్కు పత్రాల జారీ ప్రక్రియ నడుస్తోంది. వచ్చే రెండు నెలల్లో మరో రెండువేల గ్రామాల్లో అన్ని దశల సర్వేను పూర్తి చేసి భూహక్కు పత్రాల జారీకి రెవెన్యూ శాఖ వడివడిగా అడుగులు వేస్తోంది.

క్లుప్తంగా...

ఏడీసెట్ కన్వీనర్‌గా ఆచార్య సురేంద్రనాథ్‌రెడ్డి



ఏఎఫ్‌యూ: ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏడీసెట్)–2023 కన్వీనర్‌గా ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి నియమితులయ్యారు. కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సురేంద్రనాథ్‌రెడ్డిని కన్వీనర్‌గా నియమిస్తూ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (బీడిజైన్), బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ (బీఎఫ్ఏ)లోని వివిధ కోర్సుల్లో ప్రవేశ పరీక్షలు, అడ్మిషన్ల ప్రక్రియను కన్వీనర్ నిర్వహించనున్నారు.

తెలంగాణ

ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నవ చండీయాగం

హాజరైన చంద్రబాబు

సాక్షి, హైదరాబాద్: టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన దశ మహా విద్యాపూర్వక నవ చండీయాగంకి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. యాగపూర్ణాహుతిలో పాల్గొన్న చంద్రబాబును వేద పండితులు ఆశీర్వదించారు. తెలుగు ప్రజలందరికీ శుభం కలగాలని శుభాశీస్సులు అందజేశారు. కాసాని జ్ఞానేశ్వర్ తన సతీమణి చంద్రకళతో కలిసి పాల్గొన్నారు. యాగం నిర్వహించిన జ్ఞానేశ్వర్‌ను ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించారు.

18న ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీ

ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా 18న నిర్వహించనున్న ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీకి చంద్రబాబును ఆహ్వానిస్తూ అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు శ్రీపతి సతీష్ కుమార్ మొదటి ఆహ్వానపత్రికను అందజేశారు. మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబును కలిసి ర్యాలీ ప్రారంభానికి రావాలని కోరారు. రసూల్‌పురాలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ ఘాట్ వరకు జరిగే ర్యాలీని 18 ఉదయం చంద్రబాబు ప్రారంభిస్తారు.

కుళ్లిన కొబ్బరికీ కోట్లు

కొబ్బరి కాయ కుళ్లిపోయింది కదాని పక్కన పాడేయకండి. ఎందుకంటే.. కుళ్లిన కాయలు సైతం రూ.కోట్లు కురిపిస్తాయట. కుళ్లిన కురిడీల నుంచి తీసే నూనెను సబ్బుల తయారీలో వినియోగిస్తుంటే.. కుళ్లిన కాయలను కాశీలో శవ దహనాలకు వినియోగిస్తున్నారట. ఒక్క ఉమ్మడి గోదావరి జిల్లాల్లోనే కుళ్లిపోయిన కొబ్బరి కాయలతో రూ.100 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయట. అక్షరాలా ఇది నిజమని చెబుతున్నారు ఇక్కడి కొబ్బరి వ్యాపారులు



- ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఏటా లావాదేవీలు రూ.100 కోట్ల పైమాటే
- కుళ్లిన కాయల నుంచి తీసే నూనె సబ్బుల్లో వినియోగం
- కాయలకు కాశీలో యమ డిమాండ్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గోదావరి జిల్లాల కల్పతరువు కొబ్బరి. ఇప్పటివరకు కొబ్బరి కాయలు, కొబ్బరి నూనె, తెలగపిండి, కొబ్బరి చిప్పలు, కొబ్బరి పీచు, పీచులోంచి వచ్చే పొడర్, కొబ్బరి తాడు, ఆకుల నుంచి ఈనెలు, కమ్మలు ద్వారానే డబ్బొస్తుందని అందరికీ తెలుసు. కుళ్లిపోయిన కొబ్బరి కాయలకు సైతం డిమాండ్ ఉందనే విషయం ఎందరికి తెలుసు. కుళ్లిన కొబ్బరితో ఏటా రూ.కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. కొబ్బరి కాయల దింపు సమయంలోను, రాశుల నుంచి కుళ్లిన కొబ్బరి కాయలను ఏరి పక్కన పడేస్తుంటారు. నాణ్యమైన కాయలను మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. ఇలా ఏరి వేసే ప్రక్రియను నాడెం(నాణ్యత పరిశీలకులు) చేసేవారు నిర్వహిస్తారు. కొబ్బరి రాశుల నుంచి నూటికి 5 కొబ్బరి కాయలు కుళ్లిపోయినవి వస్తుంటాయి. వీటిని ఏరివేసి పక్కన పడేస్తుంటారు. వీటిని కూడా కొనుగోలు చేసే వ్యాపారులు ప్రత్యేకంగా ఉంటారు. వీరు ఒక్కో కాయకు రూపాయి లేదా రెండు రూపాయల చొప్పున (కుళ్లిన కొబ్బరి పరిమాణాన్ని బట్టి) కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన కుళ్లిన కొబ్బరి కాయలను ప్రాసెసింగ్, రవాణా చార్జీలతో కలిపి ఉత్తరాదిలో ఒక్కో కాయ రూ.8 నుంచి రూ.10కి విక్రయిస్తున్నారు.

వాటి నుంచి నూనె తీసి..

కుళ్లిన కొబ్బరి కాయల్లో వచ్చే కొబ్బరి గుజ్జును తీసి నాలుగైదు వారాలపాటు ఎండబెట్టి కొబ్బరి నూనె తీస్తారు. ఇలా తీసిన నూనె కోనసీమలోని అంబాజీపేట కేంద్రంగా వ్యాపారులు సేకరిస్తారు. ఇలా సేకరించిన కుళ్లిన కొబ్బరి నూనెను యానాం, తణుకు, విజయవాడ, పుణె, ముంబై, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో సబ్బుల తయారీ పరిశ్రమల్లో వినియోగిస్తున్నారు. టన్నుల కొద్దీ కుళ్లిన కొబ్బరి నూనె అమ్మకాలు సాగుతున్నాయి. ఈ నూనె కిలో రూ.30 నుంచి రూ.40 చొప్పున అమ్ముడుపోతుంది. కుళ్లిన కొబ్బరి కాయల చిప్పలను పొడి చేసి దోమల నివారణకు వాడే కాయిల్స్‌లో వినియోగిస్తున్నారు. ఈ పౌడర్ తణుకు, విజయవాడ రవాణా చేస్తున్నారు. ఈ చిప్పలు టన్ను రూ.5 వేల ధర పలుకుతోంది.

శవ దహనాలకు కుళ్లిన కొబ్బరి కాయలు

కాశీతోపాటు పలు ఉత్తరాది రాష్ట్రాల్లో శవాల దహనానికి కుళ్లిన కొబ్బరి కాయలను ఎండబెట్టి వినియోగిస్తున్నారు. కుళ్లిన కొబ్బరి కాయలను నాణ్యమైన కొబ్బరి కాయల మాదిరిగా సంచులలో నింపి లారీల ద్వారా కాశీ, మధుర తదితర క్షేత్రాలకు ఎగుమతి చేస్తున్నారు. కాశీ వంటి క్షేత్రాల్లో కొబ్బరి కాయలతో అంత్యక్రియలు నిర్వహిస్తే పుణ్యం వస్తుందని ఉత్తరాది రాష్ట్రాల వారి నమ్మకం. ఇందుకు నాణ్యమైన కొబ్బరి కాయలు వినియోగించాలంటే కాయ రూ.20 పైనే ఉంటుంది. అంత ధర భారమనే ఉద్దేశంతో కుళ్లిన కొబ్బరి కాయలను శవ దహనానికి వినియోగిస్తున్నారని గోదావరి జిల్లాల నుంచి కుళ్లిన కొబ్బరి కాయలు ఎగుమతిచేసే వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి రోజుకు మూడు లారీలు (సుమారు లక్ష కాయలు) కాశీకి కుళ్లిన కొబ్బరి కాయలు ఎగుమతి అవుతున్నాయి. కార్తీక మాసంతో పాటు పూజల సమయాలలో హోమాల నిర్వహణ, మొక్కులు తీర్చుకునే క్రమంలో నదులలో వదిలేందుకు ఉత్తరాది భక్తులు ఈ కొబ్బరి కాయలను బస్తాల కొద్దీ కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఇవి రెట్టింపు ధర పలుకుతున్నాయి.

ఉత్తరాదిలో మంచి గిరాకీ



కుళ్లిన కొబ్బరి కాయల్ని చాలా కాలంగా ఎగుమతి చేస్తున్నాం. ఈ కొబ్బరికి ఉత్తరాదిలో మంచి గిరాకీ ఉంటుంది. ఆరేడు నెలల ముందుగానే ఆర్డర్లు బుక్ చేసుకుని కొనుగోలు చేస్తుంటారు. ఒబ్బిడి చేసిన కుళ్లిన కొబ్బరి కాయల నూనె, చిప్పలను కొనుగోలు చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. సబ్బులు, దోమల కాయిల్స్ తయారీ పరిశ్రమల్లో వీటిని వినియోగిస్తారు. శవ దహనాల్లో వీటికి డిమాండ్ ఎక్కువ.

– దాసింశెట్టి రామారావు, పెదతిప్ప, వ్యాపారి

రూ.వంద కోట్ల వరకు లావాదేవీలు

కుళ్లిన కొబ్బరి కాయలను ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆచంట, అంబాజీపేట, పాశర్లపూడి తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు. రాష్ట్రంతో పాటు కేరళ, ఒడిశా, తమిళనాడు నుంచి కూడా కుళ్లిన కొబ్బరి కాయలను ఎగుమతి చేస్తుండటంతో పోటీ నెలకొంది. కుళ్లిన కొబ్బరి కాయలు, కొబ్బరి నూనె, చిప్పలు అన్నీ కలిపి ఉభయ గోదావరి జిల్లాల నుంచి జరిగే లావాదేవీలు ఏటా రూ.100 కోట్ల వరకు ఉంటుందని అంచనా.



ఎగుమతికి సిద్ధమైన కుళ్లిన కొబ్బరి చిప్పలు



కుళ్లిన కొబ్బరి కాయలతో మహిళల ఉపాధి

పశువుల్లో పిండ మార్పిడి సక్సెస్

- దక్షిణ భారతదేశంలో ఇదే తొలిసారి
- ఐవీఎఫ్ పద్ధతిలో గేదెల్లో పిండ మార్పిడి



పిండ మార్పిడి పద్ధతిలో గర్భధారణ చేసిన పశువును పరిశీలిస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో ఎం.శ్రీనివాస్, శాస్త్రవేత్తలు, అధికారులు

తాడికొండ: ఐవీఎఫ్ పద్ధతిలో పిండ మార్పిడి సాంకేతికతను గేదెలలో ప్రవేశపెట్టగా విజయవంతమైనట్టు ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో ఎం.శ్రీనివాస్ వెల్లడించారు. గుంటూరులోని లాం పశువైద్య పరిశోధనా స్థానం ప్రొఫెసర్ ముత్తారావు సహకారంతో తాడికొండ మండలం పొన్నెకల్లు పశు వైద్యశాలలో మంగళవారం ఈ విషయాన్ని వెల్లడించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. దక్షిణ భారత దేశంలోనే తొలిసారిగా పిండాన్ని ఉత్పత్తి చేసి రావెల, పొన్నెకల్లు గ్రామాల్లోని గేదెల్లో ప్రవేశ పెట్టామన్నారు. ఎదకు వచ్చిన గేదెలోకి ఏడు రోజుల పిండాన్ని ప్రవేశ పెట్టామని, మూడు నెలల క్రితం చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైందన్నారు. మామూలు గేదె రోజుకు 10నుంచి 12 లీటర్ల పాలు ఇస్తే పిండ మార్పిడి ద్వారా పుట్టిన మేలు జాతి గేదె 20 లీటర్లకు పైగా ఇస్తుందన్నారు. లాం పశువైద్య పరిశోధనా స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ ముత్తారావు మాట్లాడుతూ.. మేలు జాతి పశువుల అండాలను పిండాలుగా మార్చి ఎదకు వచ్చిన గేదెలలో ఏడో రోజున ప్రవేశపెట్టామన్నారు. ఈ ప్రక్రియలో అధిక పాల ఉత్పత్తి సాధ్యమన్నారు. ఈ ప్రక్రియలో తనతో పాటు శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ఆర్ శ్రీకాంత్, డాక్టర్ కె.సన్నీ ప్రవీణ్, పశుగణాభివృద్ధి సంస్థ వైద్యుడు డాక్టర్ టి.శ్రీమన్నారాయణ పాల్గొన్నట్టు వివరించారు. సమావేశంలో పశు సంవర్థక శాఖ ఉప సంచాలకుడు కేవీవీ సత్యనారాయణ, సహాయ సంచాలకుడు టి.శ్రీనివాసులు, పశువైద్య సహాయ శస్త్ర చికిత్స నిపుణురాలు ఆర్.సౌజన్య, పశు వైద్యుడు రవితేజ పాల్గొన్నారు.

నాణ్యమైన రొయ్యల ఉత్పత్తే లక్ష్యం

- రొయ్యరైతులు, సీడ్, ఫీడ్, ప్రాసెసింగ్ ఆపరేటర్లతో కమిటీ
- సీడ్ నుంచి పట్టుబడి వరకు దశలవారీగా పరీక్షలు
- యాంటిబయోటిక్స్ అవశేషాల్లేకుంటేనే కొనుగోలు



సాక్షి, అమరావతి: ఆక్వాసాగులో యాంటిబయోటిక్స్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించేదిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మూడున్నరేళ్లుగా ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా యాంటిబయోటిక్స్ వినియోగాన్ని 95 శాతానికిపైగా నియంత్రించగలిగారు. ఇకముందు 100 శాతం నియంత్రించేదిశగా చర్యలు చేపట్టింది. ఇందుకోసం సీడ్ నుంచి మార్కెటింగ్ వరకు దశలవారీగా యాంటిబయోటిక్స్ శాతాన్ని పరీక్షించేలా కార్యాచరణ సిద్ధం చేసింది. రాష్ట్రంలో ఏటా తొమ్మిదిలక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. లక్షటన్నులు స్థానికంగా వినియోగమవుతుండగా, లక్షన్నర టన్నులు ఒడిశా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలకు వెళుతున్నాయి. మిగిలిన 6.50 లక్షల టన్నులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. దీన్లో 50 శాతం అమెరికా సంయుక్త రాష్ట్రాలకు, 30 శాతం చైనాకు, 10 శాతం వియత్నాం, థాయ్‌లాండ్ దేశాలకు, 6–8 శాతం యూరప్ దేశాలకు, మిగిలింది మిడిల్ ఈస్ట్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. యాంటిబయోటిక్ రెసిడ్యూల్స్ మితిమీరి ఉన్నాయంటూ ఒకప్పుడు పెద్ద ఎత్తున కన్‌సైన్‌మెంట్స్ వెనక్కి వచ్చే పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సర్టిఫై చేసిన సీడ్, ఫీడ్ అందించే లక్ష్యంతో ఏపీ సడా, సీడ్, ఫీడ్ యాక్టులు తీసుకురావడంతోపాటు తీరప్రాంత జిల్లాల్లో రూ.50 కోట్లతో 35 ఇంటిగ్రేటెడ్ ఆక్వాల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఆర్బీకేల ద్వారా సర్టిఫై చేసిన సీడ్, ఫీడ్ అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఆర్బీకే చానల్ ద్వారా శాస్త్రవేత్తలతో అవగాహన

ఆక్వాసాగు వివరాలను ఈ ఫిష్ యాప్‌లో నమోదు చేస్తూ, నాణ్యమైన దిగుబడులు లక్ష్యంగా పెద్ద ఎత్తున మత్స్యసాగుబడులు నిర్వహిస్తున్నారు. యాంటిబయోటిక్స్ వినియోగంవల్ల తలెత్తే దుష్పరిణామాలపై ఆర్బీకే చానల్ ద్వారా శాస్త్రవేత్తలతో అవగాహన కల్పిస్తున్నారు. పంటకాలంలో కనీసం నాలుగైదుసార్లు వాటర్ అనాలసిస్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఉత్పత్తి ఖర్చులు 5–7 శాతం తగ్గడమే కాదు.. పొరుగు రాష్ట్రాలు, దేశాలతో పోల్చుకుంటే రొయ్యల ఎదుగుదల 12.76 శాతం మేర పెరిగింది. మరోవైపు యాంటిబయోటిక్స్ వినియోగం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి విదేశాలకు పంపే రొయ్యల్లో యాంటిబయోటిక్స్ అవశేషాలు 0.3 నుంచి 0.4 శాతం ఉంటే, మన రాష్ట్రం నుంచి వెళ్లే వాటిలో 0.2 శాతం మాత్రమే నమోదవుతున్నాయి. అవికూడా కొద్దిపాటి కన్‌సైన్‌మెంట్‌లలోనే. ఈక్వెడార్ వంటి దేశాల్లో ప్రతి ఉత్పత్తిని టెస్ట్ చేసిన తర్వాతే విదేశాలకు ఎగుమతి చేసేందుకు అనుమతినిస్తారు. అదే మనదేశంలో ర్యాండమ్‌గా చెక్‌చేసిన తర్వాత ఎగుమతులకు అనుమతినిస్తుంటారు. వ్యాధుల నియంత్రణ పేరుతో విచ్చలవిడిగా వినియోగిస్తున్న యాంటిబయోటిక్స్ వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. యాంటిబయోటిక్స్ అవశేషాలుంటే ఇకనుంచి రొయ్యలను కొనుగోలు చేయబోమని ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ప్రాసెసింగ్ ఆపరేటర్లు, ఎక్స్‌పోర్టర్లు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నూరుశాతం యాంటిబయోటిక్స్ రహిత ఉత్పత్తులుగా మన రొయ్యలను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈక్వెడార్ తరహాలోనే నూరుశాతం తనిఖీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం సీడ్, ఫీడ్, ప్రాసెసింగ్ ఆపరేటర్లతోపాటు రైతుసంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా ఓ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ కమిటీ పర్యవేక్షణలో సీడ్ నుంచి మార్కెటింగ్ వరకు దశలవారీగా యాంటిబయోటిక్స్ అవశేషాలను క్రమం తప్పకుండా పరీక్షించనుంది. ప్రస్తుత సీజన్ నుంచే ఈ కార్యాచరణ అమలు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. యాంటిబయోటిక్స్ పరీక్షలకు అయ్యే వ్యయం రైతులపై పూర్తిగా పడకుండా సమష్టిగా భరించేలా ఏర్పాటు చేస్తోంది.


యాంటిబయోటిక్స్ నియంత్రణే లక్ష్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యాంటిబయోటిక్స్ వినియోగం నూరుశాతం నియంత్రణే లక్ష్యంగా కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఈ కమిటీ రైతుల్లో అవగాహన కల్పించడమే కాదు.. సీడ్ నుంచి పట్టుబడి వరకు దశలవారీగా ప్రతి చెరువులోని రొయ్యలను పరీక్షిస్తుంది.

– వడ్డి రఘురాం, అప్సడా వైస్ చైర్మన్

కమిటీ ఏర్పాటు మంచి ఆలోచన



యాంటిబయోటిక్స్ వినియోగాన్ని నియంత్రించేందుకు ఉమ్మడి కమిటీ ఏర్పాటు చేయడం చాలా మంచి ఆలోచన. యాంటిబయోటిక్స్ లేని రొయ్యలను మాత్రమే ఎగుమతి చేసేందుకు ఇది ఎంతో దోహదపడనుంది.

– ఐ.పి.ఆర్.మోహనరాజు, జాతీయ రొయ్యరైతుల సంఘం అధ్యక్షుడు

తెలంగాణ

ఏపీకి సోమేశ్ కుమార్



- తెలంగాణ సీఎస్‌కు తేల్చి చెప్పిన హైకోర్టు
- ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల కేటాయింపుల్లో కేంద్రానిదే తుది నిర్ణయం
- ఫలానా రాష్ట్రంలోనే పని చేస్తాననడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం
- క్యాట్ ఉత్తర్వులను కొట్టివేసిన ధర్మాసనం.. అప్పీల్ గడువుకు నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సోమేశ్‌కుమార్‌ను రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించినందున అక్కడికే వెళ్లి విధులు నిర్వహించాలని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ మేరకు తెలంగాణలో ఆయన కొనసాగింపును రద్దు చేసింది. సోమేశ్‌కుమార్‌ను తెలంగాణకు కేటాయిస్తూ 2016లో కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. ఆ పరిధి క్యాట్‌కు లేదని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం చేసిన కేటాయింపులను హైకోర్టు సమర్థించింది. అఖిల భారత సర్వీసు అధికారుల కేటాయింపులు, కేడర్ నియంత్రణ, నిర్ణయాధికారం కేంద్రానిదేనన్న వాదనలతో ఏకీభవిస్తున్నట్లు పేర్కొంది. చట్టపరమైన వాటితో పాటు ఇతర అంశాలను క్యాట్ పరిగణలోకి తీసుకోకపోవడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎస్.నందాతో కూడిన ధర్మాసనం మంగళవారం 89 పేజీల తీర్పు వెలువరించింది. అప్పీల్ కోసం తీర్పు అమలును మూడు వారాల పాటు నిలిపివేయాలన్న సోమేశ్‌కుమార్ తరఫు న్యాయవాది విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. అన్ని అంశాలను వివరంగా పరిశీలించిన తర్వాతే తీర్పు ప్రకటిస్తున్నామని స్పష్టం చేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పంపిణీకి సంబంధించి గతంలో 'క్యాట్' జారీ చేసిన ఉత్తర్వులను కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల మంత్రిత్వశాఖ హైకోర్టులో సవాల్ చేసింది. సుదీర్ఘ కాలం ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం గత జూలైలో తీర్పును రిజర్వు చేసిన న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు వెలువరించింది. ఫలానా రాష్ట్రంలోనే పని చేస్తానని చెప్పడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని చెప్పింది. 1989 బ్యాచ్ అధికారి సోమేశ్‌కు, 1990 బ్యాచ్ అధికారి రజత్ భార్గవతో పరస్పర బదిలీ సాధ్యం కాదని కేంద్రం తేల్చి చెప్పిందని తీర్పులో పేర్కొంది.

విభజన నాటి నుంచే వివాదం..

రాష్ట్ర విభజన (2014) నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల పంపిణీలో భాగంగా సోమేశ్‌కుమార్‌ను ఏపీకి కేటాయించారు. దీన్ని సవాల్ చేస్తూ ఆయన క్యాట్‌ను ఆశ్రయించగా తెలంగాణకు కేటాయిస్తూ 2016లో ఉత్తర్వులు జారీ చేసింది. నాటి నుంచి సోమేశ్ తెలంగాణలోనే విధులు నిర్వహిస్తున్నారు. క్యాట్ ఉత్తర్వులను 2017లో కేంద్ర ప్రభుత్వం హైకోర్టులో సవాల్ చేసింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) టి.సూర్యకరణ్‌రెడ్డి, సోమేశ్‌కుమార్ తరఫున సీనియర్ న్యాయవాది డీవీ సీతారాంమూర్తి, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్, ఏపీ తరఫున పి.గోవింద్‌రెడ్డి వాదనలు వినిపించారు. సోమేశ్‌కుమార్‌తో పాటు మరో 14 మంది ఆలిండియా కేడర్ సర్వీస్ అధికారులు క్యాట్ ద్వారా అనుమతి పొంది తెలంగాణలో పని చేస్తుండటం గమనార్హం. వీరందరికీ సంబంధించి కేంద్రం దాఖలు చేసిన పిటిషన్లు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.

28న తెలంగాణకు అమిత్ షా!

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అధినాయకత్వం 'మిషన్ తెలంగాణ'ను టాప్‌గేర్‌లోకి తీసుకెళ్లనుంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్న చిరకాల కోరికను సాధించేందుకు పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తోంది. తెలంగాణతోపాటు ఇతర దక్షిణాది రాష్ట్రాలు, దేశవ్యాప్తంగా బీజేపీ ఇప్పటిదాకా గెలుపొందని, మిత్రపక్షాలకు కేటాయించిన 160 స్థానాలపై బీజేపీ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తెలంగాణ నుంచి మెజారిటీ లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహ ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఈ నెల 19న ప్రధాని మోదీ రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతోపాటు సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ నిష్క్రియాపరత్వాన్ని, వైఫల్యాలను ఎండగట్టనున్నట్లు పార్టీవర్గాల సమాచారం. దీనికి కొనసాగింపుగా ఈ నెల 28న పార్టీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రానికి రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రపార్టీ సంస్థాగతంగా ఏ మేరకు ఎన్నికలకు సన్నద్ధమైందో పరిశీలించనున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ, 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని బూత్ కమిటీలు, మండల, ఇతరస్థాయిల కమిటీల నియామకం తదితర విషయాలపై సమీక్షిస్తారు. అవసరమైతే అమిత్‌షా 29వ తేదీ కూడా ఇక్కడే ఉండే అవకాశం ఉంది. ఈ సందర్భంగా నాలుగేసి లోక్‌సభ నియోజకవర్గాలను కలిపి ఒక క్లస్టర్‌గా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం.

ఫిబ్రవరిలో పొంగులేటి చేరిక?

ఫిబ్రవరి తొలి వారంలో బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరనున్నట్టు పార్టీవర్గాల సమాచారం. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర ముఖ్యనేతల సమక్షంలో ఆయన బీజేపీలో అధికారికంగా చేరేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నాయకత్వంపై నేరుగా విమర్శలు గుప్పించడం, వచ్చే ఎన్నికల్లో తానే కాదు తన అనుయాయులంతా పోటీచేస్తారంటూ తాజాగా పొంగులేటి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరిగిన ఖమ్మం జిల్లా పార్టీ భేటీకి కూడా ఆయన గైర్హాజరైన సంగతి విదితమే. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ నెల 18న ఢిల్లీలో అమిత్‌షా, జేపీ నడ్డా ఇతర ముఖ్య నేతలను పొంగులేటి కలుసుకుంటారని చెబుతున్నారు.

15 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పరిస్థితేంటి?

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించినందున ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆ రాష్ట్రానికే వెళ్లాలని మంగళవారం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉన్నతాధికారుల్లో గుబులు రేపుతోంది. హైకోర్టు ఉత్తర్వులు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ తీర్పుతో మిగిలిన ఉన్నతాధికారులంతా విధిగా ఆయా రాష్ట్రాలకు తిరిగి వెళ్లాల్సిందేనా? అన్న చర్చ సాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తెలంగాణలో పని చేస్తుండగా.. తెలంగాణ రాష్ట్ర కేడర్‌కు కేటాయించిన వారు ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్నారు. రెండు రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన కేడర్‌లలో కాకుండా క్యాట్ ఉత్తర్వులతో కొనసాగుతున్న వారిలో 9 మంది ఐఏఎస్‌లు, ఆరుగురు ఐపీఎస్ అధికారులు ఉన్నారు. ఐపీఎస్‌లకు సంబంధించి ఇటీవలే తెలంగాణ ఇన్‌చార్జి డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అంజనీకుమార్, అడిషనల్ డీజీపీ అభిలాష బిస్త్, అభిలాష్ మహంతిలు ఆంధ్ర కేడర్‌కు చెందిన అధికారులు కాగా.. తెలంగాణలో పనిచేస్తున్నారు. మొన్నటివరకు ఏపీ కేడర్‌కు చెందిన సంతోష్ మెహ్రా తెలంగాణలో పనిచేసినా, ఈ మధ్యనే ఆయన ఏపీ కేడర్‌కు వెళ్లిపోయారు. కాగా తెలంగాణకు కేడర్‌కు కేటాయించిన మనీష్‌కుమార్ సింగ్, అమిత్‌గార్గ్, అతుల్ సింగ్‌లు ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్నారు. ఇక ఈ విధంగా ఐఏఎస్ అధికారుల్లో సోమేశ్‌కుమార్, వాణీప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఎం.ప్రశాంతి, కాటా ఆమ్రపాలి తెలంగాణ కేడర్‌లో పనిచేస్తుండగా అలాగే తెలంగాణ కేడర్‌కు కేటాయించిన హరికిరణ్, శ్రీజన, శివశంకర్‌లు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్నారు.

తెలంగాణ సీఎస్ రేసులో ముగ్గురు!

- శాంతికుమారి, రామకృష్ణారావు, అరవింద్‌కుమార్‌ల్లో ఒకరిని ఎంపిక చేసే అవకాశం
- ప్రస్తుత సీఎస్ సోమేశ్ కుమార్‌ను తెలంగాణ కేడర్ నుంచి రిలీవ్ చేసిన కేంద్రం
- 12లోగా ఏపీ ప్రభుత్వంలో రిపోర్టు చేయాలని ఆదేశం
- హైకోర్టు తీర్పు, కేంద్రం ఆదేశాలతో కొత్త సీఎస్ నియామకం అనివార్యం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌ను ఏపీ కేడర్‌కు వెళ్లాలని మంగళవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో వెనువెంటనే ఆయన్ను తెలంగాణ కేడర్ నుంచి రిలీవ్ చేస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 12లోగా ఏపీ ప్రభుత్వంలో రిపోర్టు చేయాలని ఆయన్ను ఆదేశించింది. దీంతో తెలంగాణలో తక్షణమే కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకం అనివార్యంగా మారింది. అయితే మంగళవారం అర్ధరాత్రి వరకు ఉత్తర్వులు విడుదల కాకపోవడంతో కొత్త సీఎస్ నియామకంపై ఉత్కంఠ నెలకొంది. కాగా కొత్త సీఎస్ రేసులో రాష్ట్ర అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. సీనియారిటీ ప్రకారం చూస్తే.. సీఎస్ రేసులో వసుధా మిశ్రా ముందంజలో ఉంటారు. అయితే డిప్యుటేషన్‌పై యూపీఎస్సీ సెక్రటరీగా మంచి పదవిలో ఉండడం, మరో నెల రోజుల్లో పదవీ విరమణ చేయనుండడంతో ఆమె సీఎస్ పదవికి పోటీలో లేనట్టే. రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదినికి సైతం ఆరు నెలలకి మించి సర్వీసు లేదు. వీరిద్దరి తర్వాత సీనియారిటీ ప్రకారం.. శాంతికుమారి, శశాంక్ గోయల్, సునీల్ శర్మ, రజత్ కుమార్, కె.రామకృష్ణారావు, అశోక్ కుమార్, అరవింద్‌కుమార్ ఉన్నారు. అయితే గతంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసిన శాంతికుమారి, రామకృష్ణారావు, అరవింద్ కుమార్‌ల్లో ఒకరిని సీఎస్‌గా నియమించవచ్చని చర్చ జరుగుతోంది. కాగా హైకోర్టు తీర్పు, కేంద్రం చర్యల నేపథ్యంలో ఇన్‌చార్జి సీఎస్‌ను నియమించాలా ? లేక పూర్తి స్థాయి సీఎస్‌ను నియమించాలా? అనే అంశంపై తెలంగాణ ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్టు సమాచారం. హైకోర్టు తీర్పుపై సోమేశ్ కుమార్ సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్టు తెలిసింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధిస్తే మళ్లీ ఆయన్నే సీఎస్‌గా పునర్నియమించే అవకాశముంది.

క్లుప్తంగా...

ప్రత్యామ్నాయ మార్గాల్లో విద్యుత్ బిల్లులు చెల్లించండి

- వినియోగదారులకు ఏపీసీపీడీసీఎల్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: స్మార్ట్ ఫోన్‌తో క్షణాల్లో నెల వారీ విద్యుత్ బిల్లులు చెల్లించే వెసులుబాటు కల్పించిన ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్)లో ఆ సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో "ఏపీసీపీడీసీఎల్ కన్స్యూమర్ మొబైల్ యాప్, పేటీయం, టీఏ వాలెట్, ఏపీ ఆన్‌లైన్" ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలని వినియోగదారులకు ఏపీసీపీడీసీఎల్ విజ్ఞప్తి చేసింది. కాగా, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్ (యూపీఐ) ద్వారా విద్యుత్ బిల్లులను కట్టించుకుని డిస్కంకు అందజేసే 'బిల్ డెస్క్' కంపెనీ ఇచ్చిన బ్యాంక్ గ్యారంటీ (బీజీ) గడువు తీరిపోవడంతో మరలా కొత్త బీజీ ఇవ్వాల్సిందిగా సెంట్రల్ డిస్కం కోరింది. బిల్ డెస్క్ నుంచి బీజీ అందడంలో జాప్యం కారణంగా బిల్లులు వసూలు చేసేందుకు ఆ కంపెనీకి డిస్కం అనుమతినివ్వలేదు. దీంతో కొద్ది రోజులుగా పలు యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని పలువురు 'సాక్షి' దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై డిస్కం సీఎండీ జె.పద్మాజనార్ధనరెడ్డిని వివరణ కోరగా..బిల్లుల చెల్లింపుల్లో సమస్య తలెత్తిన మాట వాస్తవమేనని, దీనివల్ల ఈ నెల తమకు రావాల్సిన ఆదాయంలో 60% ఆగిపోయిందని చెప్పారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

చింతకాయల విజయ్‌కు షాక్..

టీడీపీ సోషల్ మీడియా సలహాదారుగా పయ్యావుల

సాక్షి, అమరావతి : టీడీపీ సోషల్ మీడియా విభాగం ఇన్‌చార్జిగా ఉన్న చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్‌కు చంద్రబాబు షాక్ ఇచ్చారు. విజయ్ స్థాయిని తగ్గించి ఆయనపై మరో ఇద్దరు నేతలు పయ్యావుల కేశవ్, జీవీ రెడ్డిని సోషల్ మీడియా సలహాదారులుగా నియమించారు. పార్టీలో సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యేగా ఉన్న పయ్యావులకు సోషల్ మీడియా బాధ్యతలు అప్పగించడం ద్వారా విజయ్‌కు చెక్ పెట్టినట్లేనని ప్రచారం జరుగుతోంది. పయ్యావుల నేతృత్వంలో జీవీ రెడ్డికి సోషల్ మీడియా బాధ్యతలు అప్పగించినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. జీవీ రెడ్డి సోషల్ మీడియా విభాగాన్ని నడిపిస్తారని చెబుతున్నారు. విజయ్ ఇకపై కేవలం ఐటీడీపీ బాధ్యతలు మాత్రమే చూస్తూ పయ్యావుల, జీవీ రెడ్డి కింద పని చేయాల్సి ఉంటుందని టీడీపీ నేతలు చెప్పారు.

రంగుల బియ్యం రెడీ

రైతుల కోసం బ్లాక్, రెడ్ రైస్ విత్తనాలు సిద్ధం

- బ్లాక్ రైస్‌లో ఫైబర్, మాంసకృత్తులు అధికం
- రెడ్ రైస్‌లో జింక్, ఐరన్, సూక్ష్మపోషకాలు అధికం
- ఎకరాకు 30 బస్తాలపైనే దిగుబడి
- బాపట్ల వరి పరిశోధన స్థానం సృష్టి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఇప్పటివరకు నల్ల బియ్యం, ఎర్ర బియ్యం అనేవి దేశవాళీ రకాల్లోనే ఉన్నాయి. బర్మా బ్లాక్, కాలాబటీ, మణిపూర్ బ్లాక్ రకాలుగా పిలిచే వీటిని అస్సాం, మణిపూర్, మేఘాలయ తదితర రాష్ట్రాల్లోని రైతులు.. అక్కడక్కడా ఏపీ రైతులు సైతం పండిస్తున్నారు. లావు రకానికి చెందిన ఈ బియ్యాన్ని వండితే అన్నం ముద్దగా ఉంటోంది. ఎకరానికి 10 నుంచి 15 బస్తాలకు మించి దిగుబడి రావటం లేదు. ఎర్ర బియ్యంలో కేరళకు చెందిన నవారా రకం కూడా ఉన్నా.. ఇది ఎకరాకు 10 బస్తాలకు మించి దిగుబడి ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఆర్గానిక్, నేచురల్ ఫార్మింగ్ విధానంలో ఈ రకాలు మన రాష్ట్రంలోనూ అరకొరగా సాగవుతున్నాయి. డిమాండ్ ఉన్నా.. దిగుబడి తక్కువగా ఉండటంతో గిట్టుబాటు కాక రైతులు వీటి సాగు వైపు మొగ్గు చూపటం లేదు. బ్లాక్, రెడ్ రైస్ ధాన్యం పైపొరలో 'యాంతోసైనిన్' అనే పదార్థం ఉండటం వల్ల వాటికి ఆ రంగు వస్తుంది. బియ్యాన్ని పైపొరతో కలిపి తినాలి. వీటిలో ఐరన్, జింక్, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఈ రకాలు లావుగా ఉండి అన్నం ముద్దగా వస్తుండటంతో ప్రజలు తినడానికి పెద్దగా ఇష్టపడటం లేదు.

బాపట్ల శాస్త్రవేత్తల కృషి ఫలించి..

ఈ రెండింటినీ సన్నరకాలుగా ఉత్పత్తి చేస్తే ప్రజలు తినేందుకు ఆసక్తి చూపిస్తారని బాపట్ల వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు భావించారు.



సాగులో ఉన్న బీపీటీ-2858 బ్లాక్ రైస్ పైరు

2019లో పరిశోధనలు చేపట్టి బీపీటీ-2848 రకం బ్లాక్ రైస్‌ను తొలుత సృష్టించారు. దీనిని మినీ కిట్‌గా రైతులకు అందించారు. మూడేళ్లపాటు వెయ్యి కిట్లు ఇచ్చి మినీ కిట్ దశ పూర్తి చేశారు. ఈ బియ్యం అచ్చం బీపీటీ-5204 రకం మాదిరిగా సన్నబియ్యంగానే ఉన్నాయి. ప్రయోగం విజయవంతం కావడంతో బీపీటీ-2841, 3136, 3137, 3145 తదితర రకాలను శాస్త్రవేత్తలు రూపొందించారు. బ్లాక్ రకంలో ఫైబర్, మాంసకృత్తులు అధికంగా ఉండగా.. రెడ్ రైస్‌లో బీపీటీ-2858, 3143, 3182, 3140, 3111, 3507 రకాలను సైతం సృష్టించారు. వీటిలో జింక్, ఐరన్, సూక్ష్మపోషకాలు అధికం. ఈ వంగడాలు అధిక దిగుబడులు ఇవ్వడంతోపాటు ప్రజలకు రోగ నిరోధక శక్తిని పెంచే సామర్థ్యాన్ని ఇస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ విత్తనాలను మూడేళ్లపాటు ప్రయోగాత్మకంగా రైతులకు అందించి నాణ్యతా ప్రమాణాలను పరీక్షించారు. తాజాగా ఈ విత్తనాలకు నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్ (న్యూఢిల్లీ) గుర్తింపు ఇచ్చింది. ఈ ఏడాది ఈ విత్తనాన్ని బాపట్ల వరి పరిశోధన స్థానం పరిధిలోని రైతులతో పాటు ఆసక్తి గల ప్రైవేట్ కంపెనీలకు అందించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు.

బేబీ ఫుడ్‌లా బ్లాక్ రైస్ పౌడర్

బీపీటీ-2848 రకం బ్లాక్ రైస్ పౌడర్ రూపంలో పిల్లలకు బేబీ ఫుడ్‌లా (హార్లిక్స్ తరహాలో) అందించేందుకు వివిధ కంపెనీలు ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఉప్మా రవ్వ, పౌడర్, జావ, పాయసం, కేకులు, అటుకులు, వడియాలు, మరమరాలు, నూడిల్స్, సేమియా తదితర పదార్థాలుగా తయారు చేయాలని బాపట్ల పరిశోధన స్థానం ఇప్పటికే నిర్ణయించింది. ఈ బ్లాక్ రైస్ వంటకాలు తినడం వల్ల చర్మ సౌందర్యం మెరుగుపడటంతోపాటు కళ్ల జబ్బులు పోతాయని, పలు రకాల అనారోగ్య సమస్యలు తొలగుతాయని పరిశోధనలో తేలినట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మరింతగా పోషకాలు



బాపట్ల వరి పరిశోధన స్థానంలో సన్న రకాలుగా రూపొందించిన రెడ్, బ్లాక్ రైస్

సాధారణ రకం వడ్లను పూర్తి స్థాయిలో పాలిష్ పడితే 6 లేదా 7 శాతం మాంసకృత్తులు మాత్రమే ఉంటాయి. అదే కొత్తగా రూపొందించిన బ్లాక్, రెడ్ రైస్‌లో 10.5 శాతం మాంసకృతులు ఉన్నాయి. బీపీటీ-2841 రకంలో అత్యధికంగా 13.7 శాతం ప్రోటీన్లు ఉండటం విశేషం. మొత్తంగా ఈ రకాల్లో టోటల్ ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్ అనే పోషకాలు సాధారణ రకాలతో పోలిస్తే 3 నుంచి 4 రెట్లు అధికం. శరీరంలో ఉత్పత్తి అయ్యే ఫ్రీరాడికల్స్‌ను ఇవి సమతుల్యం చేస్తాయి. దీర్ఘకాలిక రోగాలను ఎదుర్కొనే ఇమ్యూనిటీ ఇస్తాయి. ఇవి ఎకరానికి 30 బస్తాలకు తగ్గకుండా దిగుబడి ఇస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

30 బస్తాలకు తగ్గకుండా దిగుబడి



బాపట్ల వరి పరిశోధన స్థానంలో బ్లాక్, రెడ్ రైస్ వంగడాలను సన్నరకాలుగా ఉత్పత్తి చేశాం. ఇప్పటికే బ్లాక్ రైస్ మినీకిట్ మూడు సంవత్సరాల దశ పూర్తయ్యింది. దీనికి నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్ (న్యూఢిల్లీ) గుర్తింపు ఇచ్చింది. ఎకరాకు 30 బస్తాలకు తగ్గకుండా దిగుబడి వస్తుంది. మనుషుల ఆరోగ్యానికి అత్యంత అనుకూలమైన రకం. చర్మ సౌందర్యంతోపాటు కళ్లకు మంచిదని పరిశోధనలో తేలింది. ఈ ఏడాది నుంచి రైతులతోపాటు ప్రైవేట్ కంపెనీలకు సీడ్ అందజేస్తాం. రెడ్ రైస్ సైతం మొదటి ఏడాది మినీ కిట్ దశ పూర్తయింది. ఆసక్తి ఉన్న రైతులకు ఇవి కూడా అందజేస్తాం.

– బి.కృష్ణవేణి, ప్రధాన శాస్త్రవేత్త, బాపట్ల వరి పరిశోధన స్థానం

టెన్త్ విద్యార్థుల వివరాల సవరణకు ఎడిట్ ఆప్షన్

- అందుబాటులోకి తెచ్చిన ఎస్సెస్సీ బోర్డు
- నేటినుంచి ఈ నెల 20వ తేదీవరకు అవకాశం

సాక్షి, అమరావతి: పదో తరగతి ధ్రువపత్రాల్లో తలెత్తే లోపాలు విద్యార్థులకు ఆ తరువాతి కాలంలో పెద్ద సమస్యగా, ఇబ్బందికరంగా మారుతుంటాయి. చివరి నిమిషంలో వాటిని సరిచేయించేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతుంటారు. టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సంబంధించిన నామినల్ రోల్స్‌లో వారి వివరాలను సరైన రీతిలో పొందుపరచకపోతే అవే పొరపాట్లు ధ్రువపత్రాల్లో నమోదవుతుంటాయి. ఈ సమస్యలకు ముందుగానే చెక్‌పెట్టేలా ఎస్సెస్సీ బోర్డు తాజాగా ఎడిట్ ఆప్షన్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చింది. ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు తమ స్కూలు ద్వారా టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలను సరిచూసుకుని పొరపాట్లు లేకుండా సవరించుకునేందుకు ఈ ఎడిట్ ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చామని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ లాగిన్ నుంచి ఈ ఎడిట్ ఆప్షన్ వినియోగించి నామినల్ రోల్స్‌లోని వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. బుధవారం (నేడు) నుంచి ఈనెల 20వ తేదీవరకు ఈ ఎడిట్ ఆప్షన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆలోగా వివరాలు సరిచూసుకోవాలని ఆయన కోరారు.

సరిచూసుకోవలసిన అంశాలు

- విద్యార్థి పేరు, తండ్రి పేరు, తల్లి పేరు
- పుట్టిన తేదీ
- విద్యార్థి ఎంచుకున్న ఫస్ట్ లాంగ్వేజ్, సెకండ్ లాంగ్వేజ్ కాంబినేషన్
- విద్యార్థి ఎంపిక చేసుకున్న మాధ్యమం
- ఓఎస్సెస్సీ సబ్జెక్టు కోడ్
- వొకేషనల్ ఎస్సెస్సీ సబ్జెక్టు, కోడ్
- విద్యార్థి ఐడెంటిఫికేషన్ చిహ్నాలు (పుట్టుమచ్చలు)
- విద్యార్థి ఫొటో, సంతకం

జేఎన్టీయూ(ఏ)కి ఈఏపీ సెట్ బాధ్యతలు

అమరావతి: రాష్ట్రంలో పలు ఉన్నత విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను వివిధ వర్సిటీలకు అప్పగిస్తూ ఉన్నత విద్యామండలి మంగళవారం ప్రకటన విడుదల చేసింది. 2023-24 విద్యాసంవత్సరానికి ఆయా ప్రవేశ పరీక్షల నిర్వహణకు వర్సిటీలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి ఖరారు చేశారు. ఏపీ ఈఏపీ సెట్‌ను ఈసారి కూడా అనంతపురం జేఎన్‌టీయూకి అప్పగించారు. సెట్ల వారీగా వర్సిటీలు, కన్వీనర్లు ఇలా...

సెట్	వర్సిటీ	కన్వీనర్
ఈఏపీసెట్	జేఎన్టీయూ(ఏ)	సి.శోభా బిందు
ఈసెట్	జేఎన్టీయూ(కే)	ఎ.కృష్ణ మోహన్
పీజీఈసెట్	ఎస్వీయూ,తిరుపతి	ఆర్వీఎస్ సత్యనారాయణ
ఐసెట్	అనంతపురం ఎస్కే వర్సిటీ	పి.మురళీకృష్ణ
ఎడ్‌సెట్	ఆంధ్రా వర్సిటీ విశాఖ	కె.రాజేంద్రప్రసాద్
లాసెట్	నాగార్జున వర్సిటీ, గుంటూరు	బి.హరిబాబు
పీఈసెట్	నాగార్జున వర్సిటీ, గుంటూరు	పీపీఎస్ పాల్‌కుమార్
పీజీసెట్	ఆంధ్రా వర్సిటీ, విశాఖ	ఎన్.రమణయ్య
ఆర్‌సెట్	ఎస్వీయూ, తిరుపతి	బి.దేవప్రసాద్ రాజు
ఏడీసెట్	వైఎస్సార్ఏఎఫ్‌యూ కడప	ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి

చిరుధాన్యాలపై అవగాహన

- సాగు, వినియోగం పెంచేలా ఏడాది పొడవునా కార్యక్రమాలు
- ఫిబ్రవరి 15వ తేదీలోగా రబీ ఈ-క్రాప్ పూర్తి చేయాలి
- డీపీఎంసీ ద్వారా యంత్రపరికరాల సూచిక ధరలు ఖరారు
- వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు



సాక్షి, అమరావతి: ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినందున ఏడాది పొడవునా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ చెప్పారు. అందుకు తగినట్టుగా 100 హెక్టార్లకు ఒకటి చొప్పున పంటల వారీగా క్లస్టర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన మంగళవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణనిస్తూ, భవిష్యత్‌లో మంచి ధర లభించేలా కృషిచేయాలన్నారు. వైఎస్సార్ యంత్ర సేవాకేంద్రాల ఏర్పాటు కోసం జిల్లాల్లోని జిల్లా పర్చేజింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీపీఎంసీ) ద్వారా యంత్ర పరికరాల సూచిక ధరలను ఖరారు చేయాలని చెప్పారు. పీఎం కిసాన్ 13వ విడత ఆర్థికసాయాన్ని సాధ్యమైనంత ఎక్కువమందికి అందించేందుకు వీలుగా రైతుల ఈ-కేవైసీని ఈ నెల 15వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు. రబీలో సాగుచేసి కోతకు వచ్చే శనగలు, మినుములు, పెసలు, ఇతర పంటల ఈ-క్రాప్ నమోదు, ఈ-కేవైసీ త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావం ఉన్న ప్రకాశం, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ఈ నెల 30వ తేదీలోగా, మిగిలిన జిల్లాల్లో 15వ తేదీలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

స్థానిక వార్తలు

ముగిసిన ఎస్‌సీఆర్ స్పోర్ట్స్ మీట్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లో ఈ నెల 6 నుంచి 8 వరకు జరిగిన ఎస్సీఆర్ రైల్వే స్పోర్ట్ మీట్‌లో గుంతకల్లు, విజయవాడ డివిజన్ ఉద్యోగులు సత్తా చాటారు. టెన్నిస్ సింగిల్స్‌లో గుంతకల్లు డివిజన్ డీసీఎం కె.రాజేంద్రప్రసాద్ మొదటిస్థానంలోను, హైదరాబాద్ డివిజన్ ఏపీఓ షేక్ పీర్‌బాబు రెండో స్థానంలో నిలిచారు. టెన్నిస్ డబుల్స్‌లో విజయవాడ డివిజన్‌కు చెందిన డీఈఎన్ పీవీవీ నాయుడు, డీఎఫ్ఎం సుధాకర్‌లు రెండస్థానం సాధించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా విజేతలు బహుమతులు అందుకున్నారు.



ఎస్సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ నుంచి బహుమతి అందుకుంటున్న డీసీఎం రాజేంద్రప్రసాద్

బుట్ట బెల్లానికి భలే డిమాండ్



నందిగామలో బుట్ట బెల్లం కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

సంక్రాంతి పండుగంటే.. టక్కున గుర్తొచ్చేవి రంగ వల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులే కాదు.. పిండి వంటలు కూడా. సంక్రాంతికి అల్లుళ్ల రాక పరిపాటి. దీంతో వారి కోసం అనేక రకాల తినుబండారాలు తయారు చేసే వారు. ఆ సంస్కృతి నేటికీ కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా అరిసెలు, జంతికలు ఎక్కువగా తయారు చేస్తారు. అరిసెల్లోకి ఎక్కువ మంది బుట్ట బెల్లాన్నే వాడుతుంటారు. తాతల కాలం నుంచి ఇది కొనసాగుతూనే ఉంది. ఈ బుట్ట బెల్లం తూర్పుగోదావరి జిల్లా నుంచి అన్ని ప్రాంతాలకు సరఫరా అవుతుంది. బుట్ట బెల్లంతోపాటు ఆర్గానిక్ బెల్లం, సాధారణ బెల్లం మనకు నిత్యం అందుబాటులో ఉంటాయి. సాధారణ బెల్లం ధర కేజీ రూ. 45 వరకు ఉండగా, బుట్ట బెల్లం ధర మాత్రం రూ. 55 నుంచి నాణ్యతను బట్టి రూ. 60 వరకూ విక్రయిస్తున్నారు. – నందిగామ

వివిధ సంస్థలతో ఎన్జీరంగా వర్సిటీ అవగాహన

గుంటూరు రూరల్: విశ్వవిద్యాలయం పరిధిలో విద్య, పరిశోధన, విస్తరణ, శిక్షణ రంగాల్లో అభివృద్ధి కోసం పలు సంస్థలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకోవటం జరిగిందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంనందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ న్యూఢిల్లీకి చెందిన ధనూకా అగ్రిటెక్ సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు. అదేవిధంగా విశాఖపట్నంకు చెందిన గాయత్రి విద్యా పరిషత్‌తో గిరిజన వ్యవసాయ పద్ధతులు గురించి, ముంబయికి చెందిన రిలయన్స్ ఫౌండేషన్‌తో విస్తరణ, డిజిటల్ సొల్యూషన్స్ అనే అంశాలపై పరస్పర అవగాహన ఒప్పందాలను చేసుకోవటం జరిగిందన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి, డీన్‌లు డాక్టర్ ఎ.ప్రతాప్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన పోలీసుల సంక్రాంతి సంబరాలు

కోనేరు సెంటర్(మచిలీపట్నం): కృష్ణాజిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఎస్పీ పి. జాషువా దంపతులు అతిథులుగా పాల్గొన్నారు. కొత్త అల్లుళ్ల అలకలు, డూడూ బసవన్నల నృత్యాలు, పొంగళ్లు, భోగిమంటలు, భోగిపళ్లు పోయటం వంటి కార్యక్రమాలతో జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్ మంగళవారం రాత్రి కోలాహలంగా మారింది. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సంప్రదాయబద్ధంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్పీ దంపతులను వేద పండితులు పూర్ణకుంభంతో డూడూ బసవన్నల నృత్యాలతో సాదరంగా కార్యక్రమానికి ఆహ్వానించారు. గ్రౌండ్‌లో పిండివంటలు, పండ్ల దుకాణాలు, చెరకు దుకాణాలు, చిన్నారులకు తినుబండారాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఈ వేడుకలో విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ స్టాళ్లను ఎస్పీ దంపతులు తిలకించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఎస్పీతో పాటు జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది తిలకించారు. పోలీసుశాఖలోని పలువురు అధికారులు ప్రదర్శించిన కొత్త అల్లుళ్లు స్కిప్ట్ ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. కోలాటం, చిన్నారుల వేషధారణ పోటీలు ఆద్యంతం అలరించాయి. అధికారుల సమక్షంలో ఎస్పీ దంపతులు భోగిమంటలు వేసి అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

సంతోషంగా గడపండి..

ఎస్పీ మాట్లాడుతూ విధినిర్వహణలో నిత్యం సతమతం అయ్యే పోలీసులు తమ కుటుంబాలతో సంతోషంగా గడిపేందుకు సమయం తక్కువగా ఉంటుందన్నారు. ఇలాంటి వేడుకల్లో ఒత్తిళ్లను వదిలి కుటుంబాలతో సరదాగా, సంతోషంగా గడపాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన పోలీసులకు ఎస్పీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్. వెంకటరామాంజనేయులు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీలు మాసూంబాషా, మహబూబ్‌బాషా, సత్యానందం, విజయపాల్, రమేష్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు కుటుంబాలు పాల్గొన్నాయి.

దివ్యబలి పూజ ప్రాధాన్యం తెలుసుకోవాలి



తంబి చిత్రపటానికి ధూపం వేస్తున్న ఫాదర్ జాన్ దేవిడ్

ఉంగుటూరు(గన్నవరం): క్రైస్తవ జీవితంలో అతి ముఖ్యమైనది ప్రార్థన, దివ్య పూజాబలి అని కర్నూలు మేత్రాసనం ఆదోని ఫాదర్ జాన్ డేవిడ్ అన్నారు. పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్‌తంబి 78వ వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా కొనసాగుతున్న నవదిన ప్రార్థనలు మంగళవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మత గురువులు దివ్యపూజా బలిని సమర్పించి, దివ్య బలిపూజ ప్రాముఖ్యతను వివరించారు. ప్రార్థన దేవునితో సాన్నిహిత్యాన్ని పెంచుతుందని అన్నారు. జోసఫ్ తంబి దివ్యబలి పూజ పట్ల అత్యంత భక్తిని కలిగి జీవించారన్నారు. కార్యక్రమంలో పలువురు గురువులు, విశ్వాసులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల సేవలు ఎంతో అవసరం

ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: పూర్వ విద్యార్థుల విలువైన సేవలు యూనివర్సిటీకి ఎంతో అవసరమని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. యూనివర్సిటీలో మంగళవారం జరిగిన యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల ఎగ్జిక్యూటివ్ సమావేశంలో వీసీ అధ్యక్షోపన్యాసం చేస్తూ పూర్వ విద్యార్థులు యూనివర్సిటీలో అంతర్భాగమన్నారు. ప్రస్తుతం ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న మెషిన్ లెర్నింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డ్రోన్ టెక్నాలజీల వంటి అత్యాధునిక విషయపరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందజేయడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థులు కృషి చేయాలన్నారు. పూర్వ విద్యార్థుల సంఘాన్ని క్రియాశీలం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశ్వవిద్యాలయం తరఫున ఇంక్యుబేటర్ సెంటర్‌ను ప్రారంభించడానికి కావలసిన మౌలిక వసతులను విశ్వవిద్యాలయం కల్పిస్తుందని యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించడానికి వారికి కావలసిన సాంకేతిక విషయ పరిజ్ఞానాన్ని అందివ్వటానికి పూర్వ విద్యార్థుల ముందుకు రావాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల డేటాను సమీకరించి విశ్వవిద్యాలయంలో జరుగుతున్న నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలను వారికి ఎప్పటికప్పుడు చేరవేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంఘ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, ఎయిర్ వైస్ మార్షల్ జె.రాజేంద్ర ఆన్‌లైన్‌లో సమావేశానికి హాజరయ్యారు.

డిగ్రీ విద్యలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపర్చాలి

- నాక్ గుర్తింపు కోసం పోటీ పడాలి
- కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్



మాట్లాడుతున్న కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ విద్యలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు యాజమాన్యాలు కృషి చేయాలని కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. గుంటూరులోని జేకేసీ కళాశాలలో మంగళవారం గుంటూరు, విజయవాడ, నెల్లూరు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ సమన్వయకర్తలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలా భాస్కర్ మాట్లాడుతూ కళాశాలలకు విద్యార్థులు రెగ్యులర్‌గా హాజరయ్యే విధంగా చూడటంతో పాటు పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం, ఫలితాలపై శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. కళాశాలల్లో బోధన, ప్రయోగశాలలు, వసతులను అభివృద్ధి పరచుకుని నేషనల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) గుర్తింపు కోసం పోటీ పడాలని సూచించారు. కళాశాలల ప్రగతికి నాక్ ఇచ్చే గుర్తింపు ఎంతో కీలకమని, విద్యాసంస్థ ప్రగతికి ఇది చిహ్నమని చెప్పారు. విద్యాబోధనలో నాణ్యతా ప్రమాణాలను మరింతగా పెంచాల్సిన అవసరముందని, అధ్యాపకులు సైతం ఉన్నత విద్యావంతులుగా ఉండాలన్నారు. సమాజంలో చోటు చేసుకుంటున్న విషయాలను గమనిస్తూ, మార్పుకు తగిన విధంగా నిరంతర అధ్యయనం ద్వారా బోధన పటిమను అభివృద్ధి పరచుకోవాలని అధ్యాపకులకు సూచించారు.

13న దక్షిణాది రాష్ట్రాల గొర్రెపొట్టేళ్ల పోటీలు

రేపల్లె: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పెనుమూడి హైవే సమీపంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంక్రాంతి సంబరాల వాల్‌పోస్టర్‌లను మంగళవారం ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా 13వ తేదీ దక్షిణాది రాష్ట్రాల గొర్రె పొట్టేళ్ల పందెపు పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ట్రాక్టర్ రివర్స్ పోటీలు జరుపుతామన్నారు. గొర్రెల పందెపు పోటీలలో ప్రథమ బహుమతి, రూ.1,01,116, ద్వితీయ బహుమతి రూ.51,116, తృతీయ బహుమతిగా రూ.31,116లు అందజేస్తామన్నారు. అదేవిధంగా నాటుజాతి గొర్రె పోటీలలో ప్రథమ బహుమతి రూ.51,116, ద్వితీయ బహుమతి రూ.31,116లు, తృతీయ బహుమతి రూ.21,116లు అందిస్తామన్నారు.

అండా దండా 'ఐవీఎం'

- నాలుగేళ్ల వయసులో ఆశ్రమంలో చేరిన బాలికకు అన్నీ తామైన సంస్థ
- ఉన్నత చదువు చదివించడంతో పాటు పెళ్లి చేసిన నిర్వాహకులు



గీత వివాహ వేడుకలో ఐవీఎం నిర్వాహకులు వేములపల్లి సురేష్,రోజా దంపతులు

చల్లపల్లి(అవనిగడ్డ): భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ గృహిణికి.. ఇద్దరు బిడ్డలను పోషించడం కష్టమైంది.. ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఆమెకు చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సంస్థ అండగా నిలిచింది. ఆ సంస్థ నిర్వహిస్తున్న పిల్లల హోంలో ఇద్దరు బిడ్డలను ఉంచింది. వారు అక్కడే సంస్థ ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివారు. అలాగే వారిలో ఒకరికి ఇప్పుడు ఆ సంస్థ తరఫునే ఘనంగా పెళ్లి కూడా చేశారు.. వివరాలు ఇవి..

నాలుగేళ్ల వయసులోనే..

మోపిదేవికి చెందిన దోనవల్లి కామేశ్వరరావు 2005లో ఆకస్మిక మృతి చెందటంతో అతని భార్య రమణ కుమారి ఒంటరి అయ్యారు. కుమారుడు, కుమార్తెతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ఆమె మేనమామ ఇద్దరు పిల్లలను చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ఇండియా విలేజ్ మినిస్ట్రీస్(ఐవీఎం) డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ – రోజా దంపతులు నిర్వహిస్తున్న అనాథ పిల్లల హోంలో చేర్చారు. నాటి నుంచి రమణ కుమారి పిల్లలు మనోజ్, గీతలకు ఐవీఎం సురేష్ వసతి, విద్యకు తోడ్పాటునందించారు. గీత ఉన్నత విద్యనభ్యసించి ఇటీవల బీ.టెక్ పూర్తి చేసింది. నాలుగేళ్ల వయసులో హోంలో చేరి పదిహేడున్నర సంవత్సరాలుగా అక్కడే ఉంటూ మంచి విద్యావంతురాలైన గీతకు ఐవీఎం నిర్వాహకులు మంచి సంబంధం కూడా చూశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగితో మంగళవారం ఐవీఎం హోంలోనే తమ సొంత ఖర్చులతో గీతకు వివాహం ఘనంగా జరిపించారు. ఎంపీపీ కోట విజయ రాధిక, ఎంపీడీఓ కేవీ సుబ్బారావు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పండగ వేళ





ఫోటో: ఎస్.కె.రియాజుద్దీన్, ఏలూరు

ఊరికి కాంతి సంక్రాంతి

'ఊరెళ్లాలి'
సంక్రాంతికి తెలుగువారి
తలపుల్లోకి వచ్చే మాట అది.
ఊరంటే?
చిన్నప్పటి స్నేహితులు.
దగ్గరి బంధువులు.
తిరుగాడిన వీధులు.
నేర్చుకున్న పాఠాలు.
మరపురాని జ్ఞాపకాలు.
సంవత్సరానికి ఒకసారి
ఊరితో ఉన్న ముడిని
గుర్తు చేసే పండగ సంక్రాంతి.
మనకో ఊరు ఉంది
అనే భావనతో
సంతోషాన్ని ఇచ్చే పండగ
సంక్రాంతి.
ఊరెళదామా?
ఆ తలపులతో పండగకు
ఉత్సాహంగా సిద్ధమవుదామా?

ఉన్న ఊరు... కన్నతల్లి అన్నారు. ఉన్న వూళ్లోనే కన్నతల్లితో కలిసి ఉండే అదృష్టం ఇప్పుడు అందరికీ లేదు. ఉద్యోగాల కోసం ఉపాధి కోసం ఊరు వదలాలి. వెళ్లాలి. బతకాలి. ఎదగాలి. కాని ఊరితో బొడ్డుపేగు బంధాన్ని కాపాడుకోవాలి. అందుకు సంక్రాంతి ఒక వారధి. 'పండక్కు ఊరికి రా' అని పిలిచే ఏకైక పండగ సంక్రాంతి. కారణం? అది ఆకుపచ్చ పండగ. పల్లీయుల పండగ. పంట చేతికొచ్చాక వచ్చే పండుగ. పశువులకు కృతజ్ఞత పలకాల్సిన పండగ. అయినవారిని కలుసుకోవాల్సిన పండగ. పంటలు, పశువులు పట్టణాల్లో, నగరాల్లో ఉంటాయా? పల్లెల్లో ఉంటాయి. ఊళ్లల్లో ఉంటాయి. అందుకే సంక్రాంతికి ఊరికెళ్లాలనిపిస్తుంది. నాదైన నేల మీద, నా వాళ్ల మధ్యలో, నా పూర్వీకులు పీల్చి వదిలిన గాలిలో నేనూ కాసిన్ని రోజులు గడపాలి అనిపించేలా చేస్తుంది సంక్రాంతి.

రైతు రక్తం

ఇప్పుడు కలెక్టరైనా, సాఫ్ట్‌వేర్ ఇంజనీరైనా మూడు నాలుగు తరాలు వెనక్కు వెళితే వ్యవసాయమే కనిపిస్తుంది. భారతీయులు వందల తరాలు వ్యవసాయదారులుగానే ఉన్నారు. అందరిలోనూ తవ్వుకుంటూ వెళితే కుల మతాలకు అతీతంగా వ్యవసాయమే కనిపిస్తుంది. సంక్రాంతికి ఆ రక్తబంధం జాగృతం అవుతుంది. అందుకే సంక్రాంతికి ఊరి మీద ధ్యాస మళ్లుతుంది. బండ్లకెత్తుకుని నడిచే వడ్ల బస్తాలు, నిండిన గాదెలు, చేతిలో తిరుగాడే దుడ్లు, నేతి గిన్నెలు, పెరళ్లలో విరగ్గాసే తీగలు, రెక్క విప్పే బంతిపూలు.... పల్లెటూళ్లు తమ వారిని ఆహ్వానించే మూడ్‌లో ఉంటాయి. ఉల్లాసంగా ఉంటాయి. అతిథి వస్తే ఆనందించేలా ఉంటాయి. ఆదరిద్దామనుకుంటాయి. అందుకని అందరూ ఊరికెళదామనుకుంటారు. కొత్త అల్లుడు వస్తాడు. కూతురు కళకళలాడుతూ తిరుగుతుంది. కొడుకు కోడలు కారు బయట పార్కు చేసేసి దిగుతారు. పిల్లలు అరుగులు ఎక్కి దుముకుతారు. వీధులు ముగ్గులతో స్వాగతం పలుకుతాయి. పళ్ల కింద నలగడానికి చెరుగు గడలు తీపి నింపుకుంటాయి. చలిమంటల్లో తాటాకులు చిటాచిటా మండుతాయి. ఆ మంటల్లో తాటి పండ్లను కాల్చి తింటే అద్భుతంగా ఉంటాయి. మాటల్లో నవ్వులు పువ్వులు పూస్తాయి. ఇవన్నీ ఊరిలో సంక్రాంతి సమయంలోనే సొంతం. అందుకే ఊరికే వెళ్లాలనిపిస్తుంది.

ఇంటి దేవత

ఇప్పటికీ చాలా కుటుంబాలకు ఇంటి దేవతలు ఉంటారు. గ్రామ దేవతలు ప్రతి ఊరికీ ఎలాగూ ఉంటారు. సంక్రాంతి నాడు ఇంటి వాళ్లంతా కలిసి ఇంటి దేవతకు నైవేద్యాలు పెట్టుకోవాలి. ఆడపిల్లకు కొత్త బట్టలు పెట్టాలి. అందుకోసం అందరూ కలవాలి. వరుసలు పిల్లలకు తెలపాలి. కొత్త బంధాలు వేసుకోవాలి. వీరు ఫలానా వారు ఫలానా అనుకుంటే వీరంతా మన బలగం అనుకుంటే మనిషికి సంతోషం. ఇక ఊరి దేవత దగ్గర ఊరంతా కలుస్తుంది. చిన్నప్పటి నుంచి చూసిన వారంతా కలుస్తారు. ఎలా ఉన్నావు అంటే ఎలా ఉన్నావు అనుకుంటారు. పగలంతా హరిదాసు, కొమ్మదాసు, జంగమ దేవరలు, గంగిరెద్దులవాళ్ల పలకరింపులు. పిట్టల దొరల ప్రేలాపనలు. కోడి పందేల దగ్గర సత్తా చాటుకోవడాలు. ఎగిరే గాలిపటాలు. రాత్రయితే ఊరి గుడి దగ్గర వినోద కార్యక్రమాలు. బతుకు సంబరంగా గడవడం అంటే ఏమిటో సంక్రాంతి చూపుతుంది. అందుకే ఊరెళ్లాలనిపిస్తుంది.

ఇచ్చే చేయి

సంక్రాంతి వస్తే అమ్మది ఇచ్చే చేయి అవుతుంది. సంక్రాంతి పండగ ఇనాములు, నజరానాలు ఇచ్చే పండగ. మేర పంచే పండగ. ఇంటి పెద్ద దర్పంగా కూచుని ఇవన్నీ తమకు సేవ చేసే వారికి, తమ మీద ఆధారపడ్డవారికి ఇంటి మహాలక్ష్మి చేతి మీదుగా ఇప్పించడం ఆనవాయితీ. ఇరుగు పొరుగూ వారికి పిండి వంటలు పంచడం కూడా అమ్మ పనే. పిల్లల స్థితిగతులను గమనించే అమ్మ తాను ఇవ్వాలనుకున్న సంతానానికి గుట్టుగా కొంత ముట్ట జెప్పేది ఈ సమయంలోనే. ముగ్గులు వేస్తూ ఇంటి ఆడవాళ్లంతా చెప్పుకోవాల్సిన ముచ్చట్లన్నీ తనివితీరా చెప్పుకుంటారు. గొబ్బెమ్మ పాటలు పాడుతూ గౌరమ్మ దయ తమ కుటుంబాల మీద ఉండాలని కోరుకుంటారు. కొత్తబట్టల్లో వారంతా మెరిసిపోతారు. సంక్రాంతి వల్ల వారంతా కొత్త ఊపిరి నింపుకుంటారు.

పాతది దగ్ధం చేసి కొత్త వెలుతురులోకి

భోగి నాడు పాత వస్తువులన్నింటిని దగ్ధం చేయడం ఆనవాయితీ. ఇక్కడ పాతవి అంటే వస్తువులని మాత్రమే కాదు. పాత ఫిర్యాదులు, అభ్యంతరాలు, తగాదాలు, మాట పట్టింపులు, అలకలు, మూతి విరుపులు, దూరాలు... వీటన్నింటినీ దగ్ధం చేయాలి. కుటుంబంలో బంధువర్గంలో అందరూ మళ్లీ కలిసిపోయి సమ్యక్ క్రాంతి అంటే చక్కటి కాంతిని తెచ్చే ఉత్తరాయణంలోకి అడుగు పెట్టమని కూడా సంక్రాంతి సందేశం ఇస్తుంది. మనిషి ఎక్కడ తిరిగినా తన నేల మీద తన బంధాన్ని కోల్పోకూడదు. ఎంత దూరంగా ఉన్నా తనవారితో బంధాన్ని కోల్పోకూడదు. ఈ రెంటినీ సంక్రాంతి నాడు సజీవం చేసుకుని ముందుకు సాగమని కోరుతుంది సంక్రాంతి. అందుకే ఊరెళదామని కోరిక నింపుతుందా పండుగ.

ట్రైన్‌లు, బస్సులు, కార్లు... ఏవీ సరిపోవు పండక్కు ఊరెళ్లడానికి.

కాని ఏమైనా సరే ఊర్లో తీరుతాడు తెలుగువాడు సంక్రాంతికి.

లీవ్ ఈసరికే ఓకే అయి ఉంటుంది.

సూట్‌కేసులు సర్దేశారా.

ప్రకాశవంతమైన చర్మం కోసం...

- తాజా నిమ్మరసం చర్మం రంగును మెరుగుపరచడానికి బాగా ఉపయోగపడుతుంది. ఒక టీ స్పూను తాజా నిమ్మరసం, రెండు టీ స్పూన్లు కీరా జ్యూస్, ఆలివ్ ఆయిల్ మూడు టీ స్పూన్లు తీసుకుని మూడింటినీ కలుపుకోవాలి. ముందుగా నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుని ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని అప్లై చేయాలి. వేళ్ళతో నెమ్మదిగా రబ్ చేయాలి. ఆ తర్వాత సబ్బుతో కడిగేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికే కాకుండా శరీరమంతా కూడా అప్లై చేసుకోవచ్చు. స్నానానికి వెళ్ళే ముందు ఈ చిట్కా పాటిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇలా ప్రతిరోజూ స్నానానికి ముందు చేయడం వల్ల మీ చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా తయారవుతుంది.
- అర టీస్పూన్ గంధపు పొడిలో తగినంత రోజ్ వాటర్ కలిపి ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా మూడు రోజులకోసారి చేస్తూ వుంటే ముడతలు తగ్గడంతో పాటు ముఖ కాంతి మెరుగుపడుతుంది.



నల్లమచ్చల నివారణకు...

- నాలుగు తులసి ఆకులు, పావు టీస్పూన్ పసుపు కలిపి పేస్ట్ చెయ్యాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి15 నిమిషాలు ఉంచి కడిగేయాలి.
- అరచేతిలో టీ స్పూన్ తేనె తీసుకుని రెండు రేకల కుంకుమ పువ్వుని వేసి రంగరించాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, 15 నిమిషాల తరువాత కడిగేయాలి. ఇలా చేస్తే క్రమంగా నల్ల మచ్చలు తగ్గుముఖం పడతాయి.

రీ యూజబుల్

పాతవే ..కొత్తగా!

డ్రెస్‌కు తగిన షూ, చెప్పల్స్ వాడటం ఈ రోజుల్లో ఫ్యాషన్. రోజూ సాధారణంగా ధరించేవైనా ఒక్కొక్కరికి రెండు మూడు జతల షూస్ ఉంటాయి. పాతగా అయినా, పిల్లలకు బిగుతుగా అనిపించినవాటినైనా పక్కన పడేయడం చాలా సాధారణంగా చేసే పని. అయితే బెంగళూరు విద్యార్థి సియా మాత్రం కొత్తగా ఆలోచించింది. కాలనీలు తిరిగి పాత చెప్పులను సేకరించి, వాటిని బాగు చేసి, మరీ పేదవారికి పంచుతుంది. ఇలా ఇప్పటి వరకు వేలమందికి సహాయం చేసింది.







బెంగళూరులోని కోరమంగళలో ఉంటున్న సియా ఇంటి చుట్టూ భవన నిర్మాణ పనులు జరుగుతుండేవి. అక్కడ పనిచేసే భవన నిర్మాణ కార్మికులు, వారి పిల్లలు చెప్పులు లేకుండా పరిగెత్తడం సియాను బాధించేది. ఓ రోజు ఇంటికి వచ్చే దారిలో పిల్లల పాదాలను చూసింది, వారి పాదాలకు పగుళ్ల ఉన్నాయని గమనించిన ఆమె, వారికి చెప్పులను తెచ్చివ్వడానికి తన ఇంటికి పరిగెత్తింది.

సోల్ వారియర్... అక్కణ్ణుంచి ఇరుగింటి వారిని, పొరుగింటి వారిని అడిగింది. చాలా చెప్పులనే సేకరించింది. ఆ తర్వాత కూతురి తపన చూసిన ఆమె తల్లిదండ్రులు కూడా తమకు తెలిసిన వారిని అడిగి చెప్పులను సేకరించేవారు. అక్కణ్ణుంచి వాలంటీర్లు వచ్చి జత కలిశారు. ఫలితంగా కొన్ని వేల జతల చెప్పులు వచ్చి చేరాయి. ఆ విధంగా 2019లో 'సోల్ వారియర్' పేరుతో ఒక ఎన్జీవోను ప్రారంభించింది.

పునరుద్ధరణ... పాదరక్షలను సేకరించడం, వాటిని స్వచ్ఛందంగా పునరుద్ధరించడం ఒక ఉద్యమంలా మొదలుపెట్టింది సియా. బాగు చేసిన చెప్పులను పేదవారికి అందిస్తూ వచ్చింది. ఇప్పటి వరకు 15,000 జతల చెప్పులను బాగు చేసి, పేదలకు పంచింది. 'అధిక జనాభాను ప్రభావితం చేసే పరిష్కారం కనుక్కోవడం చాలా ముఖ్యం. సోల్ వారియర్స్‌తో నేను అదే పనిచేశాను' అంటుంది సియా.

గ్రూపులుగా సేకరణ... సొంతంగా పోస్టర్లను తయారు చేయం, వాట్సప్ గ్రూప్‌లలో వాలంటీర్లతో సమన్వయం చేసుకోవడం వరకు అన్నీ పర్యవేక్షిస్తుంది సియా. ఒక నెలలో దాదాపు 500 జతల పాదరక్షలను సేకరించగలిగింది. ఈ వార్త వేగంగా వ్యాప్తి చెందడంతో ఎక్కువ మంది వ్యక్తులు విరాళం ఇవ్వడానికి వచ్చేవారు. ఈ విషయంలో సహాయం చేయడానికి వాలంటీర్లు ముందుకు వచ్చారు.

విస్తరణ... బెంగళూరులో ఈ మిషన్ విజయవంతమైన తర్వాత ఇప్పుడు ముంబై, చెన్నై నగరాలకూ పాత పాదరక్షల సేకరణ విస్తరించింది. దీంతో చెప్పుల సేకరణ వేగం పెరిగి, వేల జతలు వచ్చి చేరుతున్నాయి.

అవార్డులు... సియా చేస్తున్న ఈ పనిని ప్రిన్సెస్ డయానా అవార్డునూ, డయానా లెగసీ అవార్డును వెంట వెంటనే పొందింది. దీని తర్వాత ఆమె తన పనిని అమెరికా, పశ్చిమ ఆఫ్రికాలకూ విస్తరించనుంది. 'ఒకరు మరొకరికి ఇలా సహాయం చేస్తే పేద పిల్లలు ఎవరూ చెప్పులు లేకుండా స్కూల్‌కు వెళ్లరు. పాదాలకు వచ్చే సమస్యలు దరి చేరవు' అని చెబుతోంది సియా.

ముగ్గు - ముచ్చట

చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com
(మీ ఊరి పేరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)





ఎం. సుమలత
జహీరాబాద్
17 చుక్కలు, 7 వరుసలు
7 వచ్చే వరకు, వరుస చుక్క





యర్ర పద్మావతి
పురంధరపురం
నెల్లూరు జిల్లా
15 చుక్కలు, 3 వరుసలు
3 వచ్చే వరకు, సరి చుక్క





బి. యమునా రాణి
న్యూమీర్జాలగూడ
మల్కాజిగిరి
15 చుక్కలు
15 వరుసలు





తేజస్విని
తాండూర్, వికారాబాద్
31 చుక్కలు, 16 వచ్చే వరకు
మధ్య చుక్క





భాగ్యలక్ష్మి
కిసాన్ నగర్, మహబూబ్‌నగర్
18 చుక్కలు, 2 వరుసలు
2 వచ్చే వరకు, సరి చుక్క

యూత్ పల్స్

రెడీ...సెట్...ప్లే

వికాసం నుంచి విజ్ఞానం వరకు

జ్ఞాపక శక్తికి పదునుపెట్టుకోవడానికి, పదసంపదను పెంచుకోవడానికి, సమస్యల పరిష్కారం విషయంలో బహుముఖ ప్రజ్ఞను సొంతం చేసుకోవడానికి రకరకాల డిజిటల్ బ్రెయిన్ గేమ్స్‌పై యువతరం ఆసక్తి ప్రదర్శిస్తుంది...

బెంగళూరుకు చెందిన సహజకు చిన్న చిన్న రచనలు చేయడం అంటే ఇష్టం. భవిష్యత్‌లో రచయిత్రిగా పేరు తెచ్చుకోవాలనేది తన కోరిక. ఒక పుస్తకం ఆదరణ పొందాలంటే కాన్సెప్ట్‌తో పాటు భాష కూడా బాగుండాలి అనేది పద్దెనిమిది సంవత్సరాల సహజకు తెలియని విషయమేమీ కాదు. అందుకే తన పదసంపదను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. దీని కోసం 'వొకాబులరీ బిల్డర్' అనే గేమ్ యాప్‌ను సాధనంగా ఎంచుకుంది.

కాల్పనిక రచనల కోసం మాత్రమే కాదు, ఆకట్టుకునే భాషలో ఇ-మెయిల్స్ రాయడానికి, రకరకాల విషయాలపై వ్యాసాలు రాయడానికి యువతరం 'వొకాబులరీ బిల్డర్'ను ఉపయోగిస్తోంది.

'సూపర్‌బెటర్' అనేది రకరకాల సమస్యలను ఎదుర్కోవడానికి ధైర్యాన్ని ఇచ్చి, నైపుణ్యాలు పెంపొందించే ఆట. 'ఎవ్రీవన్ హ్యాజ్ హీరోయిక్ పొటెన్షియల్' అనేది ఈ ఆట నినాదం.

'నువ్వు నీ గురించి అనుకున్నదాని కంటే బలవంతుడివి...అండగా నిలిచే ఆత్మీయులు నీకు బలమైన సైన్యమై ఉన్నారు...ఎందరికో నువ్వు రోల్ మోడల్‌వి...ఇలాంటి సానుకూల ఆలోచనల్లో నుంచి సమస్యలను జయించే శక్తి పుడుతుంది' అంటోంది 'సూపర్‌బెటర్'ను రూపొందించిన జేన్‌మెక్ గోనిగల్.

జేమ్‌మెక్ ఒకప్పుడు డిప్రెషన్ బారిన పడి అందులోంచి బయట పడింది. తాను కుంగుబాటు చీకటి నుంచి బయటపడిన విధానాన్ని ఒక ఆటగా మలిచి దీని గురించి తన బ్లాగ్‌లో రాసుకుంది. కొద్దికాలంలోనే బ్లాగ్‌లో నుంచి 'సూపర్‌బెటర్' రూపంలో డిజిటల్ ఆటగా మారింది.

న్యూరోసైంటిస్ట్‌ల సలహాల ఆధారంగా రూపొందించిన గేమ్... లుమినో సిటీ. ఈ గేమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వెంటనే 'మీరు ఎలాంటి స్కిల్స్ కోరుకుంటున్నారు?' అని అడుగుతుంది. కోరుకునే ఆప్షన్‌ని సెలెక్ట్ చేసుకోవచ్చు.

కొత్తగా ఆలోచించడానికి, ఒక సమస్యకు భిన్నమైన పరిష్కారాలు ఆలోచించడానికి ఉపకరించే ఇండి పజిల్ గేమ్ మాన్యుమెంట్ వ్యాలీ. ఈ గేమ్ యాప్ యాపిల్ డిజైన్, పాకెట్ గేమర్ 'గోల్డ్' అవార్డ్‌లను గెలుచుకుంది.

'మాన్యుమెంట్ వ్యాలీ' ప్రత్యేకత రిలాక్సింగ్ సౌండ్ ట్రాకింగ్, ఆకర్షణీయమైన డిజైన్.

సుడోకు ప్రేమికులను 'గుడ్ సుడోకు' ఆకట్టుకుంటోంది. 'పజిల్ ప్రేమికులకు ఇదొక ప్రేమ లేఖ' అంటోంది కంపెనీ.


ఇక ఫన్‌మెథడ్ వీడియో గేమ్ 'బ్లాక్‌బాక్స్'లో డజన్ల కొద్దీ మినీ గేమ్స్ ఉంటాయి. 'ఎలివేట్'లో ప్రత్యేకమైన వర్కవుట్ క్యాలెండర్ ఉంటుంది. 'ఫన్ అండ్ క్లిక్' పద్ధతిలో దీన్ని రూపొందించారు... ఇలా చెప్పుకుంటూ పోతే యువతరాన్ని ఆకట్టుకుంటున్న బ్రెయిన్ ట్రైనింగ్ గేమ్స్ ఎన్నో ఉన్నాయి.

'బస్సు కోసం ఎదురుచూసే క్రమంలో టైమ్ వృథా అయ్యేది. ఇప్పుడు మాత్రం రకరకాల బ్రెయిన్ జిమ్ గేమ్స్ ఆడుతున్నాను. కొత్త ఉత్సాహం వస్తోంది' అంటున్నాడు ముంబైకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి సాకేత్.

'మా తాతయ్యకు సుడోకులాంటి పజిల్స్‌ను సాల్వ్ చేయడం అంటే ఇష్టం. ఆయన కాలక్షేపం కోసం పజిల్స్‌ను సాల్వ్ చేస్తున్నారనుకునేదాన్ని. పజిల్స్ సాల్వ్ చేసే ప్రక్రియ వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని తెలుసుకున్నాక వినోదంతో కూడిన బ్రెయిన్ ట్రైనింగ్ గేమ్స్‌పై ఆసక్తి పెరిగింది' అంటోంది చెన్నైకి చెందిన భార్గవి.



'మన జీవితమే పెద్ద పజిల్. చావు నుంచి పుట్టుక వరకు రకరకాల పజిల్స్‌ను పరిష్కరిస్తూనే ఉండాలి' అనేది తాత్వికత ధ్వనించే మాట అయితే కావచ్చుగానీ రోజువారి జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి. వ్యక్తిత్వ వికాసానికి డిజిటల్ బ్రెయిన్ గేమ్స్‌ను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటోంది యువతరం.



'నేను పెళ్లి చేసుకునే అబ్బాయి ఫలానా హీరోలా ఉండాలి'
'నాకు భార్య కావాలంటే ఆ అమ్మాయికి అదృష్టం ఉండాలి'
ఇలాంటి... డైలాగ్‌లు టీన్స్ నుంచి ట్వంటీస్ వరకు చెప్పేవే.
అమ్మానాన్నలు తెచ్చిన సంబంధాలు వాస్తవంలోకి తెచ్చేవి.
అనేకానేక రాజీలతో బాసికానికి తలవంచి ఏడడుగులు పడేవి.
అది ఒకప్పుడు... ఇప్పుడు కాలం మారింది. ట్రెండ్ మారింది.
కొత్తకాలంలో కట్నం కాలగర్భంలోకి కలిసిపోనుందా?
అయితే... ఇది మంచి పరిణామమే.
అమ్మాయి విద్య ఉద్యోగాలతో సాధికారత సాధించిందా?
అయితే... ఇది ఇంకా గొప్ప శుభపరిణామమే.
భాగస్వామి ఎంపికలో యువత ప్రాధాన్యాలెలా ఉన్నాయి?
ఇండియాలో పెళ్లిళ్లను ట్రంప్ ప్రభావితం చేస్తున్నాడా?
అధ్యక్షుడిగా ట్రంప్ పోయినా ట్రంప్ భయం ఇంకా ఉందా?

• పెళ్లిళ్ల సీజన్ వస్తోంది

కొంగుముడి ఎప్పుడు?

'పెళ్లిలో పెళ్లి కుదరడం' ఒకప్పటి మాట. అంటే బంధువుల పెళ్లిలో పెళ్లి వయసుకు వచ్చిన అమ్మాయిలు, అబ్బాయిలు బంధువులందరి దృష్టిలో పడతారు. ఏం చదువుకున్నారు? ఉద్యోగం ఎక్కడ చేస్తున్నారు? వంటి వివరాలన్నీ కబుర్లలో భాగంగా బంధువులందరికీ చేరిపోయేవి. అబ్బాయికీ, అమ్మాయికీ బంధుత్వం కలిసే ఎవరో పెద్దవాళ్లు ఎవరో ఓ మాటగా అంటారు. మాటలు కలుపుకుంటారు. పెళ్లి కుదిరేది. శ్రావణమాసం పెళ్లిలో కలిసిన అమ్మాయి, అబ్బాయి విజయదశమి ముహూర్తాల్లో వధూవరులయ్యేవాళ్లు.

మరి ఇప్పుడు...

కాలం మారింది. ఎంతగా మారిందీ అంటే... బంధువులను కూడా ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్స్‌గా పలకరించుకునే తరం ఇది. దగ్గరి బంధువుల అమ్మాయి, అబ్బాయిల వివరాలు కూడా మ్యారేజ్ బ్యూరోల ద్వారా తెలుస్తున్న పరిస్థితి. సమాజంలో వచ్చిన ఈ మార్పుతోపాటు... జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో వచ్చిన మార్పు కూడా పెద్దదే. నుదుట బాసికాలు, మెడలో పూలదండలు ధరించకపోతే పెళ్లిపీటల మీద ఉన్న వాళ్లు వధూవరులా లేక కన్యాదాతలా అనే సందేహం కూడా ఎదురవుతుంటుంది. 'తొలి ప్రసవం కనీసం ముప్పై ఏళ్ల లోపు జరగడం శ్రేయస్కరం' అని వైద్యరంగం చెబుతూనే ఉంది. కానీ ఉన్నత విద్యావంతులైన అమ్మాయిలు పెళ్లికి సిద్ధమయ్యేటప్పటికే ముప్పయ్ దాటుతున్నాయి. ఆలస్యానికి కారణాలు ఒకటి–రెండు కాదు, అనేకం. భాగస్వామిని ఎంచుకోవడం పట్ల సమాజం ఎలా ఉందో తెలియాలంటే మ్యారేజ్ బ్యూరోతో మాట్లాడడం ఓ సులువైన మార్గం. హైదరాబాద్‌లోని అవినాష్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు కోటిరెడ్డి, జ్యోతి మ్యాట్రిమోనీ నిర్వాహకురాలు జొన్నలగడ్డ జ్యోతి, శ్రీకాకుళంలోని శ్రీసాయి నరసింహ సేవాసంఘం నిర్వాహకులు కరణం నరసింగరావు, తిరుపతికి చెందిన సాయి మ్యాట్రిమోనీ నిర్వాహకురాలు పసుపులేటి శ్వేత అనేక ఆసక్తికరమైన విషయాలను సాక్షితో పంచుకున్నారు.

ఇదీ నా స్టైల్ షీట్!

''పెళ్లి కుదర్చడం అనేది ఓ యాభై ఏళ్ల కిందట ఉన్నంత సులభం కాదిప్పుడు. తెరిచిన పుస్తకంలా ఒకరికొకరు బాగా తెలిసిన వాళ్ల మధ్య వివాహం జరిగే రోజులు కావివి. ఖండాల అవతలి వ్యక్తులతోనూ పెళ్లిబంధం కలపాలి. ప్రేమ పెళ్లిళ్లను పక్కన పెడితే పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకునే వాళ్లే మా దగ్గరకు వస్తారు. వాళ్లు తమ గురించి ఏ వివరాలిస్తారో ఆ వివరాలనే అవతలి వాళ్లకు అందివ్వగలుగుతాం. ఈ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. వంద పెళ్లిళ్లలో ఒక్క పెళ్లి విఫలమైనా మేము ఎక్కడో లోపం చేశామేమో అనిపిస్తుంది.

నేను ఇరవై ఏళ్లుగా ఈ ఫీల్డులో ఉన్నాను. వేలాది మంది క్లయింట్‌లతో మాట్లాడాను. రెండువేలకు పైగా పెళ్లిళ్లు చేశాను. ఈ అనుభవంతో ఈ ప్రొఫెషన్‌ని సమగ్రంగా తీర్చిదిద్దుకోవడానికి నాకు నేనుగా కొన్ని నియమాలను రూపొందించుకున్నాను.

• అబ్బాయి, అమ్మాయి ఉద్యోగం, చదువు, ఆస్తిపాస్తుల గురించి ప్రశ్నావళిలో ఇచ్చిన వివరాలు వాస్తవమేనా అనే సందేహం కూడా కలుగుతుంటుంది. సమగ్రంగా విచారణ చేసుకున్న తర్వాతనే ముందడుగు వేయాలి. ఇలాంటి ఎంక్వయిరీ కూడా మ్యారేజ్ బ్యూరో చేసి పెట్టగలగాలి. అలాగే ఆధార్ నంబర్, శాలరీ సర్టిఫికేట్‌లు తీసుకునే నియమం బ్యూరోలకు ఉంటే అబద్ధాలతో పెళ్లి చేసుకోవచ్చనే దురాలోచనను మొగ్గలోనే అరికట్టవచ్చు.

• యువతీయువకులు భాగస్వామి ఎంపిక విషయంలో చాలా పర్టిక్యులర్‌గా ఉంటున్నారు. తమకు నచ్చిన అంశాలన్నీ ఒక వ్యక్తిలో రాశిపోసి ఉండడం సాధ్యం కాదని, మనం కోరుకున్న లక్షణాలతో ఓ వ్యక్తిని తయారు చేయలేమని, ఉన్న ఆప్షన్స్‌లో సెలెక్ట్ చేసుకోవడం మాత్రమే మనం చేయగలిగింది అని పెద్దవాళ్లు చెప్పట్లేదు. ఈ విషయంలో అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలు కొంత త్వరగా నిర్ణయం తీసుకుంటున్నారు'' అన్నారు కోటిరెడ్డి.

ఇన్ని వడపోతలు పూర్తయి పెళ్లి జరిగిన తర్వాత కూడా ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోననే ఆందోళన ఈ తరం తల్లిదండ్రులకు తప్పడం లేదు. అందుకే వైవాహిక బంధం బలపడే వరకు కొంత కనిపెట్టి ఉండాలి. గాడి తప్పుతున్నట్లు అనిపిస్తే సరి చేయడం వరకే ఉండాలి పెద్దవాళ్ల జోక్యం. పిల్లల జీవితంలోకి దూరిపోయి వాళ్ల జీవితాలను తామే జీవించాలనుకోకూడదు.

ఇప్పటి పేరెంట్స్ దాదాపు చదువుకున్న వాళ్లే. అబ్బాయి తల్లిదండ్రులకు కూడా కోడలు వచ్చి తమను చూసుకోవాలనే ఆంక్షల్లేవు. పెళ్లి చేసిన తర్వాత వాళ్ల కుటుంబం వాళ్లను దిద్దుకోమని నూతన దంపతులను వేరే ఇంట్లో ఉంచడానికే ప్రయత్నిస్తున్నారు. మరో ముఖ్యమైన సంగతి... తల్లిదండ్రులు వృత్తి వ్యాపారాల్లో రిటైరై ఉంటే, పిల్లల పెళ్లి బాధ్యత పూర్తయిన తరవాత తమకిష్టమైన లేదా సమాజహితమైన వ్యాపకాన్ని పెట్టుకోవాలి.

- వాకా మంజులారెడ్డి

ట్రంప్ ప్రభావం

నేను పాతికేళ్లుగా వివాహవేదిక నడుపుతున్నాను. అప్పట్లో అమ్మాయి తల్లిదండ్రులైనా, అబ్బాయి తల్లిదండ్రులైనా అవతలి వారి కుటుంబ నేపథ్యాన్ని ప్రధానంగా గమనించేవారు. ఇప్పుడు డబ్బు, ఆస్తులు ప్రధానం అయ్యాయి. పాతికేళ్ల కిందట విదేశాల మోజు బాగా ఉండేది. పదవ తరగతి అమ్మాయికి కూడా యూఎస్ సంబంధాల కోసం ప్రయత్నించేవారు. ఈ ట్రెండ్ 1990- 2000 మధ్య బాగా ఉండేది. ఇప్పుడు అమ్మాయిలే చదువుకుని విదేశాలకు వెళ్తున్నారు. ఇప్పుడు చదువు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లిన అమ్మాయిలు, అలాగే అక్క, అన్న విదేశాల్లో ఉన్న అమ్మాయిలు మాత్రమే విదేశీ సంబంధాలు కోరుకుంటున్నారు. ట్రంప్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఇండియాలో ఉన్న అమ్మాయికి యూఎస్ అబ్బాయితో పెళ్లి చేసినవాళ్లు, అమ్మాయిని అమెరికా పంపించడానికి వీసా రాక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఇక్కడ కూడా మంచి ఉద్యోగాలున్నాయి కాబట్టి అమ్మాయి మా కళ్ల ముందే ఉంటుంది. ఇండియా సంబంధాలే చెప్పండి అంటున్నారు. అయితే అబ్బాయికి లక్ష రూపాయల జీతం ఉన్నా సరే 'ఏం సరిపోతుంది, ఇంకా పెద్ద జీతం ఉన్నవాళ్లను చెప్పండి' అంటున్నారు. పైగా 'మా అమ్మాయి సర్దుకుపోలేదు, కాబట్టి ఉమ్మడి కుటుంబం వద్దు' అనే నిబంధనలు ఎక్కువయ్యాయి. కట్నం అనేది పెద్ద విషయంగా చర్చకు రావడం లేదు. ఆడంబరాలు మాత్రం ఆకాశమే హద్దు అన్నంతగా పెరిగిపోయాయి. ఇక పెళ్లి వయసుదాటిపోతోందనే ఆందోళన అటు పేరెంట్స్‌లోనూ కనిపించడం లేదు. పెళ్లి చేసుకోవాల్సిన యువతీయువకుల్లోనూ కనిపించడం లేదు. ముప్పై సంవత్సరాలు దాటుతున్నా కూడా వయసును పట్టించుకోవడం లేదు.

- జొన్నలగడ్డ జ్యోతి



మళ్లీ యూఎస్ క్రేజ్

పదేళ్లుగా ఈ వ్యాపకంలో ఉన్నాను. మొదట్లో అబ్బాయిలు కానీ అమ్మాయిలు కానీ నాలుగైదు సంబంధాలు చూసి నిర్ణయం తీసుకునేవారు. ఇప్పుడు నలభై- యాభై సంబంధాలు చూసినా కూడా నిర్ణయం తీసుకోవడం లేదు. వయసు మీరిపోతున్నా ఎవరికీ పట్టింపు ఉండడం లేదు. అబ్బాయిలైనా, అమ్మాయిలైనా భాగస్వామి కోసం బంగారాన్ని గీటుపెట్టినట్లు చూస్తున్నారు. అబ్బాయి క్యాప్ పెట్టుకున్న ఫొటో పంపిస్తే 'బట్టతల కావచ్చు, క్యాప్ లేని ఫొటోలు పంపించండి' అంటున్నారు అమ్మాయిలు. ఇక అబ్బాయిలు కూడా తాము యావరేజ్‌గా ఉన్నా సరే... అందమైన అమ్మాయి కావాలంటారు. అబ్బాయిలైనా కొంతవరకు రాజీపడుతున్నారు కానీ అమ్మాయిలు కచ్చితంగా ఉంటున్నారు. ఓ మంచి మార్పు ఏమిటంటే... కట్నం ప్రాధాన్యం లేని విషయమైపోయింది. అలాగే ట్రంప్ హయాంలో అమ్మాయి తల్లిదండ్రులు యూఎస్ సంబంధాలు వద్దనేవాళ్లు. ఇప్పుడు మళ్లీ యూఎస్ సంబంధాలకు క్రేజ్ పెరిగింది.

- శ్వేత పసుపులేటి

లేటెస్ట్ ఫొటోలుండాలి!

మ్యారేజ్ బ్యూరోలో మేము ఒక ప్రశ్నావళిని సమగ్రంగా రూపొందించుకున్నాం. అబ్బాయి లేదా అమ్మాయితో స్వయంగా మాట్లాడతాం. సాధ్యమైతే బ్యూరోలోనే లైవ్ ఫొటో షూట్ చేయడం మంచిది. పేరెంట్స్ ఇచ్చే ఫైల్ ఫొటోలు కొన్ని సందర్భాల్లో బాగా పాతవి ఉంటాయి. ఫొటోలు ఉన్నట్లుగా లైవ్‌లో లేనట్లయితే అబ్బాయి అయినా అమ్మాయి అయినా డిజప్పాయింట్ అవుతారు. ఇక ఆ తర్వాత మిగిలిన ప్రత్యేకతలేవీ పరిగణనలోకి రావు.



- కోటిరెడ్డి

నిర్ణయం వధూవరులదే!

అమ్మాయికి పెళ్లి చేయాలంటే... ఓ ఇరవై ఏళ్ల కిందట అబ్బాయి కుటుంబ నేపథ్యాన్ని ప్రధానంగా చూసేవారు. ఇప్పుడు చదువు, ఉద్యోగం మొదటి ప్రాధాన్యంలో ఉంటున్నాయి. ఉద్యోగంలో కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు తొలి ప్రాధాన్యం, ఆ తర్వాత గవర్నమెంట్ ఉద్యోగం ఉంటోంది. వ్యాపారం అనగానే 'రిస్క్ అవసరమా' అంటున్నారు. వ్యవసాయం అయితే ఇక నాలుగో ప్రాధాన్యంలోకి వెళ్లిపోయింది. కరోనా తర్వాత విదేశాలంటే భయపడుతున్నారు. అంతవరకు విదేశాలతో సంబంధం లేని వాళ్లు మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. వధువు అక్క లేదా అన్న యూఎస్, యూకేల్లో ఉన్న ఆ దేశంలో ఉన్న అబ్బాయికే మొగ్గు చూపుతున్నారు. ఇక డిమాండ్‌ల విషయానికి వస్తే... వరుని ఎంపిక విషయంలో అమ్మాయిలు చాలా కచ్చితంగా ఉంటున్నారు. ఎంతో కొంత రాజీ పడుతున్నది అబ్బాయిలే.

చాదస్తం తగ్గింది

ఒక్కమాటలో చెప్పాలంటే పెళ్లిని ఒకప్పుడు వధూవరుల తల్లిదండ్రులు కుదిర్చేవాళ్లు, ఇప్పుడు వధూవరులు స్వయంగా నిర్ణయం తీసుకుంటున్నారు (అరేంజ్‌డ్ మ్యారేజ్‌ల విషయంలో కూడా). ఇప్పుడు దాదాపుగా అందరూ ఇద్దరు పిల్లల తల్లిదండ్రులే. వాళ్లు కొడుకు, కూతురు ఇద్దరినీ చదివిస్తున్నారు. ఇద్దరినీ ఉద్యోగాలకు పంపిస్తున్నారు. ఆస్తిని దాదాపుగా సమంగా ఇస్తున్నారు. దీంతో కట్నం ప్రస్తావన ప్రధానంగా కనిపించడం లేదు. తల్లిదండ్రులు కూడా పరిణతి చెందారు. ఒకప్పటిలాగ కోడలు తెల్లవారు జామున లేచి ఇంటి పనులు చక్కబెట్టాలని, తాము నిద్రలేచే సరికి కాఫీ కప్పుతో సిద్ధంగా ఉండాలనే చాదస్తాల్లేవు. ఉద్యోగానికి వెళ్లాల్సిన అమ్మాయి ఇంటి పనుల్లోనే అలసిపోవాలని కోరుకోవడం లేదు. ఇక పిల్లలిద్దరికీ పెళ్లి చేసిన వెంటనే వాళ్ల ఇళ్లకు వెళ్లిపోయి పిల్లలతో కలిసి జీవించాలనుకోవడం లేదు. బాధ్యతలు పూర్తయిన తమ విశ్రాంత జీవనాన్ని ప్రశాంతంగా గడపడానికి ఇష్టపడుతున్నారు.



- కరణం నరసింగరావు

* స్టడీ



ప్రియదర్శిని కర్వే

గ్రీన్‌లైఫ్

సముచిత పరిష్కారం

శతకోటి సమస్యలకు అనంతకోటి పరిష్కారాలు ఉన్నాయట! మనం చేయాల్సిందల్లా... ఆ పరిష్కారాల గురించి ఆలోచించడం. చిన్నప్పుడు తనకు ఎదురైన సమస్యను దృష్టిలో పెట్టుకొని దానికి శాస్త్రీయ పరిష్కారాన్ని అన్వేషించింది ప్రియదర్శిని కర్వే. 'సముచిత ఎన్విరో టెక్'తో పర్యావరణ ప్రేమికులను ఆకట్టుకుంటోంది...

చిన్నప్పుడు స్కూల్‌కు వెళుతున్నప్పుడు, వస్తున్నప్పుడు దారిలో తీయగా పలకరించే చెరుకుతోటలను చూసేది ప్రియదర్శిని. ఈ తీపిపలకరింపుల మాట ఎలా ఉన్నా తోటల్లో పంటవ్యర్థాలను దహనం చేసినప్పుడు నల్లటిపొగ చుట్టుముట్టేది. తోట నుంచి ఊళ్లోకి వచ్చి అక్కడ అందరినీ ఉక్కిరిబిక్కిరి చేసేది.

'ఈ సమస్యకు పరిష్కారం లేదా!' అనే ఆలోచన ఆమెతో పాటు పెరిగి పెద్దదైంది.

పుణెకు సమీపంలోని పల్తాన్ అనే చిన్న పట్టణానికి చెందిన ప్రియదర్శిని కర్వే సైంటిస్ట్ కావాలనుకోవడానికి, సైంటిస్ట్‌గా మంచిపేరు తెచ్చుకోవడానికి తన అనుభవంలో ఉన్న వాయుకాలుష్యానికి సంబంధించిన సమస్యలే కారణం.

కేంద్రప్రభుత్వం 'యంగ్ సైంటిస్ట్' స్కీమ్‌లో భాగంగా వ్యవసాయవ్యర్థాలకు అర్థం కల్పించే ప్రాజెక్ట్‌లో పనిచేసింది ప్రియదర్శిని.

ఇది తొలి అడుగుగా చెప్పుకోవచ్చు.

2004లో స్కాట్‌లాండ్‌లోని 'యూనివర్శిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్'లో బయోచార్ రిసెర్చ్ సెంటర్‌లో చేరింది. బయోమాస్ సాంకేతికతను లోతుగా అర్థం చేసుకోవడానికి ఈ రిసెర్చ్ సెంటర్ ఉపయోగపడింది. ఎంతో మంది ప్రముఖులతో మాట్లాడి, ఎన్నో విషయాలపై అవగాహన ఏర్పర్చుకునే అరుదైన అవకాశం దీని ద్వారా లభించింది.

'సముచిత ఎన్విరో టెక్' అనే కంపెనీ స్థాపించి పర్యావరణ అనుకూల వస్తువుల ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది ప్రియదర్శిని. తోటలోని చెట్ల వ్యర్థాలను తొలగించడం అనేది పెద్ద పని. చాలామంది ఆ వ్యర్థాలను ఒక దగ్గర చేర్చి మంట పెట్టి ఇబ్బందులకు గురవుతుంటారు. చుట్టుపక్కల వారిని ఇబ్బందులకు గురి చేస్తుంటారు.

ఈ నేపథ్యంలో 'సముచిత ట్రాన్స్‌ఫ్లాషన్ క్లీన్'తో అందరి దృష్టిని ఆకర్షించింది ప్రియదర్శిని. ఇది రివల్యూషనరీ డిజైన్‌గా పేరు తెచ్చుకుంది. ఈ బాక్స్ బట్టీలో తోట వ్యర్థాలను వేసి, మంటపెట్టి మూత పెడతారు. అవి బయోచార్ ఇంధనంగా మారుతాయి.

ప్రియదర్శిని మరో ఆవిష్కరణ పొగరహిత కుక్కర్.

'వంటగది కిల్లర్' అనే మాట పుట్టడానికి కారణం అక్కడ నుంచి వెలువడే పొగతో మహిళలు రకరకాల ఆరోగ్యసమస్యలకు గురికావడం. కట్టెలు, బొగ్గు మండించి వంట చేయడం తప్ప వేరే పరిష్కారం కనిపించని పేదలకు ఈ పొగరహిత కుక్కర్ సరియైన పరిష్కారంగా కనిపించింది.

కొద్ది మొత్తంలో బయోచార్‌ని ఉపయోగించి దీనితో వంట చేసుకోవచ్చు. పొగకు పొగ పెట్టవచ్చు. ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

పట్టణ ప్రాంత ప్రజల కోసం 'కార్బన్ ఫుట్ ప్రింట్ క్యాలిక్యులేటర్'ను తయారుచేసిన ప్రియదర్శిని కర్వే కొత్త కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టడమే కాదు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. వీటివల్ల తనకు తెలిసిన విషయాలను స్థానికులతో పంచుకోవడమే కాదు తనకు తెలియని సమస్యల గురించి కూడా తెలుసుకొని వాటి పరిష్కారానికి ఆలోచన చేస్తోంది ప్రియదర్శిని కర్వే.

వేతనం లేని పనికి గుర్తింపు ఉండదా?!

స్త్రీల ఇంటిపనికి ఎలాంటి గుర్తింపు, వేతనం ఉండదు. ఇదే విషయమై సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ప్రపంచవ్యాప్తంగా ఒక అధ్యయనం చేసింది. పేద, ధనిక దేశాలలోనూ ఈ విషయంలో అంతరాలనూ చూపించింది. గుర్తింపు లేని పని కారణంగా స్త్రీలలో పెరుగుతున్న మానసిక ఆరోగ్య సమస్యలు, ఇంటి పనితో పాటు ఉపాధి పొందుతున్న మహిళలపై పడుతున్న అధిక భారం గురించి కూడా చేసిన ఈ అధ్యయనం అన్నివర్గాల వారినీ ఆలోచింపజేస్తోంది.

ఇంటి పనులు, బాధ్యతలను సమతుల్యం చేయడం మహిళల నైతిక బాధ్యతగా అంతటా వాడుకలో ఉన్నదే. దీని వల్ల కలుగుతున్న నష్టాలనూ, భాగస్వామ్యంతో ఎలా సమన్వయం చేసుకోవాలో కూడా ఈ సంస్థ తెలిపింది.



తేలిక భావన

మహిళకు ఉదయం లేస్తూనే ఒక సాధారణ రోజుగా ప్రారంభమవుతుంది. ఊడవడం, తుడవడం, కడగడం, కుటుంబ సభ్యులకు భోజనం సిద్ధం చేయడం... ఈ రొటీన్ పనులన్నీ వీటిలో ఉండవచ్చు. వీటన్నింటి మధ్య వారు తమ భర్త లేదా పిల్లలు లేదా పెద్దలైన కుటుంబ సభ్యుల అవసరాలను చూస్తుంటారు. ఇక బయట ఉద్యోగం చేసే మహిళలైతే, ఇంటి పనులు పూర్తిచేయడంతో పాటు తమను తాము సిద్ధంగా ఉండటానికి సమయం కేటాయించాలి. ఆఫీస్ లోకి వచ్చాక ఆఫీస్ వర్క్‌తో ముడిపడి ఉండాలి. పిల్లలు స్కూల్‌కి వెళ్లాక, భర్త ఆఫీసుకు వెళ్లినప్పుడు గృహిణులు ఊపిరి పీల్చుకోవడం లేదు. చేయాల్సింది చాలా ఉంటుంది. ఇంటి పనులను చూసుకోవడం, చేయడం మహిళలు మాత్రమే చేయదగినపనిగా పరిగణించబడుతోంది. దీనిని దాదాపు అందరూ స్త్రీలను తేలికగానే తీసుకుంటారు. 'కాలక్రమేణా, వేతనంలేని శ్రమ కారణంగా పురుషుల కంటే స్త్రీలు మానసిక ఆందోళనకు గురవుతున్నారని హెల్త్ షాట్స్ సైకాలజిస్ట్ డాక్టర్ మాలినీ సబా తెలియజేస్తున్నారు.

డబుల్ బైండ్

ఇంటి యజమానులుగా గుర్తించే మగవారు కార్యాలయంలో పెద్దగా పనులు చేయనప్పటికీ వారు చాలా బిజీగా ఉంటారు. కానీ ఇంటిపని, పిల్లల సంరక్షణతో సహా వేతనంలేని పనికి ఉపాధి పొందుతున్న మహిళలు బాధ్యత వహిస్తారు. డాక్టర్ సబా ప్రకారం, 'గుర్తించబడని మహిళల శ్రమ రెండు రూపాలుగా ఆమెను సవాల్ చేస్తోంది. ఒకటి ఆమె శారీరక ఆరోగ్య సంరక్షణ తగ్గుతోంది. దీంతో పాటు మానసిక భారం అధికమవుతోంది.'

న్యాయమైన వాటా

పురుషులు ఇల్లు, పిల్లల పనుల్లోనూ వారి న్యాయమైన వాటాను తీసుకుంటే మహిళలపై చెల్లింపు లేని పని భారం తగ్గుతుంది. కలిసి పనులు చేసుకోవడంలోని అన్యోన్యత స్త్రీ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది వారి ఆదాయ వనరుల అవకాశాలను కూడా పెంచుతుంది. భావోద్వేగ ఒత్తిడి కూడా తగ్గుతుంది. పురుషులకు అనువైన ఏర్పాట్లను సాధారణం చేస్తే, పితృస్వామ్య, పెట్టుబడిదారీ డిమాండ్లను చర్చించడంలో స్త్రీలకు సమయం కలిసివస్తుంది.

అసమానతకు నిదర్శనం

ప్రపంచవ్యాప్తంగా ఉపాధి, నిరుద్యోగ మహిళలు జీతం లేని పనికి ఎక్కువ గంటలు వెచ్చిస్తున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. కోవిడ్–19 మహమ్మారి సమయంలో ఈ ధోరణి మరీ ఎక్కువగా కనిపించింది. సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం 2021లో పురుషుల 59 అదనపు గంటలతో పోలిస్తే మహిళలు 173 అదనపు గంటలు చెల్లింపు లేని ఇంటిపని, పిల్లల సంరక్షణ బాధ్యతలను తీసుకున్నారు. దిగువ, మధ్య ఆదాయ దేశాలలో ఈ అంతరం మరింత పెరిగింది. ఈ దేశాలలో మహిళలు పురుషుల కంటే మూడు రెట్లు ఎక్కువ గంటలు ఇల్లు, పిల్లలను చూసుకున్నారు.

భారాన్ని పెంచిన వర్క్ ఫ్రమ్ హోమ్

ఇంటి నుండి ఆఫీసు పని చేయడం చాలా మంది మహిళల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసింది. మహిళలు వంట చేయడం, శుభ్రపరచడం, పిల్లలు, పెద్దవారిని చూసుకోవడం.. వంటి ఉదాహరణలెన్నో ఉన్నాయి. ఇంటి నుండి ఆఫీసు పని చేయడం అనేది చాలా మందికి కష్టతరమైనది. దాంతో ఎంతో సమయాన్ని కోల్పోతున్నారు. దీనివల్ల స్త్రీలకు ఏ విధమైన వినోదం, విశ్రాంతి లేదా కోలుకోవడానికి సమయం దొరకడం లేదు. శారీరక, మానసిక వేధింపుల కథనాలలో ఒకటైన వైద్యం అందుబాటులో లేకపోవడం కూడా సమతుల్యత దెబ్బతింటుంది. మహమ్మారి సమయంలో పరిమిత ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సంరక్షణ సవాళ్లు, పిల్లల సంరక్షణ లేకపోవడం వల్ల చాలా మంది మహిళలు తమ కుటుంబాలను చూసుకోవడం కోసం తమ వృత్తిని విడిచిపెట్టారని నిపుణులు గుర్తించారు. ఇది ముఖ్యంగా నెలవారీ తక్కువ ఆదాయం కలిగిన తల్లులలో ఎక్కువగా ఉంది.

కిచెన్‌టిప్స్




• అవెన్‌లోని జిడ్డు, మరకలు పోవాలంటే అవెన్ చల్లబడిన తరువాత మరకలపై ఉప్పు నీటిని చల్లి తుడవాలి



• గిన్నె అడుగు మాడినప్పుడు దానిని ఎక్కువసేపు కష్టపడి తోమకుండా ఆ గిన్నెలో కొద్దిగా డిష్ సోప్ వేసి నీళ్లు పోసి కొంచెం సేపు చిన్న మంట మీద ఉంచాలి. ఆ తరువాత కడిగితే బాగా శుభ్రపడుతుంది.

• గిన్నెలు తళతళ మెరవాలంటే తోమడానికి వాడే పొడికి గానీ, సబ్బుకి గానీ ఒకటి రెండు టేబుల్ స్పూన్ల వెనిగర్ కలపాలి. వెనిగర్ గిన్నెలపై ఉండే జిడ్డుని వదలగొట్టి మెరిసేలా చేస్తుంది.



• పచ్చి బఠాణీ ఉడికించేటప్పుడు కొద్దిగా చక్కెర వేస్తే రంగు ఆకర్షణీయంగా ఉంటుంది. రుచి కూడా ఇనుమడిస్తుంది.



• చిన్న కప్పులో సోడా బై కార్బనేట్ వేసి ఫ్రిజ్‌లో ఒక పక్కగా ఉంచితే వంటల వాసనలను పీల్చుకుంటుంది. ఒకదాని తాలూకు వాసన మరొక దానికి పట్టదు.



• ఆకు కూరలను న్యూస్ పేపర్‌లో చుట్టి ఫ్రిజ్‌లో పెడితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.

• అరటికాయ చిప్స్ కరకరలాడాలంటే వేయించేటప్పుడు ముక్కల మీద ఉప్పు నీటిని చిలకరించాలి.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 11 । జనవరి । 2023



నిత్యాన్నదానానికి విరాళం
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ నిత్యాన్నదాన పథకానికి మంగళవారం విజయవాడకు చెందిన వైఎస్‌కేవీ ప్రసాద్ కుటుంబం రూ.1,00,001 విరాళంగా అందజేసింది.



రంగు మారినా మంచి ధర
రంగుమారిన ధాన్యానికి సైతం మంచి ధర వచ్చేలా కృషి చేస్తామని సివిల్ సప్లయిస్ డీఎం శ్రీధర్ తెలిపారు. పెదపారుపూడిలో ఆయన రైతులతో సమావేశం అయ్యారు. -IIలో▸



సంక్రాంతి సంబరాలు
కోనేరుసెంటర్: కృష్ణాజిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ వేడుకలో ఎస్పీ పి. జాషువా దంపతులు అతిథులుగా పాల్గొన్నారు.

ఆడపడచులు అదరహో..



విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకల్లో మెరిసిన విద్యార్థినులు

సొంతూరికి చలో..



విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

పందెం పుంజురో..



విజయవాడ-నూజివీడు రోడ్డులో సిద్ధమవుతున్న పందెం కోళ్లు

సంప్రదాయ సంబరం సంక్రాంతికి తెలుగిల్లు సంసిద్ధమవుతోంది. మూడు రోజుల పాటు వేడుకను వైభవంగా జరుపుకొనేందుకు సమాయత్తమవుతోంది. సుదూర ప్రాంతాన ఉన్న బంధుమిత్రుల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తోంది. పిండివంటల ఘుమఘుమలతో ఆహ్వానం పలుకుతోంది. మరోవైపు 'బరి'తెగించేందుకు పందెం కోడి తహతహలాడుతోంది. పాఠశాలలు, కళాశాలలు 'ముందస్తు' శోభతో కళకళలాడుతున్నాయి. సిటీకి అంతా బైబై చెప్పేసి పల్లె బాట పట్టారు. ఫలితంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిక్కిరిశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

న్యూస్‌రీల్

పెన్షనర్ల సమస్యలకు సత్వర పరిష్కారం



కోనేరుసెంటర్(మచిలీపట్నం): పెన్షనర్ల సమస్యలను సిబ్బంది సత్వరమే పరిష్కరించేలా పనిచేయాలని జిల్లా ఖజానా శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఎస్. రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మచిలీపట్నంలోని తహసీల్దార్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఉప ఖజానాశాఖ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఆయన పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ జారీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలిచ్చారు. పలువురు పెన్షనర్లకు ఆయనే స్వయంగా జీవన్ ప్రమాణ్ ఫేస్ యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు అందించారు. ఫిబ్రవరి 28వ తేదీలోగా పెన్షన్‌దారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. బందరు ఉపఖజానాశాఖ అధికారులు (ఎస్‌టీవోలు) రమేష్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు చిరు వ్యాపారులకు జగనన్న తోడు

చిలకలపూడి(మచిలీపట్నం): చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూతను అందించేందుకు జగనన్న తోడు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి అవస్థలు పడే చిరువ్యాపారుల అవస్థలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టాలు తెలుసుకున్న ఆయన ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. చిరువ్యాపారులకు ఆర్థిక చేయూతను అందించాలని రూ. 10 వేల వరకు వడ్డీ లేని రుణం అందించి ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేశారు. జగనన్న తోడు ద్వారా రుణం పొందిన వారు జిల్లాలో 31,050 మందికి రూ. 75.59 లక్షలు వడ్డీ లబ్ధిదారుల ఖాతాల్లో బుధవారం జమ చేయనున్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పి రంజిత్‌బాషా, లబ్ధిదారులు హాజరుకానున్నారు.

ఇసుక రీచ్



రీచ్ వద్ద లారీలోకి ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

- ఉమ్మడి జిల్లాలోని 15 ఇసుక డిపోల్లో 1.8 లక్షల టన్నుల ఇసుక నిల్వలు
- కొత్తగా 'ఎన్టీఆర్'లో 27 కొత్త రీచ్‌లకు ప్రతిపాదనలు
- నెలాఖరుకు అనుమతులు వచ్చే అవకాశం
- ఇసుక సరఫరాలో నాడు–నేడు, జగనన్న ఇళ్లు, ప్రభుత్వ భవన నిర్మాణాలకు ప్రాధాన్యం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: జిల్లాలో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇసుక కొరత ఎదురుకాకుండా ఉండటానికి అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. భవన నిర్మాణ పనులకు అనువైన సమయం కావడంతో ఇసుక ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులు కోరినంత సరఫరా చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా జగనన్న ఇళ్ల నిర్మాణం, నాడు–నేడు పనులు, ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నిర్మాణ పనుల కోసం కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసిన వెంటనే సరఫరా చేస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ

ఉమ్మడి జిల్లాలో 15 ఇసుక డిపోలు ఉన్నాయి. ఇప్పటికే వీటిలో 1.8 లక్షల టన్నులకు పైగా ఇసుక నిల్వలు ఉన్నాయి. వీటితో పాటు భవానీపురంలో 1.20 టన్నుల డ్రెడ్జింగ్ ఇసుక అందుబాటులో ఉంది. పారదర్శక విధానంలో, ప్రభుత్వం నిర్దేశించిన ధరకే నాణ్యమైన ఇసుక సరఫరా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. నిర్దేశించిన ధర కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకోవడానికి సెబ్‌తో, పాటు మైనింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

కొత్తగా 27 ఇసుక ఓపెన్ రీచ్‌లు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో గనిఆత్కూరు–2, మద్దూరు–3, నార్త్‌వల్లూరు–1, లంకపల్లిలంక–1, శ్రీశైలం–2, రొయ్యూరు–1, రొయ్యూరు–5, శ్రీకాకుళం–5, మద్దూరు–2 మొత్తం తొమ్మిది ఇసుక రీచ్‌లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. కృష్ణా నదిలో వరద తగ్గుముఖం పట్టడంతో ప్రస్తుతం ఉన్న రీచ్‌లతోపాటు కొత్తగా 27 ఇసుక ఓపెన్ రీచ్‌లను గుర్తించి ప్రతిపాదనలు పంపారు. ఇవి కూడా అందుబాటులోకి వస్తే మరింత ఇసుక లబ్ధిదారులకు అందుతుంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్సవాయి, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలులో 11 రీచ్‌లు, నందిగామ నియోజకవర్గంలోని నందిగామ, చందర్లపాడు, కంచికచర్లలో 16 ఇసుక రీచ్‌లను గుర్తించారు. వీటికి సంబంధించి ఇటీవల ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆధ్వర్యాన జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. పర్యావరణ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపారు. నెలాఖరుకు అనుమతులు వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

నాణ్యమైన ఇసుక సరఫరా....



జిల్లాలో అందరికీ అందుబాటులో, పారదర్శకంగా నిర్దేశించిన ధరలకే ఇసుక సరఫరా చేయడానికి చర్యలు తీసుకొంటున్నాం. నాడు–నేడు పనులు, జగనన్న ఇళ్లు, ప్రభుత్వ భవన నిర్మాణ పనులకు ప్రాధాన్యమిస్తున్నాం. వీటికి నాణ్యమైన ఇసుక సరఫరా చేస్తున్నాం. జిల్లాలో ప్రజలకు ఇసుక మరింత అందుబాటులోకి తేవడానికి కొత్త జిల్లాలో 27 ఓపెన్ రీచ్‌లను గుర్తించాం. స్టాక్ యార్డులో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి.

– ఎస్. ఢిల్లీరావు, కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

14 నుంచి ఇంద్రకీలాద్రిపై సంక్రాంతి సంబరాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఈ నెల 14వ తేదీ శనివారం నుంచి మూడు రోజులపాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించడానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో తొలి రోజు శనివారం తెల్లవారుజామున ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం వద్ద భోగిమంటలు, గంగిరెద్దుల ఆటలు, చెరకు గడలను ఏర్పాటు చేయనున్నారు. రాజగోపురం వద్ద బొమ్మల కొలువు ఏర్పాటుచేసి వివిధ రకాల బొమ్మలు ప్రదర్శిస్తారు. అమ్మవారి ఆలయంతోపాటు మల్లేశ్వరస్వామి బాలాలయం, ఇతర ఉపాలయాలకు సంక్రాంతి శోభ సంతరించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కేయూ స్ట్రాంగ్‌మన్ భరత్

విజయవాడ స్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పందిళ్ల భరత్‌కుమార్ సత్తాచాటి యూనివర్సిటీ స్ట్రాంగ్‌మన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని జాకీర్‌హుస్సేన్ కళాశాలలో ఇటీవల జరిగిన పోటీలకు విజయవాడలోని కేబీఎన్ కాలేజీ నుంచి భరత్ ప్రాతినిధ్యం వహించాడు. పవర్ లిఫ్టింగ్ స్క్వాట్(230 కేజీలు), బెంచి(115 కేజీలు), డెడ్‌లిఫ్ట్(210 కేజీలు) విభాగాల్లో సత్తా చాటి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మూడు విభాగాల్లో 555 కేజీల బరువు ఎత్తి స్ట్రాంగ్‌మన్ టైటిల్ సాధించాడు. మంగళగిరికి చెందిన భరత్.. కోచ్ సంధాని వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. గతంలో అనేక రాష్ట్ర, జాతీయ పతకాలను సాధించాడు. భరత్‌ను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు అభినందించారు.



భరత్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఇకపై సామాన్యులు నేరుగా కలెక్టర్ వద్దకు..



కలెక్టరేట్‌లో సామాన్యులతో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

అపాయింట్‌మెంట్ లేకుండా ఓపెన్ డోర్ పాలసీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎవరైనా కలెక్టర్‌ను కలవాలంటే ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సి ఉంటుంది. తీసుకున్నా కూడా కొన్ని సమయాల్లో కార్యాలయం ఎదుట వేచి ఉండాల్సి వచ్చేది. ఇకపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోనూ, క్యాంపు కార్యాలయంలోనూ కలెక్టర్‌ను కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం లేదు. ఉద్యోగులైనా, సామాన్యులైనా నేరుగా కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌ను కలవచ్చు. కలెక్టరేట్‌లోనూ, క్యాంపు కార్యాలయంలోనూ మంగళవారం తనను కలిసేందుకు అపాయింట్ మెంట్ లేకుండా ఓపెన్ డోర్ పాలసీకి కలెక్టర్ ఢిల్లీరావు శ్రీకారం చుట్టారు. స్పందన కార్యక్రమంలో అర్జీలు అందజేసే ప్రజలు తమ సమస్య ఏ శాఖకు సంబంధించిందో ఆ శాఖ జిల్లా అధికారినే నేరుగా కలిసే విధంగా కొత్త ఒరవడికి నాంది పలికిన కలెక్టర్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కలెక్టరేట్ తలుపులు బార్లా తెరిచి ఉండాలని ఓపెన్ డోర్ పాలసీ తీసుకువచ్చారు. తనను కలవడానికి వచ్చిన వారు వెనక్కి వెళ్లకుండా ఈ పాలసీ తీసుకువచ్చినట్లు కలెక్టర్ చెప్పారు. రాష్ట్ర, జిల్లా స్థాయి సమీక్ష సమావేశాలు లేదా ఇతర కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు మినహా ఇతర వేళల్లో కలెక్టర్ తన చాంబర్‌లో ఉన్నప్పుడు ఎవరైనా కలిసే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ ఓపెన్ డోర్ పాలసీ అమలుచేయడంతో ప్రజా సమస్యలను మరింత వేగంగా పరిష్కరించవచ్చనే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందన కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. మండల, డివిజన్ స్థాయి అధికారులు స్థానికంగా సమస్యలు పరిష్కరిస్తే కలెక్టరేట్‌ను ఆశ్రయించే అవసరం ఉండదని పేర్కొన్నారు. ఏ మండలాల్లో ఎక్కువ అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయో ఆ అధికారులతో ముఖాముఖి నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థుల ఇన్‌స్పైర్

- ఉమ్మడి కృష్ణా నుంచి 3,966 నామినేషన్లు
- రాష్ట్ర స్థాయిలో 279 ఎంపిక
- అవార్డులతో రాష్ట్రంలో మూడో స్థానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినూత్న ఆలోచనలతో ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యార్థులు సైన్స్ ప్రయోగాల్లో దూసుకుపోతున్నారు. సరికొత్త ఆలోచనతో ముందుకెళ్తున్నారు. ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ చూపి భావి సైంటిస్టులుగా ఎదగడానికి బాటలు వేసుకుంటున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ చాటారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు 3966 నామినేషన్స్ పంపగా వీటిలో 279 నామినేషన్స్ ఎంపికయ్యాయి. రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి కృష్ణా జిల్లా మూడో స్థానంలో నిలిచింది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో సత్తా చాటేందుకు విద్యార్థులు తమ మేధాశక్తికి పదును పెడుతున్నారు. ఎంపికైన 279 మంది ప్రభుత్వం అందించే ప్రోత్సాహక బహుమతి రూ.10వేలు సొంతం చేసుకున్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచేలా

సైన్స్, సాంకేతిక రంగాలపై విద్యార్థులకు ఆసక్తి పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీలను నిర్వహిస్తున్నాయి. 6 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను పోటీల్లో భాగస్వాములను చేస్తున్నారు. ఒక్కో స్కూల్ నుంచి 5 నామినేషన్లు పంపుతారు. వాటిలో అత్యుత్తమైన వాటిని ఎంపిక చేస్తారు. పర్యావరణ పరిరక్షణ, అధునాతన వ్యవసాయ విధానాలు, హెల్త్ న్యూట్రిషన్ వంటి అంశాలపై నూతన ఆవిష్కరణలు రూపొందించాల్సి ఉంటుంది.



గతేడాది జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్ (ఫైల్)

రాష్ట్రంలో మూడో స్థానం...

చిత్తూరు 836 ప్రాజెక్టులతో మొదటి స్థానంలో నిలవగా, కర్నూలు 352 ప్రాజెక్టులతో రెండో స్థానం, ఉమ్మడి కృష్ణా జిల్లా 279 ప్రాజెక్టులతో మూడో స్థానంలో నిలిచింది. ఈస్ట్ గోదావరి 279, కడప 273, నెల్లూరు 223, గుంటూరు 219, శ్రీకాకుళం 206, విశాఖ 203, అనంతపురం 193, విజయనగరం 135, ప్రకాశం 123 , పశ్చిమ గోదావరి నుంచి 122 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి.

వర్కింగ్ మోడల్స్ సిద్ధం చేయాలి



ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 279 నామినేషన్స్ ఎంపిక చేసిన ఎన్ఐఎఫ్ కు అభినందనలు. ఎంపికైన ప్రాజెక్టులపై త్వరలో ప్రదర్శన ఏర్పాటు చేస్తాం. విద్యార్థులు, గైడ్ టీచర్స్ జాతీయ స్థాయికి తగిన క్వాలిటీ, వర్కింగ్ మోడల్స్ సిద్ధం చేయాలి.

–సీవీ రేణుక, డీఈవో, ఎన్టీఆర్ జిల్లా

జాతీయ స్థాయిలో రాణిస్తాం

జిల్లాను రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిపిన విద్యార్థులకు అభినందలు. జాతీయ స్థాయిలో గట్టి పోటీ ఉంటుంది. ఆ స్థాయికి తగ్గట్టు సరికొత్త ఆలోచనలతో ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి. దానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. గతేడాది జాతీయ స్థాయికి ప్రాజెక్టు ఎంపికైంది. ఈ ఏడాది కూడా రాణించడానికి కృషి చేస్తున్నాం. జిల్లాకు మంచి పేరు తెస్తాం.

– మైనం హుస్సేన్, జిల్లా సైన్స్ అధికారి

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయసహాయాన్ని వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక సర్కారుతోటలోని వాసవీ వృద్ధాశ్రమంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ వృద్ధులు తమ ఆస్తిని ఇచ్చే దానపత్రాల్లో వారిని చూడకపోతే ఆ ఆస్తిని వెనక్కి తీసుకుంటామనే షరతును రాయాలన్నారు. అవసరమైన పరిస్థితుల్లో న్యాయసేవాధికార సంస్థ అండగా నిలుస్తుందన్నారు. సేవే పరమావధిగా భావించి వృద్ధులకు సేవలు చేస్తున్న ఆశ్రమ కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం అధ్యక్షులు తాడేపల్లి మల్లికార్జునరావు, ఉపాధ్యక్షులు కారుమూరి రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఉడత్తు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు వెన్నుదన్ను

ముమ్మరంగా ఖరీఫ్ ధాన్యం సేకరణ

- హమాలీ, రవాణాచార్జీల చెల్లింపుతో రైతులకు ఊరట
- 21 రోజుల్లోపు ధాన్యం సొమ్ము చెల్లింపులు

కంకిపాడు: రైతన్నకు సర్కారు అన్ని వేళలా వెన్నుదన్నుగా నిలుస్తోంది. అన్నదాతల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలో రైతు పక్షపాతి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి చర్య రైతుల్లో ధైర్యం నింపుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణను సమర్థంగా సాగిస్తూ మద్దతు ధర కల్పిస్తోంది. రవాణా ఖర్చులు రైతుకి భారం కాకుండా ఆ చార్జీలను సైతం చెల్లిస్తూ బాసటగా నిలుస్తోంది.

మద్దతిస్తూ..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పన లక్ష్యంగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఏ గ్రేడు ధాన్యానికి రూ. 2060, కామన్ రకానికి రూ. 2040 చొప్పున క్వింటాకు ధరను చెల్లిస్తున్నారు. పీఏసీఎస్, డీసీఎంఎస్, మార్కెట్ కమిటీల ద్వారా ధాన్యం సేకరిస్తున్నారు.

- కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌కు 5.50 లక్షల టన్నులు ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే జిల్లాలోని 25 మండలాల్లో 316 రైతు భరోసా కేంద్రాల ద్వారా 27 వేల మంది రైతుల నుంచి రూ 531.15 కోట్ల విలువైన 2,60,224.40 టన్నులు ధాన్యం సేకరించారు. ధాన్యం తరలించి నిర్ణీత 21 రోజుల గడువు లోపు సొమ్ము చెల్లింపులకు చర్యలు తీసుకుంటున్నారు. రూ. 298.94 కోట్ల సొమ్మును జమ చేశారు.
- ఎన్టీఆర్ జిల్లాలో 1.24 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం. 205 రైతుభరోసా కేంద్రాల ద్వారా 9,461 మంది రైతుల నుంచి 70 వేల టన్నులు ధాన్యం సేకరించారు. 5,689 మంది రైతులకు రూ 49.21 కోట్లు నిర్ణీత కాలంలో జమ చేశారు.



కంకిపాడు మండలం పునాదిపాడులో రైతులకు హమాలీ చార్జీల చెల్లింపులు

భారం కాకుండా..

ధాన్యం అమ్మకాల సమయంలో రైతులు ఇబ్బంది పడకుండా క్వింటాకు రూ. 25 హమాలీ చార్జీ చెల్లించనున్నట్లు ప్రకటించింది. నిర్ణయించిన ఏజెన్సీ ద్వారా ధాన్యం రవాణా జాప్యం అయితే, రైతులు సొంత వాహనాలను సమకూర్చుకుంటే చార్జీలు చెల్లిస్తామని పేర్కొంది.

- ఎన్టీఆర్ జిల్లాలో హమాలీ చార్జీలు ఇప్పటి వరకూ రూ. 38,840 చెల్లించారు. రవాణా చార్జీలు 166 మంది రైతులకు రూ. 5.03 లక్షలు చెల్లించారు.
- కృష్ణాజిల్లాలో రైతులకు రవాణా చార్జీల కింద రూ. 34.28లక్షలు చెల్లించారు. ఏజెన్సీ (కాంట్రాక్టరు)కి రూ. కోటి చెల్లించారు. హమాలీ చార్జీలు రూ. 3 కోట్లు రైతులకు చెక్కుల రూపంలో అందజేశారు.

పాత బకాయిలు చెల్లింపు..

హమాలీ చార్జీల విషయంలో గత సీజన్‌లలో పెండింగ్‌లో ఉన్న సొమ్మును సైతం ఈ దఫా విడుదల చేసింది. రూ. 4.50 కోట్లు మేరకు హమాలీ చార్జీలను రైతు ఖాతాలకు జమ చేశారు. పెండింగ్ బకాయిలపైనా ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు తీసుకోవటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని విధాలా మద్దతు లభించింది..



గ్రామంలో రెండున్నర ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానం నచ్చి ఆర్‌బీకే ద్వారా పంటను అమ్మాను. రూ. 1.24లక్షలు ధాన్యం సొమ్ము లభించింది. హమాలీ చార్జీలు అందాయి. 152 సారలు (సార అంటే 40 కిలోలు) మిల్లుకు తోలాను. ఇందుకు గానూ రూ. 1520 బ్యాంకులో జమ చేస్తూ చెక్కు అందించారు. మద్దతు ధర రావటంతో పాటుగా, కూలీ ఖర్చులు కూడా రావటం సంతోషంగా ఉంది.

– కొడాలి అంజియ్య, రైతు, పునాదిపాడు, కంకిపాడు మండలం

రైతులకు మద్దతు ధరే లక్ష్యం..



రైతులకు మద్దతు ధర కల్పనకు ప్రభుత్వం పనిచేస్తోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం నిర్దేశించిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి సమర్థంగా అమలు చేస్తున్నాం. రంగు మారిన ధాన్యం సేకరణ చర్యలు చేపట్టాం. జిల్లాలో 316 రైతుభరోసా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ 2.60 లక్షల టన్నుల ధాన్యం సేకరించాం. తాజాగా హమాలీ చార్జీలు, రవాణా చార్జీలను చెల్లించాం.

– అపరాజిత సింగ్, జేసీ, కృష్ణాజిల్లా

కానూరు రామాలయానికి రూ.5లక్షల విరాళం



కానూరు రామాలయానికి విరాళం అందిస్తున్న మాజీ ఎంపీటీసీ మాదు వెంకట సీతారామయ్య

పెనమలూరు: కానూరులో ఇటీవల పునఃప్రతిష్ఠ చేసిన రామాలయంలో ధూపదీప నైవేద్యాల నిర్వహణ నిమిత్తం మాజీ ఎంపీటీసీ సభ్యుడు మాదు వెంకట సీతారామయ్య రూ.5లక్షలు విరాళంగా ఆలయ కమిటీకి అందజేశారు. గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ అధ్యక్షుడు ముదిగొండ గోపాలకృష్ణ, కార్యదర్శి పెదపూడి దాసు, ఉపాధ్యక్షుడు అంగిరేకుల సీతారామయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1న విష్ణు సహస్ర నామ పోటీలు

విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 వ తేదీ విష్ణు సహస్ర నామ, అచ్యుతాష్టకం కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాల లోపు బాలబాలికలు అచ్యుతాష్టం, 15 సంవత్సరాలలోపు వారికి విష్ణు సహస్ర నామ పోటీలు జరుగుతాయని తెలిపారు. ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో ఉదయం 10 గంటలకు జరిగే పోటీలలో బాల బాలికలు పాల్గొనాలని విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని వివరాలకు 70322 55499 సంప్రదించాలని కోరారు.

పదిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

డీఈవో తాహెరా సుల్తానా

ఉంగుటూరు: పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యా శాఖ అధికారి తాహెరా సుల్తానా అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి జిల్లా విద్యాశాఖ అధికారి ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పాఠశాలల సందర్శన నేపథ్యంలో పాఠశాలలో పరిశుభ్రత, డైరీలు, స్టూడెంట్స్ మార్క్స్ ఎంట్రీస్, యాప్స్ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. పిల్లల నోట్స్ చెక్ చేయడం, బడి పిల్లల శాతం పెంచడం, సమయపాలన పాటించడం, రేమిడియల్ క్లాసులు నిర్వహించాలని ఆదేశించారు. 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్‌కి తరగతులు, 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు. 10వ తరగతి విద్యార్థికి ప్రణాళికలు సిద్ధం చేసి అందరూ ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ సహకారంతో విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో రూపొందించిన స్ఫూర్తి పుస్తకాలను అందరూ క్రమం తప్పకుండా చదవాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి నాలుగు రివిజన్ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో ప్రత్యేకంగా సమావేశమై విద్యార్థుల వివరాలు, నూరు శాతం ఉత్తీర్ణతకు ఏ విధమైన ప్రణాళికలు రూపొందించారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉంగుటూరులో మూడు మండలాల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో తాహెరా సుల్తానా

రూ.298 కోట్లు ధాన్యం సొమ్ము చెల్లించాం

జేసీ అపరాజిత సింగ్



దావులూరు బాలాజీ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్

కంకిపాడు: జిల్లాలో 2.60 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించామని, రూ.298 కోట్లు ధాన్యం సొమ్ము చెల్లింపులు చేసినట్టు కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ సూచించారు. మండలంలోని దావులూరు గ్రామంలోని బాలాజీ మిల్లును మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల రికార్డులను పరిశీలించారు. స్థానికంగా ఉన్న 20 వేల గోనె సంచులను తోట్లవల్లూరు మండలానికి తరలించాలని ఆదేశించారు. తేమశాతం నిర్ధారణ, రవాణా, గోనె సంచుల పంపిణీ విషయాలపై సమీక్షించారు. మిల్లు నిర్వాహకులు ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రికార్డులను సమర్థంగా నిర్వహిస్తున్నామని వివరించారు. జేసీ అపరాజిత సింగ్ మాట్లాడుతూ రంగు మారిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలని, మద్దతు ధర అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులకు అసౌకర్యం తలెత్తకుండా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. దళారులను ఆశ్రయించొద్దని, రైతు భరోసా కేంద్రాల్లో పంట విక్రయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఓ పార్వతి, తహసీల్దార్ టీవీ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకే బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ముగిసిన శిక్షణ

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో జేఎన్‌టీయూకే వారి పురుషుల బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ నెల 7నుంచి 10వ తేదీ వరకు పది మంది క్రీడాకారులకు ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్ తెలిపారు. ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు దక్షిణ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో కర్ణాటక రాష్ట్రం మంగుళూరులో ఈ క్రీడాకారులు తలపడనున్నారని చెప్పారు. కాలేజీ సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, డైరెక్టర్ డాక్టర్ బి.కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోదండ రామారావు, ఫిజికల్ డైరెక్టర్లు ఎం.శివశంకర్, జి.వెంకటేష్, డి.పూజిత ఉన్నారు.



శిక్షణ పొందిన క్రీడాకారులతో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్

రంగు మారినా మంచి ధర



మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ డీఎం శ్రీధర్

పెదపారుపూడి: పాయ వచ్చి రంగుమారిన ధాన్యంకు సైతం మిల్లర్లతో మాట్లాడి మంచి ధర వచ్చేలా కృషి చేస్తామని సివిల్ సప్లయిస్ డీఎం శ్రీధర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో తీసిన తేమ శాతంకు, రైస్ మిల్లులలో తీసిన తేమ శాతానికి చాలా తేడా ఉంటోందని, దీంతో మిల్లుల యజమానులు చాలా తక్కువ రేటుకు అడుగుతున్నారని పెదపారుపూడి గ్రామానికి చెందిన రైతులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన డీఎం శ్రీధర్ కొనుగోలు కేంద్రంలో తీసిన తేమ శాతానికి మిల్లుల్లో తీసిన దానికి మూడు, నాలుగు శాతం మించి తేడా రాకూడదన్నారు. మిల్లుల యజమానులతో మాట్లాడి మంచి ధర వచ్చేలా చేస్తామన్నారు. యలమర్రు కొనుగోలు కేంద్రంలో సంచులు ఇవ్వటం లేదని, లారీలు సక్రమంగా రావటం లేదని డీఎంకు రైతులు వివరించారు. ధాన్యం కొనుగోలు విషయంలో సమస్యలు ఉంటే స్థానిక తహసీల్దార్, లేదా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రౌండ్‌కు ఆర్చరీ క్రీడాకారులు సన్నద్ధం

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ ఆర్చరీ పోటీల్లో భాగంగా పలు రాష్ట్రాల నుంచి వచ్చిన అండర్-14 జట్లు ఇండియన్ రౌండ్‌కు సన్నద్ధమవుతున్నాయి. విజయవాడ వీఆర్ సిద్ధార్థ కాలేజీలో ఈ నెల ఎనిమిదవ తేదీన అండర్-14, అండర్-9 పోటీలు ప్రారంభమైన విషయం తెలిసిందే. అండర్-14 కాంపౌండ్, రికర్వ్ విభాగాల బాలబాలికల పోటీలు ఈ నెల తొమ్మిదో తేదీన ముగియడంతో ఇండియన్ రౌండ్(చెక్ బౌ) పోటీలకు క్రీడాకారులు సిద్ధమవుతున్నారు. నగరానికి చేరుకున్న పలు రాష్ట్రాల జట్లు మైదానంలో శిక్షణలో పూర్తిగా నిమగ్నమయ్యాయి. 11వ తేదీ ఉదయం నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు, ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. అన్ని రాష్ట్రాల నుంచి 250 మంది క్రీడాకారులు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. 30 మీటర్లు, 20 మీటర్ల విభాగాల్లో 720 పాయింట్లకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. తొలుత ర్యాంకింగ్ రౌండ్ అనంతరం 12వ తేదీన పోటీలను నిర్వహించి ఈ విభాగంలో విజేతలను ఎంపిక చేస్తామన్నారు.



ఇండియన్ రౌండ్ ఆర్చరీ జాతీయ పోటీలకు సిద్ధమవుతున్న ఆంధ్రా జట్టు

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉందని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఏపీ ఉర్దూ అకాడమీ హెచ్.నదీమ్ అహ్మద్ అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు మంగళవారం ఆర్టీసీ హౌస్ భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఆయన తనయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరో నాలుగడుగులు ముందుకు వేసి వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని అన్నారు. ముస్లిం మైనార్టీలందరూ రానున్న ఎన్నికల్లో సీఎం జగనన్నకు అండగా నిలబడి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కేఎండీ రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఏ షరీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ హెచ్ఎస్ ఎండీ అలీ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్

ఎడ్ల బండలాగుడు పోటీలకు సర్వం సిద్ధం

గుడివాడటౌన్: స్థానిక లింగవరం రోడ్డులోని కె.కన్వెన్షన్ నగర్‌లో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఎన్టీఆర్ టు వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆయన సోదరుడు కొడాలి నాగేశ్వరరావు(చిన్ని) ఆధ్వర్యంలో 2016 నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. దక్షిణ భారతదేశానికి చెందిన పలు ప్రాంతాల నుంచి ఒంగోలు జాతి ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. ఏటా ఈ పోటీలను తిలకించడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు వస్తారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జరుగుతున్న ఈ ఎడ్ల బండలాగుడు ప్రదర్శన జిల్లా లోని అన్ని ప్రాంత ప్రజలను విశేషంగా ఆకర్షిస్తోంది. రెండు, నాలుగు, ఆరు పళ్ల, సేద్య విభాగం, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో ఈ పోటీలు నిర్వహిస్తారు. వాటి స్థాయిని బట్టి 7, 10, 13, 17, 19, 22, 25 ఘనపుటడుగుల పొడవు గల బండలు లాగిస్తారు. సుమారు 1 ఘనపుటడుగు రాయి బరువు 85 కిలోలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పోటీలో పాల్గొన్న జట్లకు ఏడు బహుమతులు ఉంటాయి. అధిక మొత్తం రూ.లక్ష నుంచి రూ.5 వేల వరకు బహుమతులు ఉంటాయి. ప్రతి విభాగంలోనూ ఏడు స్థానాలకు బహుమతులు ఇవ్వడంతో పాటు పాల్గొన్న ప్రతి జట్టుకు జ్ఞాపిక అందజేస్తారు. పోటీలకు వచ్చే ఎడ్లకు, వాటి యజమానులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా భారీ వసతులు ఏర్పాటు చేశారు.



ఎడ్ల బండలాగుడు పోటీలకు సిద్ధమైన ప్రాంగణం

సోనోవిజన్ లక్కీడ్రా విజేతలకు బహుమతుల ప్రదానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సాకర్ ప్రపంచ కప్ టోర్నీ సందర్భంగా నిర్వహించిన ఓఎల్ఈడీ సాకర్ మానియా ఆఫర్‌లో భాగంగా లక్కీ డ్రాలో గెలుపొందిన కస్టమర్లకు విజయవాడలోని సోనో విజన్ విజయ టాకీస్ షోరూంలో బహుమతులు ప్రదానం చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్‌జీ కంపెనీ హెచ్ఈ డైరెక్టర్ హకీ యుయాన్ కిమ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు రూ.2లక్షల విలువైన ఎల్‌జీ ఓఎల్ఈడీ టీవీని బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజేతలను అభినందించి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈ బిజినెస్ హెడ్ గిరీశన్ గోపి, సీయోంగ్ జీ లీ, ఏపీ రీజనల్ మేనేజర్ వెంకట కృష్ణ, బ్రాంచ్ మేనేజర్ పి.కిషోర్ పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న హకీ యుయాన్ కిమ్

గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

- 4 కిలోలు స్వాధీనం
- తాడేపల్లి సీఐ శేషగిరిరావు వెల్లడి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీతానగరం బోటు యార్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తాడేపల్లి సీఐ శేషగిరిరావు తెలిపారు. స్థానిక స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించగా ఆ సమయంలో కొలనుకొండకు చెందిన కావలి ఉపేంద్ర ఇంట్లో గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా సీతానగరానికి చెందిన వల్లూరి రోజా తనకు గంజాయి ఇచ్చినట్లు సమాచారం ఇచ్చాడు. వెంటనే తమ సిబ్బంది మారువేషంలో రోజా ఇంటికి వెళ్లగా ఆ సమయంలో వల్లూరి సుబ్రహ్మణ్యం గంజాయి ప్యాకెట్లు బయటకు తీసుకు వచ్చాడని, అతడిని అదుపులోకి తీసుకోగా పాత నేరస్తురాలు అయిన రోజా విషయం బయటకు వచ్చిందని, ఆమె మరిది అయిన సుబ్రహ్మణ్యం నర్సీపట్నం నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్న చిన్న పొట్లాలు తయారు చేసి అమ్ముతున్నారని వివరించారు. వీరి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. గంజాయి అమ్మేవారిని పట్టుకోవడంలో చాకచక్యం చూపించిన ఎస్ఐ రమేష్, ఇతరసిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ సాంబశివరావు, ఎస్ఐలు వినోద్, శ్రీనివాసరావు, నారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుని మృతి



మృతి చెందిన శ్రీనివాసరావు

పెనమలూరు: కానూరు వందడుగుల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు శివాలయం ప్రాంతానికి చెందిన ముదిగొండ శ్రీనివాసరావు (48) న్యూ ఆటోనగర్‌లో పనులకు వెళ్తాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీనివాసరావు సోమవారం రాత్రి పని ముగించుకుని వందడుగుల రోడ్డులో నడుచుకుంటూ వస్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతుడి బంధువు ముదిగొండ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్లు జైలు

విజయవాడ స్పోర్ట్స్: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజిని మంగళవారం తీర్పు చెప్పారు. విజయవాడ చిట్టినగర్‌కు చెందిన బాలిక అదే ప్రాంతంలోని ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. బాలిక తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన సోమా రాము అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ బెదిరించాడు. 2016 ఏప్రిల్ 16వ తేదీన జరిగిన ఈ ఘటనపై సంబంధిత కొత్తపేట పోలీస్ స్టేషన్ అధికారులు కేసు నమోదు చేసి నిందితుడు రామును అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. బాధితుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వి. నారాయణరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.కల్యాణి న్యాయస్థానానికి వాదనలు వినిపించారు. ఆరుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు రాముకు జైలుశిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతుడు సునంద్ అనిల్ (ఫైల్)

నందిగామ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి నందిగామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం విజయవాడకు చెందిన చింతపల్లి సునంద్ అనిల్ (22) నందిగామ పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. పట్టణంలోని పాత బైపాస్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత స్థానిక డీవీఆర్ కాలనీ సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. ఆ సమయంలో ట్రాక్టర్ ట్రక్కును ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సునంద్ అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనంలో నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసుల్లో రూ.6.72లక్షలు జరిమానా

మైలవరం: ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలంలో విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఈ ఎం.ఆల్ఫ్రెన్స్, ఈఈ కూన వెంకటేశ్వర్లు, విజయవాడ ఈఈ, ఆపరేషన్ జీ.వీ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు 40 బృందాలుగా ఏర్పడి 3297 గృహ సర్వీస్‌లు, 83 వాణిజ్య సముదాయాల సర్వీస్‌లు తనిఖీ చేశారు. వాటిలో 223 సర్వీస్‌లకు ఆదనపు లోడు 325 కేడబ్ల్యూకు రూ.6,50,000 విధించినట్టు మైలవరం డీఈఈ ఐ.సుధాకర్ తెలిపారు. ఒక వినియోగదారుడు మీటర్ ఉన్నప్పటికీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించి అతనికి రూ.22,000 జరిమానా విధించామన్నారు.

క్లుప్తంగా

నేడు హెచ్‌బీ కాలనీలో ముగ్గుల పోటీలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సంక్రాంతి సందర్భంగా బుధవారం ఉదయం 11 గంటలకు భవానీపురం హెచ్‌బీ కాలనీలో ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ పూర్ణిమ ప్రకటనలో తెలిపారు. పోటీలు జరిగే ప్రదేశంలో ఆసక్తి ఉన్న మహిళల పేర్లు నమోదు చేసుకుంటామని పేర్కొన్నారు. ఈ పోటీలకు కార్పొరేటర్ బి.కోటిరెడ్డి అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేస్తారని తెలిపారు.

బీమా చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ అమర్‌నాథ్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన మేడి శామ్యూల్ కుటుంబానికి వైఎస్సార్ జీవిత బీమా పథకంలో మంజూరైన నాలుగు లక్షల తొంభై వేల రూపాయల చెక్కును శామ్యూల్ భార్య స్వాతికి మంగళవారం ఆరో డివిజన్ కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్ అందజేశారు. దేవినేని చారిటబుల్ ట్రస్ట్ తరపున దేవినేని అవినాష్ అందించిన రూ.పది వేలను కూడా ఆమెకు అందజేశారు.

నేడు బీఎస్ఎన్ఎల్ మెగా మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లాలో బుధవారం బీఎస్ఎన్ఎల్ మెగా మేళా నిర్వహించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ వై రవీంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో బీఎస్ఎన్ఎల్ కొత్త ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్, ఎఫ్‌టీటీహెచ్, ఫ్రీ సిమ్ కార్డులు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీలు ఉచితంగా బీఎస్ఎన్ఎల్ సిమ్ ఇవ్వడంతో పాటు ఆకర్షణీయమైన ఫస్ట్ రీచార్జి సదుపాయం కల్పిస్తారని తెలిపారు. ఈ సదవకాశాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


శ్యాంకుమార్ మృతదేహం

కృష్ణలంక(విజయవాడతూర్పు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు బస్టాండ్ పక్కనే ఉన్న బాలాజీ హోటల్ వద్ద ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడని హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడ్ని పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అతని వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా అతని పేరు టి.శ్యాం కుమార్(33) అని, కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు సిటీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అంతకు మించి అతని వివరాలు ఏమి తెలియవని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ఆలయ చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

గన్నవరం రూరల్: ఉపాధి హామీ పనులు ముమ్మరంగా నిర్వహించాలని డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ ఆదేశించారు. మంగళవారం మండలంలోని వీరపనేనిగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, డ్వామా ఆధ్వర్యంలో నడుస్తున్న నర్సరీని, జగనన్న లేఅవుట్‌లో గృహాల నిర్మాణ ప్రగతిని ఆయన పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పనుల కల్పన అధికంగా జరగాలన్నారు. నర్సరీని సందర్శించి మొక్కలను పంపిణీకి అనుకూలంగా పెంచాలని ఆదేశించారు. జూన్, జూలై నెలల్లో ఈ నర్సరీ నుంచి ఇతర ప్రాంతాలకు ఫలాలనిచ్చే మొక్కలు పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. మునగ మొక్కలు పంపిణీపై వివరాలు తెలుసుకుని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యప్రియ, సిబ్బందిని అభినందించారు. జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణం మరింత పురోగతి ఉండాలని హౌసింగ్ ఏఈ సాయికి చెప్పారు. లబ్ధిదారులకు హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రోత్సాహకం ఇస్తున్నట్లు చెప్పారు.

నీచ రాజకీయాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే గద్దె

- వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్తలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఓటమి భయంతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు మహిళలను రెచ్చగొట్టి నీచ రాజకీయాలకు పాల్పడుతూ తన వక్రబుద్ధిని బయటపెట్టుకున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ విమర్శించారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లోని తారకరామనగర్ కరకట్ట వద్ద మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో అవినాష్ మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా డివిజన్‌లోని పర్యటన ప్రాంతానికి వెళుతున్న క్రమంలో తమ కార్యకర్తలు, వలంటీర్‌పై టీడీపీ కార్యకర్తలు అకారణంగా గొడవకు దిగి దాడి చేసి గాయపరచడమే కాకుండా కులం పేరుతో దూషించడాన్ని తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం మూడున్నరేళ్లలోనే రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేయడంతో పాటు రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. గత 10 రోజులుగా ఈ ప్రాంతంలో గడప గడపకూ వెళ్తుంటే మహిళలు హారతులు పలుకుతూ ఘన స్వాగతం పలుకుతున్నారన్నారు. ప్రజల్లో తనకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకపోవడం, తనకు వైఎస్సార్ సపీ టికెట్ ఖరారు చేశారని ఓటమి భయంతో స్థానిక ఎమ్మెల్యే చిల్లర రాజకీయాలకు తెరలేపారన్నారు. సోమవారం గడప గడపకూ వస్తున్న విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ముందస్తు వ్యూహం ప్రకారం వారి మహిళా కార్యకర్తలను సిద్ధం చేసి తనను ప్రశ్నిస్తున్నట్లు వీడియోలు తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఆ మహిళల ఇంటిపై టీడీపీ జెండాలు, గోడల మీద ఎమ్మెల్యే ఫొటోలు చూస్తే కావాలనే ఒక పథకం ప్రకారం గొడవ చేసినట్లు అర్థమవుతుందన్నారు. టీడీపీ కార్యకర్త అయినప్పటికీ ఆమె అర్హతను బట్టి ప్రభుత్వ పథకాలన్నీ అందించామన్నారు. మంగళవారం గడప గడపకూ కార్యక్రమం జరిగే ప్రదేశానికి చేరుకున్న వలంటీర్‌తో ఆ టీడీపీ కార్యకర్తలు మళ్లీ గొడవకు దిగి దాడి చేశారన్నారు. దానిని అడ్డుకున్న వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్తలను కూడా కులం పేరుతో దూషిస్తూ కళ్లల్లో కారం చల్లి కర్రలతో దాడికి దిగడం వారి అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. గద్దె రామ్మోహన్ పైకి హుందాగా, మహాత్ముడిలా కబుర్లు చెబుతూ షో చేస్తారన్నారు. లోపల మాత్రం మహిళా కార్యకర్తలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేస్తారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎన్ని డ్రామాలు ఆడినా రాబోయే ఎన్నికల్లో తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని చెప్పారు. తమ కార్యకర్తలు, వలంటీర్‌పై దాడి చేసిన టీడీపీ కార్యకర్తలపై పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అవినాష్ పరామర్శ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోటలోని తారకరామనగర్‌లో టీడీపీ మహిళా కార్యకర్తల దాడిలో గాయాలపాలై చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్తలను తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పరామర్శించారు. మంగళవారం ఆయన ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకుని చికిత్స పొందుతున్న కార్యకర్తలు బి.సునీత, భూలక్ష్మి, వలంటీర్ శాంతిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అన్ని వేళలా కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఎన్ఆర్ఐలో సంక్రాంతి సంబరాలు


రంగోలి పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లులు


శ్రీ చైతన్యలో సంక్రాంతి వేడుకలు


ట్రెడిషనల్ షోలో విద్యార్థినులు

పటమట(విజయవాడతూర్పు): చిన్నారులు చదువుతోపాటు ఇతర అంశాలపై కూడా అవగాహన పెంచుకోవాలని, భారతీయ సంప్రదాయాన్ని తెలుసుకోవాలని, బెస్ట్ స్కిన్ హైర్ క్లీనిక్ డాక్టర్ ఉదయ శర్వాణి అన్నారు. మంగళవారం పటమట పోస్టల్‌కాలనీలోని ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల్లో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పండగలు ఐక్యతకు చిహ్నాలని, చిన్నారులు ఐక్యంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు రంగోలి, వంటల పోటీలు నిర్వహించారు. రంగోలి పోటీలకు ఉదయశర్వాణి న్యాయనిర్ణేతగా, వంటలపోటీలకు హోటల్ ఫార్చ్యూన్ మురళి పార్క్ చెఫ్ సుచిత్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సాయంత్రం ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఎన్ఆర్ఐ విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ కొమ్మారెడ్డి చైతన్య బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో..

లబ్బీపేట(విజయవాడతూర్పు): మన సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా పటమటలోని శ్రీచైతన్య స్కూల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగిమంటలు, బొమ్మల కొలువు, హరిదాసులు, గంగిరెద్దులు, రంగవల్లులు, గొబ్బెమ్మలు , చిన్నారులకు భోగిపళ్ల పోయడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. రేపటి తరానికి పల్లె సంస్కృతిని తెలియచేసేందుకు ఈ సంక్రాంతి వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల ఆర్ఐ పద్మ తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగ్గు అనేది సంప్రదాయం

పటమట(విజయవాడతూర్పు): ముగ్గు అనేది భారతీయ సంప్రదాయమని సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. పద్మజ అన్నారు. కళాశాల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రెడిషనల్ షో నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

సంక్రాంతి పండగకు రోజూ పది బస్సులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): సంక్రాంతి పండగను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ఆటోనగర్ ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు రోజూ 10 బస్సుల చొప్పున వివిధ సుదూర ప్రాంతాలకు నడుపుతున్నట్టు డీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం సాక్షితో మాట్లాడుతూ సంక్రాంతి రద్దీని తగ్గించేందుకు గాను సుదూర ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చేవారి కోసం హైదరాబాద్, విశాఖపట్నం, మద్రాస్, రాయచోటి, బెంగళూరుకు ఇక్కడి నుంచి బస్సులను నడుపుతున్నట్టు పేర్కొన్నారు. అంతే కాకుండా అన్ని వేళలా ప్రయాణికులకు అందుబాటులో సిబ్బంది ఉంటారన్నారు. రిజర్వేషన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడి నుంచి అన్ని సూపర్‌లగ్జరీ బస్సులను నడుపుతున్నట్టు చెప్పారు.

నేటి నుంచి ఉచిత చదరంగం శిక్షణ తరగతులు

విజయవాడ స్పోర్ట్స్: సంక్రాతి సెలవులను పురస్కరించుకుని పాఠశాలల విద్యార్థులకు చెస్ ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ డైరెక్టర్, జాతీయ ఆర్బిటర్ పి.రేణుకా తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్, మారుతీనగర్, పోరంకి ప్రాంతాల్లో ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆసక్తి ఉన్న వారు 97007 75220, 92471 53387ను సంప్రదించి ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నేషనల్ ఇన్‌స్ట్రక్టర్, ఫిడే ఆర్బిటర్ ఎన్.ఎం.ఫణికుమార్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు జరుతాయని తెలిపారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


తిరువూరులోని రైస్ మిల్లులో నిల్వచేసిన రేషన్ బియ్యం

తిరువూరు: రాజుపేటలోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 50 క్వింటాళ్ల బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం... రైస్‌మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించామని తెలిపారు. ఇందుకు బాధ్యులైన హరికృష్ణ, రాజు అనే వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు. 6–ఏ సెక్షన్ కింద కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

డ్వామా పీడీ సూర్యనారాయణ ఆదేశం


హౌసింగ్ అధికారులకు ఆదేశాలిస్తున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

గన్నవరం రూరల్: ఉపాధి హామీ పనులు ముమ్మరంగా నిర్వహించాలని డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ ఆదేశించారు. మంగళవారం మండలంలోని వీరపనేనిగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, డ్వామా ఆధ్వర్యంలో నడుస్తున్న నర్సరీని, జగనన్న లేఅవుట్‌లో గృహాల నిర్మాణ ప్రగతిని ఆయన పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పనుల కల్పన అధికంగా జరగాలన్నారు. నర్సరీని సందర్శించి మొక్కలను పంపిణీకి అనుకూలంగా పెంచాలని ఆదేశించారు. జూన్, జూలై నెలల్లో ఈ నర్సరీ నుంచి ఇతర ప్రాంతాలకు ఫలాలనిచ్చే మొక్కలు పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. మునగ మొక్కలు పంపిణీపై వివరాలు తెలుసుకుని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యప్రియ, సిబ్బందిని అభినందించారు. జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణం మరింత పురోగతి ఉండాలని హౌసింగ్ ఏఈ సాయికి చెప్పారు. లబ్ధిదారులకు హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రోత్సాహకం ఇస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఏపీడీ వెంకటరమణారావు, సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, పంచాయితి కార్యదర్శి బాపూజీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇమాం మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కవిత్వం సామాజిక అంశాల సమాహారం


సభలో మాట్లాడుతున్న చల్లపల్లి స్వరూపరాణి

విజయవాడ కల్చరల్: కవిత్వం సామాజిక అంశాల సమాహారమని, కవిత్వంలో ప్రజావేదన కనిపించాలని ఆచార్య కొలకలూరి స్వరూపరాణి అన్నారు. మద్దూరి బహుజన రచయితల వేదిక, దళిత చైతన్య స్రవంతి, సామాజిక న్యాయపోరాట సమితి ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో మంగళవారం మద్దూరి నగేష్‌బాబు స్మారక పురస్కార సభను నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వరూప రాణి మాట్లాడుతూ కవి సమాజంలోని అసమానతలపై ధిక్కారస్వరం వినిపించాలని సూచించారు. కవి నగేష్ బాబు తన కవిత్వం ద్వారా దళితులు ఇతర బడుగు బలహీన వర్గాలవారిపై తన స్వరం బలంగా వినిపించారన్నారు. పురస్కార కమిటీ కన్వీనర్ తంగిరాల సోని మాట్లాడుతూ న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు నగేష్‌బాబు స్మారక పురస్కారానికి ఆధునిక కవిత్వంలో కృషిచేసిన వారిని పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. సాహితీ విమర్శకుడు కే లక్ష్మీనరసయ్య సాహితీవేత్త శిఖా ఆకాష్, చప్పిడి కోటేశ్వరరావు ప్రసంగించారు. 2022 సంవత్సరానికి గానూ మద్దూరి నగేష్‌బాబు స్మారక ప్రధాన పురస్కారాన్ని పీ శ్రీనివాస గౌడ్ రచించిన ధైర్యవచనం కవితా సంపుటికి, స్ఫూర్తి పురస్కారాలకు సరికొండ నరసింహరాజు నెత్తుటిపాదాలు, డాక్టర్ గూటం స్వామి కవితా సంపుటి తిప్పుడు పొట్లాం, అవనిశ్రీ కవితా సంపుటి ధిక్కార ఖడ్గం, అమూల్యాచందు ఒంటిరొమ్ముతల్లి, సుంకర గోపాల్ రచించిన మానాయన పాటకు పురస్కారాలను అందజేశారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పరిశీలన


బూదవాడలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అమలు తీరు పరిశీలనలో భాగంగా జగ్గయ్యపేట మండలంలోని బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బూదవాడ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో స్థానికంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో ఏఎన్‌సీ, పీఎన్‌సీ రిస్క్ గర్భిణులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఏఎన్ఎంల యాప్ లలో వివిధ సేవలు నమోదు విధానంపై పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సేవలు తనిఖీ చేసి సూచనలు చేశారు. కార్యక్రమంలో బూచవరం వైద్యాధికారి డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించేలా శిక్షణ



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

పటమట(విజయవాడతూర్పు): బాల్యం నుంచే అన్ని రంగాల్లో రాణించేలా చిన్నారులకు శిక్షణ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ సచివాలయం చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ హదస్సా విజయసేన పేర్కొన్నారు. పటమట ఎన్ఎస్ఎం స్కూల్లో కిండర్‌గార్డెన్ వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ఆసక్తి కలిగిన అంశాల్లో తర్ఫీదు ఇవ్వాలన్నారు. మరో అతిథి గుడివాడ ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ యధిద్యా దేవర మాట్లాడుతూ చిన్నారులను ఉన్నతులుగా తీర్చిదిద్దితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి, కరస్పాండెంట్ మోంటీ పాల్గొన్నారు.

సంబరమే..!


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిత్యం పుస్తకాలతో కుస్తీలు పట్టే విద్యార్థులు మంగళవారం వాటిని పక్కన పెట్టి సంక్రాంతి సంబరాల్లో మునిగిపోయారు. సిద్ధార్థ కళాశాల గుడ్ హ్యాబిట్స్ క్లబ్, ఉమెన్స్ క్లబ్, కల్చరల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో కళాశాల మైదానంలో సంక్రాంతి సంబరాలను మంగళవారం నిర్వహించారు. కళాశాల ఆవరణను విద్యార్థినులు ముగ్గులతో నింపేశారు. గాలి పటాల ఎగురవేయడం, మెహందీ పోటీలు, తెలుగు అమ్మాయి–తెలుగు అబ్బాయి పేరుతో సంప్రదాయ వస్త్రధారణ పోటీలు, పొంగల్ తయారీ పోటీలు, బొమ్మలు కొలువు, భోగి మంటలతో కళాశాల ఆవరణ అంతా సందండి వాతావరణం నెలకుంది. అధ్యాపకులు సైతం విద్యార్థులతో కలిసి సందండి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావుతో పాటుగా అధ్యాపకులు రోహిణి కుసుమ, ఎం.భద్రజ, కె.శివరంజని, నాగశశాంక, శ్రావణి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.


భోగిమంట వేసి, నృత్యం చేస్తున్న విద్యార్థినులు, టీచర్లు

దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న కొల్లూరి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చలిలో వణుకుతూ పుట్‌పాత్‌పై నిద్రిస్తున్న యాచకులకు సామాజిక బాధ్యతగా దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, ఎక్స్ రే వాకర్స్ క్లబ్, లయన్స్ క్లబ్ ఆఫ్ అంజలి, దుర్గా తేజ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రాత్రి సమయంలో దుప్పట్లు పంచడం సంతృప్తిగా ఉందని ఎక్స్ రే కార్యదర్శి బి.ఆంజనేయరాజు అన్నారు. కార్యక్రమంలో సుబ్బయ్య, ఏడుకొండలు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, జయశ్రీ, కనకవల్లి, భాను, రాము పాల్గొన్నారు.



● పండగ కళ

సంక్రాంతి సందర్భంగా నగరంలో పలుచోట్ల మన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా సెట్టింగ్స్ ఏర్పాటు చేశారు. బందరు రోడ్డులోని ఓ వ్యాపార సంస్థ ఎదుట ఎడ్ల బండ్లు, హరిదాసులు, పండగకు ముస్తాబైన పూరిగుడిసెలు తదితర సెట్టింగ్స్ ఆకట్టుకుంటున్నాయి.

–సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ





రెండో రౌండ్‌లో రామ్‌కుమార్ జోడీ

అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్-2 టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)-రేయస్ వరేలా (మెక్సికో) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్-వరేలా ద్వయం 6-3, 7-6 (7/4)తో రాబిన్ హాస్-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్-వరేలా 14 ఏస్‌లు సంధించింది. రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.



ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీటీసీ) ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. దోహాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11-2, 5-11, 2-11, 5-11, 13-11, 11-9, 11-8తో చెన్ జు యు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన మనిక బత్రా 13-11, 11-9, 11-6, 11-8తో చెంగ్‌జు జు (హాంకాంగ్)పై గెలుపొందగా... దియా చిటాలె, స్వస్తిక, రీత్ టెన్నిసన్ ఓడిపోయారు.

గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం



తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, సైనా

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు ఆశాజనక ఫలితాలు లభించలేదు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణప్రసాద్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-19, 21-14తో యంగ్ ఎన్గా టింగ్-యంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) ద్వయంపై గెలిచింది.

మరోవైపు ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ 12-21, 21-17, 14-21తో హాన్ యుయె (చైనా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 10-21, 8-21తో వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్-కృష్ణప్రసాద్ ద్వయం 10-21, 18-21తో కాంగ్ మిన్ హుక్-సియో సెయుంగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 19-21, 14-21తో ప్రపంచ 17వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. గతంలో నిషిమోటోపై ఐదుసార్లు నెగ్గిన శ్రీకాంత్ 2018 తర్వాత ఈ జపాన్ ప్లేయర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్ (స్పెయిన్) పీవీ సింధు; ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో మాళవిక... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్ తలపడతారు.

హైదరాబాద్ 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో మంగళవారం జింఖానా మైదానంలో మొదలైన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (23; 4 ఫోర్లు), భగత్ వర్మ (11; 2 ఫోర్లు), అనికేత్ రెడ్డి (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/28), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/8) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 250 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌరాష్ట్ర 171 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి (3/74), రోహిత్ రాయుడు (2/20) రాణించారు.

రాణించిన జ్ఞానేశ్వర్



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 203 పరుగులు సాధించింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (81; 14 ఫోర్లు), కెప్టెన్ విహారి (76 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

తొలిసారి మహిళా అంపైర్లు...

రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో మంగళవారం తొలిసారి మహిళా అంపైర్లు అంపైరింగ్ బాధ్యతలు చేపట్టారు. జంషెడ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్-జార్ఖండ్ మ్యాచ్ కు గాయత్రి వేణుగోపాలన్... సూరత్‌లో రైల్వేస్-త్రిపుర మ్యాచ్‌కు జననీ నారాయణన్... పొర్వోరిమ్‌లో పాండిచ్చేరి-గోవా మ్యాచ్‌కు వృందా రాఠి అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు.

'రూట్స్ కొలీజియం'తో జత కట్టిన హంపి



సాక్షి, బంజారాహిల్స్: 'రూట్స్ కొలీజియం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' సంస్థ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్, 2019 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేత కోనేరు హంపిని నియమించింది. తన కొత్త భాగస్వామ్యంపై హంపి మాట్లాడుతూ...'రూట్స్ కొలీజియంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. నా చెస్ అనుభవాలను, ఆలోచనలను ఇక్కడి విద్యార్థులతో పంచుకుంటాను. నాకు తెలిసిన అంశాలు వారికి ఏదో రూపంలో ఉపయోగపడాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించింది. ఈ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం చైర్మన్ బీపీ పడాల కూడా పాల్గొన్నారు.

భారత్ 'టాప్'గేర్

- 'శత'క్కొట్టిన కోహ్లి
- రోహిత్, గిల్ దూకుడు
- తొలి వన్డేలో లంకపై 67 పరుగులతో భారత్ విజయం
- షనక సెంచరీ వృథా
- కోల్‌కతాలో రేపు రెండో వన్డే

కొత్త ఏడాదిలో ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు దుమ్మురేపింది. సొంతగడ్డపై ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి భారీ విజయంతో సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ కోహ్లి స్వదేశంలో వన్డేల్లో మళ్లీ సెంచరీ కొట్టగా... రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ కూడా మెరిశారు. ఫలితంగా శ్రీలంకపై గెలుపుతో 'వరల్డ్‌కప్ నామ' సంవత్సరానికి టీమిండియా ఘనమైన ఆరంభాన్నిచ్చింది.



కోహ్లి సెంచరీ అభివాదం

గువాహటి: 'టాప్'ఆర్డర్ బ్యాటర్ల వీరవిహారం చేయడంతో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించి సిరీస్ లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (87 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (67 బంతుల్లో 83; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 70; 11 ఫోర్లు) చెలరేగారు. అనంతరం శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ దసున్ షనక (88 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. నిసాంక (80 బంతుల్లో 72; 11 ఫోర్లు) రాణించాడు.

అదరగొట్టిన ఓపెనర్లు

విశ్రాంతి తర్వాత ఈ ఏడాదిని ఆరంభించిన కెప్టెన్ రోహిత్ శర్మ మునుపటి 'హిట్‌మ్యాన్'లా ఆడాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించాడు. రజిత వేసిన ఏడో ఓవర్లో రోహిత్ 2 సిక్స్‌లు, ఒక బౌండరీతో 17 పరుగులు పిండుకున్నాడు. మదుషంక ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన గిల్ కూడా బాదడం మొదలు పెట్టడంతో లంక బౌలర్లకు కష్టాలు తప్పలేదు. దునిత్ 19వ ఓవర్లో గిల్ 4, 4, 4, 1 కొడితే ఆఖరి బంతిని రోహిత్ సిక్సర్‌గా బాదాడు. 20వ ఓవర్ వేసిన షనక... గిల్‌ను అవుట్ చేసి 143 పరుగుల భాగస్వామ్యానికి తెరదింపాడు.

కోహ్లి కమాల్...

గిల్ అవుటయ్యాక కోహ్లి రాగా... కాసేపటికే రోహిత్‌ని మదుషంక బౌల్డ్ చేశాడు. లంక హమ్మయ్య! అనుకునేలోపే మరో ధాటైన ఇన్నింగ్స్‌కు కోహ్లి శ్రీకారం చుట్టాడు. బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 47 బంతుల్లో (3 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 52, 81 పరుగుల వద్ద లైఫ్‌లు పొందిన కోహ్లి సెంచరీ దిశగా తనదైన శైలీ షాట్లతో అలరించాడు. 41వ ఓవర్లో భారత్ 300 మార్క్ చేరుకోగా, కోహ్లి 80 బంతుల్లో (10 ఫోర్లు, 1 సిక్స్) తన వన్డే కెరీర్‌లో 45వ సెంచరీ సాధించాడు. 2019 మార్చి 8న ఆస్ట్రేలియాపై రాంచీలో చివరిసారి స్వదేశంలో వన్డేల్లో కోహ్లి సెంచరీ చేశాడు. 49వ ఓవర్లో కోహ్లిని రజిత అవుట్ చేశాడు.

లంకకు పేస్ దెబ్బ

భారత సీమర్లు సిరాజ్, ఉమ్రాన్, షమీల పేస్ బౌలింగ్‌కు శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. నిసాంక బాధ్యతగా ఆడినప్పటికీ టాపార్డర్ బ్యాటర్స్



షనక

అవిష్క ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను సిరాజ్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో మిడిలార్డర్ వికెట్లను సీమర్లు కూల్చారు. 206 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకున్న లంకను కెప్టెన్ షనక ఆదుకున్నాడు. షనక టెయిలెండర్ రజిత (9 నాటౌట్)లో కలిసి తొమ్మిదో వికెట్ కు 100 పరుగులు జోడించారు.

భారత్ క్రీడాస్ఫూర్తి

ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన షమీ... సెంచరీకి రెండే పరుగుల దూరంలో ఉన్న షనక (98 వద్ద) మన్కడింగ్ చేశాడు. నిజానికి ఇది అవుటే! కానీ కెప్టెన్ రోహిత్... షమీ దగ్గరకొచ్చి వారించాడు. వెంటనే షమీ అంపైర్‌తో అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నాడు. దీంతో షనక ఐదో బంతికి ఫోర్ కొట్టి సెంచరీ సాధించగలిగాడు.

9 శ్రీలంకపై అత్యధికంగా తొమ్మిది సెంచరీలు చేసిన బ్యాటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ (8) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు.

20 స్వదేశంలో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా సచిన్ (20) పేరిట ఉన్న రికార్డును తాజా శతకంతో కోహ్లి (20 సెంచరీలు) సమం చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) మదుషంక 83; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 70; కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113; అయ్యర్ (సి) ఫెర్నాండో (బి) ధనంజయ 28; కేఎల్ రాహుల్ (బి) రజిత 39; పాండ్యా (సి) హసరంగ (బి) రజిత 14; అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నే 9; షమీ (నాటౌట్) 4; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1-143, 2-173, 3-213, 4-303, 5-330, 6-362, 7-364. **బౌలింగ్:** కసున్ రజిత 10-0-88-3, మదుషంక 6-0-43-1, హసరంగ 10-0-67-0, కరుణరత్నే 8-0-54-1, దునిత్ 8-0-65-0, షనక 3-0-22-1, ధనంజయ 5-0-33-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 72; ఫెర్నాండో (సి) పాండ్యా (బి) సిరాజ్ 5; మెండిస్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 23; ధనంజయ (సి) రాహుల్ (బి) షమీ 47; షనక (నాటౌట్) 108; హసరంగ (సి) అయ్యర్ (బి) చహల్ 16; దునిత్ (సి) గిల్ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే (సి) రోహిత్ (బి) పాండ్యా 14; రజిత (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1-19, 2-23, 3-64, 4-136, 5-161, 6-178, 7-179, 8-206. **బౌలింగ్:** షమీ 9-0-67-1, సిరాజ్ 7-1-30-2, పాండ్యా 6-0-33-1, ఉమ్రాన్ 8-0-57-3, చహల్ 10-0-58-1, అక్షర్ 10-0-58-0.

మా ఇల్లే పాన్ ఇండియా



శ్రుతీహాసన్

శ్రుతీహాసన్ ఏదీ ప్లాన్ చేయరు. సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. అయితే ఇన్నేళ్లు ఉండాలని ప్లాన్ చేయలేదు. సినిమాకి దూరం కాకూడదనుకుంటారు. అంతే.. ఇక బాబీ దర్శకత్వంలో చిరంజీవితో చేసిన 'వాల్తేరు వీరయ్య', గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణతో చేసిన 'వీరసింహారెడ్డి'తో ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారామె. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ఈ 12న, 13న 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కానున్నాయి. ఈ సందర్భంగా శ్రుతి చెప్పిన విశేషాలు..

● రెండు చిత్రాలతో మీతో మీరే పోటీ పడటం ఎలా ఉంది?

నిజానికి ఇది ఊహించలేదు. తొమ్మిదేళ్ల క్రితం నా రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. అయితే పండగప్పుడు కాదు. ఫెస్టివల్ టైమ్‌లో రెండు పెద్ద చిత్రా లతో.. ఇద్దరు లెజెండరీ (చిరంజీవి, బాలకృష్ణ) హీరోల సినిమాలతో రావడం ఆశీర్వాదం అనుకుంటున్నా.

● రెండు సినిమాలూ హిట్టవ్వాలనే ఓ టెన్షన్ ఉంటుంది కదా...

టెన్షన్ అనేది సెట్లో పని చేస్తున్నప్పుడు మాత్రమే. ఎక్స్‌ప్రెషన్ సరిగ్గా వచ్చిందా? లేదా డైలాగ్ బాగా చెప్పానా? లేదా అనే టెన్షన్ ఉంటుంది. సెట్ నుంచి బయటికొచ్చేస్తే టెన్షన్ ఉండదు. ఎందుకంటే మిగతాదంతా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది.

● 'వాల్తేరు..', 'వీరసింహా...'లలో ఏ సినిమాలో మీ పాత్ర బాగుంటుందనే పోలిక రావడం సహజం..

నిజమే. అయితే రెండు సినిమాల కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ భిన్నంగా ఉంటాయి. నా పాత్రలు డిఫరెంట్‌గా, సవాల్‌గా ఉంటాయి. 'వీరసింహా..'లో నా పాత్ర కామెడీగా ఉంటుంది. కామెడీ చేయడం కష్టం. 'వాల్తేరు...'లో నా పాత్రని బాగా రాశారు.

● చిరంజీవి, బాలకృష్ణలతో డ్యాన్స్ చేయడం...

నైస్ ఎక్స్‌పీరియన్స్. 'వీరసింహారెడ్డి'లోని 'సుగుణసుందరి...' స్టెప్ బాగా రీచ్ అయ్యింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోని 'శ్రీదేవి... చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది.

● ఒక పాట మంచి ఎండ (సుగుణ సుందరి)లో.. మరో పాట (నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరు) విపరీతమైన చలిలో చేసిన అనుభవం గురించి?

ఇండియన్స్‌కి ఎండ సమస్య కాదు. కానీ చలి తట్టుకోవడం కష్టం. పైగా పల్చటి చీరలో మైనస్ 11 డిగ్రీల చలిలో చేయాల్సి వచ్చింది.

● ఈ విషయంలో హీరోయిన్లకే సమస్య. హీరోలు ఫుల్‌గా కవర్ చేసుకునే వీలు ఉంటుంది...

యూనిట్ అంతా నాలుగైదు లేయర్ల కోట్స్ వేసుకుంటే మేం చలిలో డ్యాన్స్ చేశాం (నవ్వుతూ). సార్ (చిరంజీవి) కూడా పెద్దగా కవర్ చేసుకోలేదు. ఒక కోట్.. అంతే.

● 'వీరసింహారెడ్డి' వేడుకలో పాల్గొన్న మీరు 'వాల్తేరు వీరయ్య' వేడుకలో పాల్గొనలేదు.. కారణం?

ఆరోగ్యం బాగాలేదు. పూర్తిగా రికవర్ కాకపోవడంతో వేడుకకు వెళ్లలేకపోయా. ఐయామ్ సో సారీ.

● ఆ మధ్య మీకు తెలుగులో గ్యాప్ వచ్చింది.... ఇప్పుడు ఇద్దరు సీనియర్ హీరోలతో, యంగ్ హీరో ప్రభాస్‌తో 'సలార్'.. వరుసగా సినిమాలు చేయడం ఎలా ఉంది?

మా ఇంట్లో మా అమ్మానాన్నని చూసి సినిమా అనేది ఫ్యామిలీ అనిపించింది. ఇక ఇండస్ట్రీ, ఆడియన్స్ పరంగా తెలుగు నాకు రియల్ ఫ్యామిలీ అంటాను. ఎందుకంటే సౌత్‌లో నేను పరిచయం అయింది తెలుగు సినిమాల ద్వారానే. ఒక కొత్త ప్రాంతంలో నాకు మంచి ఆహ్వానం దక్కింది. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. హిట్ ఇచ్చారు. 'క్రాక్' తర్వాత మళ్లీ తెలుగులో వరుసగా సినిమాలు చేయడం ఆనందంగా ఉంది.

'పాన్ ఇండియా' ట్రెండ్ గురించి మీ అభిప్రాయం?

నిజానికి నా లైఫ్ చూస్తే.. నేను పాన్ ఇండియన్‌ని (నవ్వుతూ). మా అమ్మ ముంబై (సారిక).. నాన్న (కమల్‌హాసన్) తమిళనాడు. మా డైనింగ్ టేబుల్ మీద మహారాష్ట్రియన్ ఫిష్ కర్రీ, చపాతి, సాంబార్, రైస్ అన్నీ ఉంటాయి. మాది ప్రాపర్ ఇండియన్ హోమ్. అమ్మ ముంబై నుంచి చెన్నై వెళ్లి తమిళ్ నేర్చుకున్నారు. మాట్లాడటం మాత్రమే కాదు.. రాయడం కూడా నేర్చుకున్నారు. నాన్న తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ, బెంగాలీ.. ఇలా చాలా భాషలు మాట్లాడతారు. ఇంట్లో హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మాట్లాడతాం. నా చిన్నప్పుడు ఒక సినిమా రిలీజ్ అంటే ముంబై, అట్నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్, లేకపోతే చెన్నై.. ఇలా వెళ్లేవాళ్లం. పాన్ ఇండియా కాన్సెప్ట్ అనేది నా మైండ్‌లో చిన్నప్పుడే ఉంది. అయితే బాలీవుడ్, టాలీవుడ్ అని పేరు వచ్చినప్పుడు మా నాన్న 'ఇండియన్ సినిమా అందాం. ఆ తర్వాత భాష గురించి మాట్లాడదాం' అనేవారు. నేను పుట్టి, పెరిగింది చెన్నైలోనే. కానీ హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. అట్నుంచి తెలుగుకి వచ్చాను. ఆ తర్వాతే తమిళ్‌కి పరిచయం అయ్యాను. చెప్పాలంటే 'మా ఇల్లే పాన్ ఇండియా'. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ అందరూ అన్ని సినిమాలూ చూడటం పాజిటివ్ విషయం.

సంక్రాంతి ఎలా జరుపుకుంటారు?

'సంక్రాంతి' అనే పదం నేను తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతే నా లైఫ్‌లోకి వచ్చింది. మాకు తమిళ్‌లో 'పొంగల్' అంటాం. పండగ రోజు పొంగలి వండుతాను. పూజ చేస్తాను. ఫ్యామిలీతో గడుపుతాను.

గోపీచంద్ మలినేని మిమ్మల్ని లక్కీ హీరోయిన్ అంటారు. లక్‌ని మీరు నమ్ముతారా?

లేదు.. హార్డ్ వర్క్‌ని, దేవుడిని నమ్ముతాను. ఒకవేళ ఎవరైనా నన్ను లక్కీ అంటే వాళ్లకు థ్యాంక్స్ చెబుతాను. అయితే నేను లక్, అన్‌లక్‌ని నమ్మను. ఎందుకంటే ఒకప్పుడు నన్ను 'అన్‌లక్కీ' అన్నారు. ఆ తర్వాత 'లక్కీ' అన్నారు. వేరేవాళ్లు నన్ను అలా అనడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను.


సీనియర్ హీరోల సరసన సినిమా చేస్తే ఇక ఆ హీరోయిన్ సీనియర్ హీరోల సినిమాలకే అని ఫిక్స్ అవుతుంటారు. ఇలాంటి టైమ్‌లో ప్రభాస్‌లాంటి యంగ్ హీరోతో 'సలార్' చాన్స్ రావడం అడ్వాంటేజ్ అనుకుంటున్నారా?

కథ, నా క్యారెక్టర్ మాత్రమే చూస్తాను. 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య' కథలు, నా పాత్రలు నచ్చాయి. ఫస్ట్ నుంచీ సినిమాని సినిమాగా చూసి, ఒప్పుకోవడం నాకు అలవాటు. అంతేకానీ వేరేవాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించి ఒప్పుకోను. నాకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చేస్తాను. 'సలార్' విషయానికి వస్తే.. నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టం. ప్రశాంత్ సార్ సినిమాలంటే ఇష్టం. ఆ పరంగా నేను హ్యాపీ. అది నాకు అడ్వాంటేజ్ అనుకుంటున్నాను.

సినిమా

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో...

పది భారతీయ చిత్రాలు



ప్రతిష్ఠాత్మక 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మార్చి 12న జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 301 చిత్రాలు ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. వాటిలో ఇండియా నుంచి 10 సినిమాలు ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఉన్నాయి. తొలి జాబితాలో 'ఆర్ఆర్ఆర్ (తెలుగు), చెల్లో షో (గుజరాతీ), మీ వసంతరావ్ (మరాఠీ), తుజ్యా సాథీ కహీ హై (మరాఠీ), ఇరవిన్ నిళల్ (తమిళ్)' వంటి చిత్రాలు ఇప్పటికే ఆస్కార్ నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా ఆస్కార్ అవార్డులకు పోటీపడేందుకు అవకాశం ఉన్న 301 చిత్రాల్లోని మిగతా జాబితాను అవార్డ్స్ కమిటీ మంగళవారం వెల్లడించింది. అందులో 'ది కశ్మీరీ ఫైల్స్' (హిందీ), 'గంగూబాయి కతియావాడి' (హిందీ), 'కాంతార' (కన్నడ), 'విక్రాంత్ రోణ' (కన్నడ), 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' (తమిళ్)' చిత్రాలు ఉన్నాయి. కాగా ఇండియా తరపున గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' ఆస్కార్ బరిలో నిలుస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు ఓపెన్ కేటగిరీలో నిలిచాయి.

ఇక ఏయే సినిమా ఏయే విభాగంలో పోటీ పడుతుందనే విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం (నాటు నాటు.. పాట)లో షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలోనూ 'ఆర్ఆర్ఆర్' షార్ట్‌లిస్ట్ అయిన సంగతి తెలిసిందే.

కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో 'కాంతారా' ఎంపికైంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది.

అదే విధంగా సుదీప్ హీరోగా అనూప్ బండారి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'విక్రాంత్ రోణ', సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ చిత్రం 'గంగుబాయి కతియావాడి', వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన 'ది కశ్మీరీ ఫైల్స్' వంటివి ఉత్తమ చిత్రం కేటగిరీలో షార్ట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి.

నేటి నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు ఓటింగ్‌కు అవకాశం ఉంటుంది. షార్ట్ లిస్ట్‌లోని తుది నామినేషన్లను ఈ నెల 24న ప్రకటిస్తారు.

పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది

- ఎస్ఎస్ తమన్



"పోటీ అనేది సినిమాల్లోనే కాదు.. ప్రతి చోటా ఉంటుంది. పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది. ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. అన్ని సినిమాలూ గొప్పగా ఆడాలి.. అందరూ బాగుండాలి'' అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) రిలీజవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన తమన్ చెప్పిన విశేషాలు.

● బాలకృష్ణగారితో నేను చేసిన 'అఖండ' సినిమాతో 'వీరసింహారెడ్డి'కి పోలికే లేదు. ఇది కల్ట్ మూవీ. ఎమోషనల్, సిస్టర్ సెంటిమెంట్, బాలకృష్ణగారి మాస్.. ఇలా అన్ని అంశాలతో అదిరిపోతుంది. ● దర్శకుడు మంచి సినిమా తీస్తేనే నేను మంచి మ్యూజిక్ ఇవ్వగలను. ఒక సినిమాకి పునాది దర్శకుడే. బాలకృష్ణగారి అభిమానిగా గోపీచంద్ చాలా గొప్పగా తీశారు.. దాని వల్లే నాకూ మంచి మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం వచ్చింది. సినిమా ఏం కోరుకుంటుందో అది ఇవ్వడమే మన పని. ఇందులో 'జై బాలయ్య, సుగుణ సుందరి, మాస్ మొగుడు..' వంటి పాటలన్నీ చక్కగా కుదిరాయి. మాస్ సినిమాలో కూడా కథ నుండే ట్యూన్ పుడుతుంది. ● 'అఖండ'లో మ్యూజిక్‌కి స్పీకర్లు పగిలిపోయాయి. 'వీరసింహారెడ్డి'లోనూ స్పీకర్లు పగులుతాయి జాగ్రత్త అని ముందే చెప్పాను. బాలకృష్ణగారిని చూస్తేనే ఎక్కువ వాయించేయాలనిపిస్తుంది (నవ్వుతూ). చాలా రోజుల తర్వాత సెకండ్ హాఫ్‌లో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లతో అదరగొట్టే సినిమా ఇది. పాప్‌కార్న్ తినే టైమ్ కూడా ఉండదు.. సినిమాని చూస్తూనే ఉంటారు. ● ఈ సంక్రాంతికి విడుదలవుతున్న చిరంజీవి గారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' రెండూ గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను.

వినరో... విష్ణు తత్త్వం



● కశ్మీరా, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పర్దేశీ జంటగా మురళీ కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ చెప్పినప్పుడే టైటిల్ చెప్పాడు మురళీ కిషోర్. నేను కథ మొత్తం విన్నాక 'ఇందులో ఏమైనా దేవుడి ఎలిమెంట్ ఉందనుకుంటున్నారా?' అని అడిగాడు. విష్ణు తత్త్వం ఇంత క్లారిటీగా కనిపిస్తోంది కదా! అన్నాను. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయపడే విధానాన్ని చాలా కమర్షియల్‌గా చెప్పినందుకు మురళికి థ్యాంక్స్'' అన్నారు. ''ఈ సినిమా మాది అనుకుని పని చేసిన టీమ్‌కి థ్యాంక్స్'' అన్నారు మురళీ కిషోర్. ''గీతా ఆర్ట్స్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చిన బన్నీ వాసూగారికి థ్యాంక్స్'' అన్నారు కిరణ్ అబ్బవరం.

నా కల తీరుతోంది

- సంతోష్ శోభన్



''నాన్న (శోభన్) దర్శకత్వంలో ప్రభాస్ అన్న నటించిన 'వర్షం' సినిమా 2004లో సంక్రాంతికి విడుదలై హిట్ అయింది. నా సినిమాని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసుకోవాలనేది నా కల.. 'కల్యాణం కమనీయం' చిత్రంతో అది తీరుతోంది'' అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సంక్రాంతికి బిగ్ స్టార్స్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. నేను కూడా 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు' చిత్రాలు చూస్తాను. నా సినిమా కాబట్టి 'కళ్యాణం కమనీయం' నాకు మరింత స్పెషల్. పెళ్లైన ఓ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగింది? అనేది 'కల్యాణం కమనీయం' కథ. యూవీ క్రియేషన్స్‌లో మూడు చిత్రాలు చేశాను.. మరో ముప్పై చేసేందుకైనా సిద్ధం. నా లైఫ్‌లో పేరున్న దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీలాంటి వారితో సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు.